

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 19-1-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 274 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: పంచమి ఉ. 7.31 తదుపరి షష్టి; నక్షత్రం: ఉత్తర సా. 5.30 తదుపరి హస్త; వర్జ్యం: రా.2.57-4.45, దుర్ముహూర్తం: సా.4.30-5.14, అమృతఘడియలు: ఉ.9.30-11.16, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.52, సూర్యాస్తమయం: 5.59 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda

మహా.. హైదరాబాద్!

hmda Growing Global

ప్రస్తుత హెచ్ఎండీఏ పరిధి.. ఏడు జిల్లాలు, 74 మండలాలు, దాదాపు వెయ్యి పంచాయతీలు, 8 కార్పొరేషన్లు, 38కి పైగా మునిసి పాలిటీలతో ఉంది.

హెచ్ఎండీఏ పరిధి మరింత విస్తరణ.. ఆర్ఆర్ఆర్ ఆవల 5 కి.మీ. దాకా

- ప్రస్తుతం 7,257 చదరపు కిలోమీటర్లలోనే అథారిటీ
- విస్తరణతో 13 వేల చదరపు కిలోమీటర్లకు పెరిగే అవకాశం
- హెచ్ఎండీఏలోకి కొత్తగా మరో 4 జిల్లాలు, 32 మండలాలు
- 11 జిల్లాలు, 106 మండలాలు, 43 అర్బన్ స్థానిక సంస్థలకు చేరిక
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన సర్కారు
- ఇటీవల సమీక్షించిన సీఎం రేవంత్
- త్వరలోనే బోర్డు, మంత్రివర్గంలో చర్చించి ఆమోదించే అవకాశం
- పరిధి విస్తరణతో అభివృద్ధికి ఊపు
- నగర శివారు ప్రాంత భూములకు ఇప్పటికే పెరిగిన డిమాండ్



హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని నగరం మరింతగా విస్తరించనుంది. త్వరలో నిర్మాణం జరుపుకోనున్న రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్)ను కూడా దాటి ముందుకు వెళ్లనుంది. హైదరాబాద్‌తోపాటు మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) పరిధిలో కేంద్రీకృతమైన అభివృద్ధిని మరిన్ని ప్రాంతాలకు విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా హెచ్ఎండీఏ పరిధిని పెంచి.. మరికొన్ని జిల్లాలను చేర్చాలని కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో ఆర్ఆర్ఆర్‌కు అవతల ఐదు కిలోమీటర్ల వరకు హెచ్ఎండీఏ పరిధి పెరగనుంది. తద్వారా.. ప్రస్తుతం 7,257 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న హెచ్ఎండీఏ పరిధి.. ఏకంగా 12 వేల నుంచి 13 వేల చదరపు కిలోమీటర్ల వరకు పెరిగే అవకాశాలున్నాయి. సుమారు ఐదారు వేల చదరపు కిలోమీటర్ల పరిధి అదనంగా పెరగనుంది. దాదాపు 17 ఏళ్ల తర్వాత హెచ్ఎండీఏ పరిధి పెరగనుండడంతో హైదరాబాద్‌ను ఆనుకొని ఉన్న పది జిల్లాల్లో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కనుంది. ఇప్పటికే రీజినల్ రింగ్ రోడ్డు రాకతో శివారు ప్రాంతాల భూములకు డిమాండ్ పెరగగా.. హెచ్ఎండీఏ పరిధి పెరుగుతుండడం మరింత అభివృద్ధికి బాటలు వేయనుంది. త్వరలో హెచ్ఎండీఏ బోర్డులో, రాష్ట్ర క్యాబినెట్‌లో చర్చించి విస్తరణ ప్రతిపాదనల్ని ఆమోదించే అవకాశాలున్నాయి. హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాల

మిగతా 12వ పేజీలో...

జిల్లా	హెచ్ఎండీఏలోకి వచ్చే మండలాలు
హైదరాబాద్	16
రంగారెడ్డి	27
మేడ్చల్ మల్కాజిగిరి	15
సంగారెడ్డి	11
యాదాద్రి భువనగిరి	10
నల్లగొండ	6
మెదక్	6
సిద్దిపేట	6
వికారాబాద్	5
మహబూబ్‌నగర్	3
నాగర్‌కర్నూల్	1



తెలంగాణ సాంస్కృతిక సంఘం సమావేశాన్ని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్, ఎమ్మెల్యేలు పోచారం, జయవీర్

ఫోర్త్ సిటీలో..

ఏఐ డేటా సెంటర్

- 100 మెగావాట్ల సామర్థ్యంతో ముచ్చర్లలో ఏర్పాటు
- రూ.3500 కోట్ల పెట్టుబడికి ఎస్టీ టెలీమీడియా సిద్ధం
- సింగపూర్‌లో సీఎం రేవంత్ సమక్షంలో ఒప్పందం
- ఫ్యూచర్ సిటీ, మూసీ ప్రాజెక్టుకు సహకరిస్తామని
- హామీ ఇచ్చిన ఆ దేశ వాణిజ్య మంత్రి గ్రేస్ ఫు హైయిన్
- సెమీ కండక్టర్ల రంగంలో పెట్టుబడులు పెట్టండి
- పారిశ్రామికవేత్తల భేటీలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

అర్హులకు ఇళ్లు, కార్డులు.. 21 నుంచి దరఖాస్తులు

- ప్రజా పాలనవీ పరిగణనలోకి.. ఆందోళన వద్దు
- కులగణన ఆధారంగా చేసింది తుది జాబితా కాదు
- ఇళ్లు, కార్డుల జారీ నిరంతరం: ఉత్తమ్, పొంగులేటి

14

హైదరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ పెట్టుబడి పెట్టేందుకు.. సింగపూర్ ప్రధాన కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన ఎస్టీ టెలీమీడియా సంసిద్ధత వ్యక్తం చేసింది. ఫోర్త్ సిటీ ముచ్చర్ల సమీపంలోని మీర్ఖాన్‌పేటలో డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకుంది. సింగపూర్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ నేతృత్వంలోని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారుల బృందం శనివారం ఎస్టీ టెలీమీడియా ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. ఎస్టీ టెలీమీడియా గ్రూప్ సీఈవో బ్రూనో లోపెజ్, ఇతర ఉన్నతాధికారులతో చర్చలు జరిపింది. ఈ సందర్భంగానే

మిగతా 13వ పేజీలో...

రేవంత్ ఫార్ములా ఏమిటో..!?

ఫార్ములా-ఈ వ్యవహారంలో కేటీఆర్ అడ్డంగా బుక్కయ్యారని ప్రభుత్వ వర్గాలు చెబుతుండగా, అసలు అవినీతే జరగనప్పుడు కేసు ఎక్కడ ఉంది? అని కేటీఆర్ ఎదురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఎంత బలంగా తన వాదన వినిపిస్తున్నదో.. కేటీఆర్ కూడా అంతే బలంగా తన వాదన వినిపిస్తున్నారు. దీంతో అసలు ఇందులో కేసు ఉందా? ఉంటే కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదు? అన్న అనుమానాలు ఏర్పడుతున్నాయి.

గతంలో ఓటుకు నోటు కేసులో కేసీఆర్ సర్కార్ రేవంత్ రెడ్డిని అరెస్టు చేయించి ఇబ్బందుల పాల్జేసింది. నాడు తనను వేధించినందుకు ప్రతీకారం తీర్చుకునే అవకాశం వచ్చినందున ఫార్ములా-ఈ రేసు కేసులో కేటీఆర్‌ను అరెస్టు చేస్తారన్న అభిప్రాయం బలంగా వ్యాపించింది.



కొత్త పలుకు

ఇలాంటి కేసులలో నిందితులు వెంటనే హైకోర్టుకు వెళ్లి బెయిలు కోరే అవకాశం లేకుండా శుక్రవారంనాడు అరెస్టు చేయడం ప్రభుత్వాలకు అలవాటుగా మారింది. ఈ నేపథ్యంలో హైకోర్టుకు సంక్రాంతి సెలవులు ప్రారంభమైనప్పుడు కేటీఆర్‌ను అరెస్టు చేస్తారని భావించారు. సెలవులు ముగిశాయి. కేటీఆర్ ఈడీ విచారణకు కూడా వెళ్లి వచ్చారు. ఇప్పుడు సీఎం రేవంత్ విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో ఎప్పుడైనా కేటీఆర్‌ను అరెస్టు చేయవచ్చునని ప్రచారం జరుగుతోంది.

కేటీఆర్ విషయంలో సీఎం రేవంత్ మనసులో ఏముందో తెలియడం లేదు. ఆయన గుంభనంగా ఉంటున్నారు. మంత్రులు మాత్రం జైలుకు వెళ్లడానికి కేటీఆర్ సిద్ధంగా ఉండాలని అడపాదడపా ప్రకటనలు చేస్తున్నారు. దీంతో మొత్తం వ్యవహారం ఇదిగో పులి అంటే అదిగో తోక అన్నట్టుగా తయారవుతోంది. కేటీఆర్‌పై ఏసీబీ అధికారులు కేసు కట్టి నెల అయిపోయినా తదుపరి చర్యలు లేకపోవడంతో అసలు కేసులో బలం ఉందా? అన్న అనుమానాలు సహజంగానే తలెత్తుతాయి. ఫార్ములా-ఈ కంపెనీకి లభించిన సొమ్ము తిరిగి తనకు వేరే రూపంలో అందినట్టు ఆధారాలు లేనప్పుడు అవినీతి కేసు ఎక్కడిదని కేటీఆర్ దబాయిస్తున్నారు. అయితే ప్రభుత్వం వాదన మరో విధంగా ఉంది. త్రైపాక్షిక ఒప్పందంలో భాగస్వామిగా ఏస్ నెక్స్ట్ జెన్ కంపెనీని ఎంపిక చేయడంలో కూడా అవకతవకలు జరిగాయని, కేవలం రెండు లక్షల ఈక్విటీతో ప్రారంభించిన కంపెనీ ఒక్క సీజన్‌కు 200 కోట్లు చెల్లించగలదని ఎలా నిర్ణయించారు? ఏస్ నెక్స్ట్ జెన్ కంపెనీ భాగస్వాములు అందరూ కేటీఆర్‌కు వ్యక్తిగతంగా సన్నిహితులు అని, వారిని కాపాడడానికే త్రైపాక్షిక ఒప్పందం అమలులో ఉండగానే ద్వైపాక్షిక ఒప్పందాన్ని తెర మీదకు తెచ్చారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

4

కేటీఆర్ తప్పు చేశారని నిరూపించడానికి బలమైన ఆధారాలు సేకరించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలన్న ఆలోచనలో ఏసీబీ అధికారులు ఉన్నట్టు చెబుతున్నారు. త్రైపాక్షిక ఒప్పందం గడువు ముగియక ముందే ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ఏస్ నెక్స్ట్ కంపెనీకి భారీ ఉపశమనం కలిగించడం తప్పిదమే. ఈ కంపెనీ బదులు హెచ్ఎండీఏ ద్వారా చెల్లింపులు చేయడం కూడా నేరమే. అయితే ఈ రెండు సందర్భాలలో కేటీఆర్‌కు ప్రత్యక్ష సంబంధం ఉందని రుజువు చేయాల్సి ఉంటుంది.

బీఆర్ఎస్‌కు రూ.41 కోట్లు

ఎందుకిచ్చారు?

- ప్రమోటర్‌గా చాన్స్ వస్తుందని తెలిసే సంస్థను నెలకొల్పారా?
- క్రీడలతో సంబంధం లేని మీరు ఎందుకు ఈ రంగంలోకి దిగారు?
- కేటీఆరే ఆహ్వానించారా?.. మధ్యలోనే ఎందుకు వైదొలిగారు?
- ఫార్ములా-ఈ కేసులో ఏస్ నెక్స్ట్‌జెన్ ఎండీ అనిల్‌కు ఏసీబీ ప్రశ్నలు
- నష్టం వల్లే తప్పుకొన్నామన్న అనిల్.. మూడున్నర గంటల విచారణ
- మరోసారి పిలుస్తామన్న అవినీతి నిరోధక సంస్థ



అనిల్‌కుమార్

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు ప్రమోటర్‌గా వ్యవహరించిన ఏస్ నెక్స్ట్‌జెన్ కంపెనీ ప్రతినిధులు శనివారం ఏసీబీ ఎదుట విచారణకు హాజరయ్యారు. వీరిలో ఆ సంస్థ ఎండీ చలమలశెట్టి అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారి నుంచి వివరాలు రాబట్టేందుకు

మిగతా 12వ పేజీలో...



పురుగు మందు తాగిన తర్వాత బ్యాంకు వద్ద కూర్చున్న దేవ్‌రావ్

బ్యాంకులోనే రైతు బలవన్మరణం

- ఐదు ఎకరాలు తాకట్టు పెట్టి
- రూ.మూడున్నర లక్షల రుణం
- దిగుబడి లేక ఓ వాయిదా జాప్యం
- చెల్లించాలంటూ వేధింపులు
- మేనేజర్‌తో మాట్లాడి వచ్చాక
- పురుగు మందు తాగిన రైతు
- కాసేపటికి కుప్పకూలి మృతి
- ఆదిలాబాద్ ఐసీఐసీఐలో ఘటన
- బ్యాంకు ఎదుట బాధిత రైతు
- కుటుంబం, ప్రజల ఆందోళన
- రుణమాఫీకి బ్యాంకు అంగీకారం
- మృతుడి కుమారుడికి ఉద్యోగం

13



ఎన్టీఆర్ ఘాట్‌లో నివాళి అర్పిస్తున్న లోకేశ్, భువనేశ్వరి తదితరులు

ఎన్టీఆర్ ఘాట్ ఇలానా?

- నిర్వహణపై ఏపీ మంత్రి లోకేశ్ అసంతృప్తి
- గోడలు, పైకప్పు పెచ్చులు ఊడిపోవడంపై అసహనం
- సొంత నిధులతో మరమ్మతులకు సిబ్బందికి ఆదేశాలు
- వర్ధంతి సందర్భంగా టీడీపీ వ్యవస్థాపకుడికి నివాళులు
- తరలివచ్చిన కుటుంబసభ్యులు, అభిమానులు, నేతలు

3

మీ ఈపీఎఫ్ వ్యక్తిగత వివరాల్లో మార్పులు మీరే చేసుకోవచ్చు!

- ఖాతా బదిలీ కూడా యజమాని ప్రమేయం లేకుండా ఆన్‌లైన్‌లోనే
- ఈ-కేవైసీ, ఆధార్‌తో అనుసంధానం పూర్తయిన సభ్యులకే వర్తింపు

న్యూఢిల్లీ, జనవరి 18: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) సభ్యులు ఇక మీదట తమ ఈపీఎఫ్ ఖాతాలో ఉన్న వ్యక్తిగత వివరాలను ఆన్‌లైన్‌లో తమంతట తామే మార్చుకోవచ్చు. యజమాని ధ్రువీకరణగానీ, ఈపీఎఫ్ఓ ఆమోదంగానీ అవసరం లేదు. అంతేకాదు, యజమాని ప్రమేయం లేకుండానే ఈపీఎఫ్ ఖాతా బదిలీకి కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు ఈపీఎఫ్ఓలో కొత్త సేవలు శనివారం నుండి అందుబాటులోకి వచ్చాయి. వీటిని కేంద్ర కార్మిక, ఉపాధిశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేరు, పుట్టినతేదీ, లింగం, జాతీయత, తల్లి/తండ్రి పేరు, భార్య/భర్త పేరు, ఈపీఎఫ్‌లో చేరిన తేదీ, వైదొలిగే తేదీ వంటి వ్యక్తిగత వివరాల నమోదులో దొర్లే తప్పులను ఇక మీదట సభ్యులే స్వయంగా సరిదిద్దుకోవచ్చన్నారు. అయితే, ఆధార్ నెంబర్‌తో అనుసంధానిస్తూ 2017 అక్టోబరు 1వ తేదీ తర్వాత యూఏఎన్ (యూనివర్సల్ అకౌంట్ నెంబర్) జారీ అయిన సభ్యులకే ఇది వర్తిస్తుందని చెప్పారు. ఈ తేదీ కంటే ముందు యూఏఎన్ జారీ అయిన సభ్యుల వ్యక్తిగత వివరాల్లో సవరణలను.. వారు పని చేసే కంపెనీలే చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఈపీఎఫ్ఓ ఆమోదం అవసరం లేకుండానే ఈ మార్పులు జరుపుకోవచ్చని తెలిపారు. ఆధార్‌తో అనుసంధానించని ఖాతాల విషయంలో మాత్రం.. వ్యక్తిగత వివరాల్లో మార్పుల కోసం సంబంధిత ధ్రువీకరణ పత్రాలను యజమానికి అందజేస్తే, వాటిని యజమాని పరిశీలించి ఈపీఎఫ్ఓకు పంపించాల్సి ఉంటుందని.. ఈపీఎఫ్ఓ ఆమోదం తర్వాత మార్పులు నమోదవుతాయని మాండవీయ వెల్లడించారు. ఈపీఎఫ్ ఖాతా బదిలీ అంశంపై స్పందిస్తూ.. ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకున్న ఈపీఎఫ్ ఖాతాదారులు యజమాని ప్రమేయం లేకుండానే ఆధార్ ఓటీపీతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వ్యక్తిగత వివరాల్లో మార్పుల కోసంగానీ, ఖాతా బదిలీ కోసం గానీ ఇప్పటికే యజమానికి దరఖాస్తు చేసుకున్న వారు దానిని ఉపసంహరించుకొని, ఆన్‌లైన్‌లో తామే స్వయంగా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

జేఈఈ మెయిన్స్ అడ్మిట్ కార్డుల విడుదల

- 22 నుంచి 24 వరకు మొదటి దశ పరీక్షలు

హైదరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): దేశంలోని ఐఐటీల్లో ప్రవేశం కోసం జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ) మెయిన్ పరీక్షలకు సంబంధించి అడ్మిట్ కార్డులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) శనివారం విడుదల చేసింది. ఈ నెల 22 నుంచి జరగనున్న జేఈఈ మెయిన్ పరీక్షలను రెండు దశల్లో నిర్వహిస్తున్నారు. మొదటి దశ పరీక్షలు ఈ నెల 22 నుంచి 24 వరకు, రెండో దశ పరీక్షలు 28 నుంచి 30వ తేదీ వరకు జరగనున్నాయి. ప్రస్తుతం మొదటి దశ పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డులను ఎన్‌టీఏ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది. రోజూ రెండు సెషన్ల చొప్పున ఈ పరీక్షలు నిర్వహిస్తారు. దేశవ్యాప్తంగా 15 పట్టణాల్లో ఈ పరీక్షలు జరగనున్నాయి.

లోకం తీరు





నా కూనను కాపాడరా..!

- ప్రాణాపాయ స్థితిలో ఉన్న పిల్లను ఆస్పత్రికి తెచ్చిన వీధి కుక్క
- తుర్కియేలో ఘటన.. శునకం కన్నప్రేమకు జనం ఫిదా

ఇస్తాంబుల్, జనవరి 18: కన్నబిడ్డల పట్ల తల్లి చూపించే ప్రేమకు కొలమానం ఉండదు. మనుషులైనా, మూగజీవాలైనా కన్నప్రేమ విషయంలో ఎలాంటి తేడా ఉండదు. ఇది నిజమని నిరూపించే ఘటన ఒకటి జనవరి 13న తుర్కియేలో జరిగింది. ప్రాణాపాయంలో ఉండి అచేతనంగా పడిపోయిన ఓ కుక్క పిల్లను దాని తల్లైన వీధి శునకం నోట కరిచి వర్షంలో తడుస్తూ స్థానికంగా ఓ జంతువుల ఆస్పత్రికి తీసుకొచ్చింది. తన పిల్లను అక్కడి సిబ్బంది ముందు పడేసి.. 'నా బిడ్డను కాపాడండి' అన్నట్టు వారి వైపు దీనంగా చూసింది. ఒక్క క్షణం ఏం జరుగుతుందో అర్థం కాక గందరగోళానికి గురైన ఆ ఆస్పత్రి సిబ్బంది.. వెంటనే తేరుకుని కొన ఊపిరితో ఉన్న ఆ పిల్లను పరీక్షించి అవసరమైన వైద్య సాయం అందించి ప్రాణాన్ని నిలిపారు. ఆస్పత్రి బల్లపై ఆ పిల్లకు చికిత్స చేస్తున్నంత సేపు తల్లి శునకం కూడా అక్కడే కంగారుగా తిరుగుతూ కనిపించింది. ఇందుకు సంబంధించిన సీసీ ఫుటేజీ వీడియోలు సోషల్ మీడియాలో వైరలవ్వగా.. ఆ వీధి శునకం కన్నప్రేమకు జనం ఫిదా అయిపోతున్నారు.

'అభయ' కేసులో దోషి సంజయ్ రాయ్

- జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి, హత్య చేసింది అతడే
- ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఘటనపై కోల్‌కతా కోర్టు తీర్పు..రేపు శిక్ష ప్రకటన





నిందితుడు సంజయ్‌ను తీసుకువస్తున్న సమయంలో కోల్‌కతా కోర్టు వద్ద భారీ బందోబస్తు

కోల్‌కతా, జనవరి 18: దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన జూనియర్ డాక్టర్ 'అభయ' దారుణ హత్య కేసుపై శనివారం కోల్‌కతా నగర న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఆర్‌జీ కర్ ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే ఆమెపై అత్యాచారం, ఆపై హత్య చేసిన కేసులో అక్కడి పనిచేసే సంజయ్ రాయ్ దోషి అని ప్రకటించింది. ఇందుకు విధించే శిక్షను సోమవారం వెల్లడించనుంది. 162 రోజుల పాటు రహస్య విచారణ జరిపిన అనంతరం సేల్దాలోని అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి అనిర్బన్ దాస్ ఈ మేరకు నిర్ణయాన్ని వెలువరించారు. నేర తీవ్రతను పరిశీలిస్తే మరణశిక్షగానీ, యావజ్జీవ కారాగార శిక్షగానీ విధించే అవకాశం ఉంది. గత ఏడాది ఆగస్టు 9న ఆస్పత్రిలో ఆన్ డ్యూటీ డాక్టర్‌గా విధులు నిర్వర్తించి రాత్రి సెమినార్ హాల్‌లో నిద్రిస్తున్న 31 ఏళ్ల ఆ మెడికోపై వేకువ జాము నాలుగు గంటల సమయంలో సంజయ్ రాయ్ అత్యాచారం చేసి, అనంతరం గొంతు పిసికి హత్య చేసినట్టు రుజువయిందని జడ్జి తెలిపారు. అతడు సమీప పోలీసు స్టేషన్‌లో 'సివిక్ వాలంటీర్'గా పనిచేసేవాడు. బందోబస్తు నిమిత్తం ఆ ఆస్పత్రిలో నియమించగా ఈ దారుణానికి పాల్పడ్డాడు. అతడిపై భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 64 (రేప్), 66 (మరణానికి కారణమయినందుకు శిక్ష), సెక్షన్ 103(1) (హత్య)ల కింద కేసు నమోదయింది. ఈ అభియోగాలను కేసు దర్యాప్తు చేసిన సీబీఐ నిరూపించిందని జడ్జి తెలిపారు. ముద్దాయి తన వాదనను వినిపించేందుకు సోమవారం ఉదయం 12.30 గంటలకు అవకాశం ఇస్తారు. తర్వాత తీర్పు ప్రకటిస్తారు.

నేను నేరం చేయలేదు

తాను ఎలాంటి నేరం చేయలేదని రాయ్ విచారణ సందర్భంగా చెప్పాడు. "నేను రుద్రాక్ష మాల ధరిస్తాను. ఒక వేళ నేరం చేసి ఉంటే ఆ మాల తెగిపడిపోయి ఉండేది కదా! పవిత్ర రుద్రాక్షలు ధరించి అలంటి నేరం చేయగలనా?" అని వాదించాడు. ఆ వాదనతో జడ్జి ఏకీభవించలేదు. కోర్టుకు కూడా రుద్రాక్ష మాల వేసుకొని, కాషాయం కోటు ధరించి వచ్చాడు. ఈ దారుణానికి నిరసనగా కోల్‌కతా నగరంలో పెద్దయెత్తున ఆందోళనలు జరిగాయి. బాధితురాలిని కొందరు 'అభయ', ఇంకొందరు 'తిలోత్తమ' అని పిలుచుకొని ప్లకార్డులు, కొవ్వొత్తులు పట్టుకొని నిరసనలు తెలిపారు. ఈ తీర్పును బాధితురాలి తల్లిదండ్రులు స్వాగతించినా పూర్తిగా సంతృప్తి వ్యక్తం చేయలేదు. ఆమె తల్లి మాట్లాడుతూ "సంజయ్ రాయ్ దోషి అని నిరూపితమయింది. అయితే అతడొక్కడే నేరస్తుడు కాదు. మిగిలిన వారిని కూడా చట్టం ముందు నిలబెట్టాలి. ఇందు కోసం తుది శ్వాస వరకు పోరాడుతాం" అని చెప్పారు. ఈ దుర్ఘటనపై ఆందోళన చేసి దేశం దృష్టిని ఆకర్షించిన జూనియర్ డాక్టర్లు.. దీని వెనుక ఉన్న కుట్రపై మరింత లోతుగా దర్యాప్తు జరపాలని కోరారు. చాలా ప్రశ్నలకు సమాధానాలు లభించాల్సి ఉందని ఓ జూనియర్ డాక్టర్ వ్యాఖ్యానించారు. ఈ కేసులో ప్రముఖ వ్యక్తుల పాత్రపై దర్యాప్తు జరగాల్సి ఉందని అన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు సువేందు అధికారి మాట్లాడుతూ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్, కలకత్తా మాజీ పోలీసు కమిషనర్ వినీత్ గోయల్‌లకు కూడా ప్రస్తుతం శిక్ష పడి ఉంటే బాగుండేదని చెప్పారు.

ట్రంప్ ప్రమాణ స్వీకారానికి అంబానీ దంపతులు

- భారత్ తరఫున కేంద్ర మంత్రి జైశంకర్

న్యూఢిల్లీ, జనవరి 18: అమెరికా 47వ అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారానికి రిలయన్స్ గ్రూప్ అధినేత ముఖేశ్ అంబానీ, ఆయన సతీమణి నీతా అంబానీ హాజరు కానున్నారు. దీని కోసం వీరు శనివారం (18న) వాషింగ్టన్ డీసీకి చేరుకుంటారు. వర్జీనియాలోని ట్రంప్ నేషనల్ గోల్ఫ్ క్లబ్‌లో రిసెప్షన్, బాణసంచా ప్రదర్శనతో ముందస్తు వేడుకలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా క్యాబినెట్ రిసెప్షన్, ఉపాధ్యక్షుడి ప్రత్యేక విందులో కీలక రాజకీయ నాయకులతో పాటు పలువురు ప్రముఖులతో కలిసి అంబానీ దంపతులు పాల్గొంటారు. ట్రంప్, జేడీ వాన్స్, ఉషా వాన్స్ సమక్షంలో జరిగే క్యాండిల్ లైట్ డిన్నర్‌కు కూడా వీరు హాజరవుతారు. ట్రంప్ ప్రమాణ స్వీకారానికి ఆహ్వానం అందుకున్న ప్రముఖుల జాబితాలో ఎలాన్ మస్క్, జెఫ్ బెజోస్, మార్క్ జుకర్‌బర్గ్ సహా పలువురు అంతర్జాతీయ వ్యాపార దిగ్గజాలు, టెక్ ప్రముఖులు ఉన్నారు. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జపాన్ విదేశాంగ మంత్రి తకేషీ ఇవాయా ఈ వేడుకలో పాల్గొంటారు. ప్రస్తుతం వాషింగ్టన్‌లో ఎముకలు కొరికే చలి వాతావరణం నేపథ్యంలో క్యాపిటల్ భవనంలోని రోటుండా లోపల వెచ్చటి వాతావరణంలో ట్రంప్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. చివరిసారిగా 1985 జనవరి 20న రోనాల్డ్ రీగన్ ప్రమాణ స్వీకారం చలి తీవ్రత కారణంగా క్యాపిటల్ భవనంలో జరిగింది.

సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసు.. ఛత్తీస్‌గఢ్‌లో నిందితుడి పట్టివేత

- రైలులో వెళ్తుండగా గుర్తించిన ఆర్పీఎఫ్



ఆకాశ్

ముంబై/రాయ్‌పూర్, జనవరి 18: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడి చేసిన దుండగుడు అరెస్టయ్యాడు. ముంబై నుంచి జ్ఞానేశ్వరి ఎక్స్‌ప్రెస్‌లో బిలాస్‌పూర్ వెళ్తున్న నిందితుడిని శనివారం ఉదయం ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ రైల్వే స్టేషన్ వద్ద గుర్తించి, అరెస్టు చేసినట్లు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్) ఇన్‌స్పెక్టర్ సంజీవ్ సిన్హా తెలిపారు. నిందితుడిని ముంబైకి చెందిన ఆకాశ్ కైలాష్ కనోజియాగా గుర్తించామని వివరించారు. దాడికి కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు ముంబై పోలీసులు చెప్పారు. మరోవైపు మధ్యప్రదేశ్‌లోనూ రాజేంద్ర కోజీప్ అనే అనుమానితుడిని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. సైఫ్ భార్య కరీనా ఇచ్చిన వాంగ్మూలం మేరకు అతణ్ని విచారిస్తున్నట్లు సమాచారం. గురువారం తెల్లవారుజామున సైఫ్‌పై దాడి జరగ్గా.. ఇంట్లో ఎలాంటి విలువైన వస్తువులు తస్కరణకు గురవ్వలేదని కరీనా తన వాంగ్మూలంలో వివరించారు. మరోవైపు, సైఫ్ అలీఖాన్ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆయన నడవగలుగుతున్నారని లీలావతి ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ నితిన్ నారాయణ్ డాంగే తెలిపారు.

పోలీసులకు చిక్కిన 18 హత్యల దోషి చంద్రకాంత్

న్యూఢిల్లీ, జనవరి 18: పరారీలో ఉన్న కరుడుకట్టిన హంతకుడు చంద్రకాంత్ ఝా (57) ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. శుక్రవారం పాత ఢిల్లీ రైల్వే స్టేషన్ వద్ద ఉండగా పోలీసులు పట్టుకున్నారు. 2006-07 మధ్య వరుసగా 18 హత్యలు చేసి దేశ రాజధానిని వణికించాడు. 2013లో మూడు కేసుల్లో నేరం రుజువు కావడంతో కోర్టు రెండు మరణశిక్షలు విధించింది. కానీ 2016లో వాటిని విడుదలకు అవకాశం లేని యావజ్జీవ కారాగారశిక్షలుగా మార్చుతూ క్షమాభిక్ష లభించింది. 2023 అక్టోబరులో పెరోల్‌పై విడుదలయి, అప్పటి నుంచి కనిపించకుండా పోయాడు. హత్యలు చేసి రక్తం బయటకు కనిపించకుండా శవాన్ని ప్లాస్టిక్ సంచెలో మూట కట్టి తిహాడ్ జైలు సమీపంలో పారివేయడం అతడి ప్రత్యేకతగా ఉండేది. 'ఈ హత్య చేశాను. చేతనయితే పట్టుకోండి' అని పోలీసులను ఉద్దేశించి చీటీ కూడా రాసి పెట్టేవాడు. ఇతడిపై 'బుచర్ ఆఫ్ ఢిల్లీ' పేరుతో నెట్‌ఫ్లిక్స్‌లో డాక్యుమెంటరీ కూడా విడుదలయింది.

ప్రమాదం అంచున ఉన్న సాంస్కృతిక వారసత్వ ప్రదేశాల జాబితాలో చందమామ

న్యూయార్క్, జనవరి 18: అందమైన చందమామకు ముప్పు వచ్చింది. ఇది వింటే మనం ఆశ్చర్యపోవచ్చు. కానీ నిజమే అంటోంది వరల్డ్ మాన్యుమెంట్ ఫండ్ (డబ్ల్యూఎంఎఫ్). తాను విడుదల చేసిన 'ప్రమాదంలో ఉన్న సాంస్కృతిక వారసత్వ స్థలాల జాబితా-2025'లో జాబిల్లిని కూడా ఆ సంస్థ చేర్చింది. చంద్రుడిపై మానవుల కార్యకలాపాలు పెరిగిపోవడమే ఆ ముప్పుకు కారణమని వివరించింది. పరిశోధనలకు వెళ్లిన మనుషులు, రోబోల కారణంగా జాబిల్లి ఉపరితలంపై పలు వస్తువులు ఉండిపోయాయని తెలిపింది. కొత్తగా పుట్టుకొస్తున్న అంతరిక్ష టూరిజంపై కూడా డబ్ల్యూఎంఎఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. దీని వల్ల చంద్రుడికి సమీపంలో అంతరిక్ష చెత్త పెరిగిపోతుందని తెలిపింది. చంద్రుడి ఉపరితలంపై మానవ కార్యకలాపాలు ఉన్న 90కి పైగా ప్రాంతాలు ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయని ఆ సంస్థ తెలిపింది.

బందీల జాబితా ఇస్తేనే ఒప్పందం: నెతన్యాహు

టెల్ అవీవ్, జనవరి 18: కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం హమాస్ 33 మంది బందీల పేర్లతో జాబితాను విడుదల చేసేవరకు ముందుకెళ్లబోమని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పష్టం చేశారు. ఒప్పందం ఉల్లంఘిస్తే పూర్తి బాధ్యత హమాస్‌దే అవుతుందని ఆయన హెచ్చరించారు. మరోవైపు ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ సంకీర్ణ ప్రభుత్వం నుంచి ఒట్జ్మా యెహుదిత్ పార్టీ నేత, జాతీయ భద్రతా శాఖ మంత్రి ఇటామర్ బెన్ గ్విర్ తప్పుకున్నారు. దీంతో నెతన్యాహుపై రాజకీయంగా కూడా ఒత్తిడి పెరుగుతోంది. వాస్తవానికి కాల్పుల విరమణ ఒప్పందం ఆదివారం నుంచి అమలులోకి రావాలి. దీని ప్రకారం 33 మంది బందీలను హమాస్, 737 మంది పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయెల్ విడుదల చేయాలి.

రక్తహీనతకు ఐరన్ లోపమే ప్రధాన కారణం కాదు

న్యూఢిల్లీ, జనవరి 18: రక్తహీనతకు 'ఐరన్' లోపమే ప్రధాన కారణమని కాదని తాజా అధ్యయనం వెల్లడించింది. బీ12 విటమిన్ లోపం, వాయు కాలుష్యం వంటి ఇతర కారణాల ప్రభావమే ఎక్కువగా ఉందని పేర్కొంది. దేశంలోని 8 రాష్ట్రాల్లో నిర్వహించిన రక్త పరీక్షల ఫలితాల విశ్లేషణతో ఈ విషయాన్ని గుర్తించామని పరిశోధకుల బృందం తెలిపింది. ఈ అధ్యయనం వివరాలను 'యూరోపియన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్'లో ప్రచురించింది. మొత్తం రక్తహీనత(ఎనీమియా) కేసుల్లో ఐరన్ లోపం కారణమైనవి మూడోవంతులోపేనని, మిగతా వాటికి ఇతర కారణాలు ఉన్నాయని పేర్కొంది. సర్వేలో పలు రాష్ట్రాలకు చెందిన 4,613 మంది రక్తనమూనాల పరీక్షల ఫలితాలను విశ్లేషించామని తెలిపింది.

బడ్జెట్ సమావేశాల్లో కొత్త ఆదాయ పన్ను బిల్లు!

- 63 ఏళ్లనాటి చట్టం స్థానంలో కొత్త చట్టం?

న్యూఢిల్లీ, జనవరి 18: దేశంలో త్వరలోనే నూతన ఆదాయపన్ను చట్టం రానుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న 63 ఏళ్ల కిందటి ఆదాయ పన్ను చట్టం స్థానంలో నూతన చట్టం తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. ఈ నూతన చట్టం రెండు భాగాలుగా ఉంటుందని ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం.. వచ్చే బడ్జెట్ సమావేశాల్లోనే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల ఈ కొత్త బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రధానంగా ప్రస్తుతం ఉన్న నిబంధనలను సరళీకరించడంతోపాటు, అందరికీ అర్థమయ్యే భాషలో దీనిని తీసుకురానున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

ఆర్జేడీ పగ్గాలు తేజస్వీయాదవ్‌కు



పట్నా, జనవరి 18: బిహార్ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఆర్జేడీ దూకుడు పెంచింది. పార్టీ అధ్యక్షుడిగా తేజస్వీయాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. శనివారం ఆర్జేడీ జాతీయ కమిటీ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. "నా మీద నమ్మకం పెట్టినందుకు పార్టీ నేతలకు ధన్యవాదాలు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేస్తా" అని ఈ సందర్భంగా తేజస్వీ యాదవ్ పేర్కొన్నారు. కాగా, అనారోగ్య కారణాల దృష్ట్యా లాలూప్రసాద్ యాదవ్ పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకున్నట్లు పార్టీ సీనియర్ నాయకులు తెలిపారు.

1.65 కోట్ల ఎకరాల్లో డ్రోన్ల సర్వే పూర్తి

'స్వమిత్వ' కింద పూర్తి చేసిన మోదీ సర్కారు

- 65 లక్షలమందికి శాశ్వత భూహక్కు దఖలు
- వారికి స్వమిత్వ కార్డులు పంపిణీ చేసిన ప్రధాని



న్యూఢిల్లీ, జనవరి 18: డ్రోన్లను ఉపయోగించి భూముల సర్వేలో మోదీ ప్రభుత్వం అద్భుతం చేసింది. రికార్డు స్థాయిలో గ్రామీణ ప్రాంతంలో 67 వేల చదరపు కిలోమీటర్ల (1.65 కోట్ల ఎకరాలు) భూముల సర్వేను పూర్తిచేసింది. దాదాపు రూ.132 లక్షల కోట్ల విలువైన భూసంబంధ వివాదాలను ఐదేళ్లలో పరిష్కరించింది. భూసర్వేను పూర్తిచేసుకున్న చోట 65 లక్షల మందికి శాశ్వత భూయాజమాన్య ధ్రువీకరణ (స్వమిత్వ) కార్డులను శనివారం ప్రధాని మోదీ పంపిణీ చేశారు. అనంతరం కొందరు లబ్ధిదారులతో వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పల్లె సీమల్లో ఆర్థిక జీవనం మెరుగుపడటానికీ, పేదరికం నుంచి బయటపడటానికి లబ్ధిదారులకు స్వమిత్వ కార్డులు ఉపకరిస్తాయని ఆయన తెలిపారు. సరైన లీగల్ పత్రాలతో సొంత ఆస్తిపై హక్కును కలిగి ఉండటం పేదరిక నిర్మూలనలో చాలా ముఖ్యమైన అంశంగా ఐక్యరాజ్యసమితి కూడా గుర్తించిందని తెలిపారు. గ్రామాల్లో ఉండే ఆస్తి డెడ్ కాపిటల్ అని, దానిని ఎవరూ దేనికోసమూ ఉపయోగించుకోలేరని, ప్రజల ఆదాయ స్థాయిని అది పెంచలేదని ఓ ప్రముఖ ఆర్థిక వేత్త అన్నారని, అది తప్పు అని నిరూపించాల్సిన సమయం వచ్చిందన్నారు. రూ.లక్షల కోట్ల విలువైన ఆస్తులను కలిగిఉన్నా, వాటిని ధ్రువీకరించే సరైన పత్రాలు లేకపోవడం గ్రామసీమలు ఎదుర్కొంటున్న పెద్ద సవాల్ అనీ, దానివల్ల రుణం ఇవ్వడానికి బ్యాంకులు ముందుకు రావడం లేదన్నారు. స్వమిత్వ కార్డులను ఉపయోగించి బ్యాంకు నుంచి రుణం తీసుకోవచ్చునని, ఆ డబ్బులతో కొత్తగా వ్యాపారాలు మొదలుపెట్టవచ్చునని మోదీ సూచించారు. కాగా, ఇవే వివరాలతో కేంద్ర పంచాయతీరాజ్ విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. స్వమిత్వ పథకం కింద ఇప్పటివరకు 3.17 లక్షల గ్రామాల (92శాతం) పరిధిలో సర్వే పనులు పూర్తిచేశామని పేర్కొంది. మొత్తం 3.44 లక్షల గ్రామాలను ఈ పథకంలోకి తీసుకురావాలనే లక్ష్యాన్ని 2026నాటికి చేరుకుంటామని పేర్కొంది. పది రాష్ట్రాల పరిధిలో కార్డుల పంపిణీ జరిగినట్టు వివరించింది. కాగా, స్వమిత్వ కార్యక్రమాన్ని కేంద్రప్రభుత్వం 2020 ఏప్రిల్‌లో ప్రారంభించింది.


టెల్కోల ఏజీఆర్ బకాయిల మాఫీకి కేంద్రం యోచన

న్యూఢిల్లీ, జనవరి 18: దేశీయ టెలికాం కంపెనీలపై ఉన్న కొండంత ఆర్థిక భారాన్ని దించే దిశగా కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా పలు టెలికాం సంస్థలు చెల్లించాల్సి ఉన్న సర్దుబాటు చేసిన స్థూల రాబడి (ఏజీఆర్) బకాయిల్లో పెద్ద మొత్తాన్నే మాఫీ చేసే ఆలోచన చేస్తున్నట్టు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఒకవేళ ఈ మేరకు కేంద్రం నిర్ణయం తీసుకుంటే టెలికాం కంపెనీలకు భారీ ఊరట లభించనుంది. క్రితం స్పెక్ట్రమ్ బకాయిలకు సంబంధించి బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాల్సిన అవసరం లేదని గతేడాది డిసెంబరులో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో టెలికాం కంపెనీలు ఊపిరిపీల్చుకున్నాయి. ఇప్పుడు ఏజీఆర్ బకాయిలను తగ్గించే ఆలోచన చేస్తున్నట్టు వస్తున్న కథనాలతో ఆ కంపెనీల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. 50% వడ్డీతోసహా పెనాల్టీలు, పెనాల్టీలపై వడ్డీని 100% మేర మాఫీ చేయాలని ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. ఒకవేళ ఈ ప్రతిపాదనకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తే టెలికాం ఆపరేటర్లకు రూ.లక్ష కోట్లకు పైగా ఆర్థిక ఊరట లభించనుందని సమాచారం. అయితే ఇందులో సగానికి పైగా వొడాఫోన్ ఐడియా (వీఐ)కే ప్రయోజనం కలగడానికి అవకాశం ఉంది. వీఐ ఏజీఆర్ బకాయిలను దాదాపు రూ.52వేల కోట్లకు పైగా, భారతీ ఎయిర్‌టెల్ బకాయిలు దాదాపు రూ.38వేల కోట్లు, టాటా టెలీ సర్వీసెస్ బకాయిలు రూ.14వేల కోట్ల మేర తగ్గవచ్చన్న అంచనాలు వెలువడుతున్నాయి. 2019లో సుప్రీంకోర్టు తీర్పుతో టెలికాం కంపెనీలపై దాదాపు రూ.1.47 లక్షల కోట్ల ఏజీఆర్ బకాయిల భారం పడింది.

7 కోట్ల రుద్రాక్షలతో 12 జ్యోతిర్లింగాలు

- మహా కుంభమేళాలో పలు ప్రత్యేక ఆకర్షణలు





ఆత్మ ప్రేమ్ గిరి బాబా

మహాకుంభ్ నగర్, జనవరి 18: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా వైభవంగా కొనసాగుతోంది. ప్రతి రోజూ లక్షలాదిగా సాధువులు, భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. ఈ క్రమంలో మహాకుంభ్ క్షేత్రంలో పలు ప్రత్యేకతలు కనిపిస్తున్నాయి. సెక్టార్ 6లో 7.51 కోట్లకు పైగా రుద్రాక్షలతో ఏర్పాటు చేసిన 12 జ్యోతిర్లింగాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రతి శివలింగాన్ని 11 అడుగుల ఎత్తు, 9 అడుగుల వెడల్పు, 7 అడుగుల మందంతో ఏర్పాటు చేశారు. ఈ కోట్లాది సంఖ్యలో రుద్రాక్షలను 10 వేల గ్రామాల్లో యాత్ర ద్వారా సేకరించారు. మరోవైపు, రష్యాకు చెందిన ఆత్మ ప్రేమ్ గిరి మహారాజ్ బాబా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 7 అడుగుల ఎత్తు, కండలు తిరిగిన శరీరంతో ఉన్న ఆయన్ను 'కండల బాబా' అని కూడా అంటుంటారు. రష్యా పౌరుడు అయిన ఆత్మ ప్రేమ్ గిరి మహారాజ్ 30 ఏళ్ల క్రితం సనాతన ధర్మాన్ని స్వీకరించాడు. అధ్యాపక వృత్తిని వదిలేసి ఆధ్యాత్మికం వైపు మళ్లాడు. జునా అఖాడా సభ్యుడైన ఆయన.. నేపాల్‌లో ఉంటారు. మరోవైపు, యాపిల్ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్ భార్య లారెన్ పావెల్ సనాతన ధర్మంలో చేరాలనుకుంటున్నారని ఆమె గురువు, పంచాయతీ అఖాడా అధిపతి శ్రీ నిరంజని తెలిపారు. అఖాడా ఆమెకు ఏడాది క్రితం 'కమల' అనే హిందూ పేరు, గోత్రం కూడా ఇచ్చింది. 50 మంది సిబ్బందితో రెండు విమానాల్లో లారెన్ జాబ్స్ వచ్చినప్పటికీ, సాధారణ భక్తురాలిగా ఇక్కడ ఉంటున్నారు. కాగా, మహాకుంభమేళా భక్తుల కోసం అదానీ గ్రూపుతో కలిసి రోజుకు లక్ష మందికి భోజనాలు అందిస్తున్నట్లు ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ ఇస్కాన్ పేర్కొంది.

అద్దెకు ఉండే వారికి ఉచిత విద్యుత్తు, నీరు

- మళ్లీ అధికారంలోకి రాగానే అమలు: కేజ్రీవాల్



న్యూఢిల్లీ, జనవరి 18: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఢిల్లీ ప్రజలపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) వరాల జల్లు కురిపిస్తోంది. తాము మళ్లీ అధికారంలోకి వస్తే అద్దె ఇళ్లలో ఉండే వారికి ఉచిత కరెంట్, నీరు అందజేస్తామని ఆ పార్టీ కన్వీనర్ కేజ్రీవాల్ ప్రకటించారు. శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాను ఎక్కడికి వెళ్లినా అద్దెకుండే ప్రజలు కలుస్తున్నారని.. తమకు ఉచిత బస్సు ప్రయాణం, పాఠశాలలు, ఆస్పత్రుల నుంచి ప్రయోజనాలను పొందుతున్నా ఉచిత కరెంట్, నీరు పొందలేకపోతున్నామని చెబుతున్నారన్నారు. అందుకే వారి సమస్యను పరిష్కరించాలనుకుంటున్నట్లు తెలిపారు. ఢిల్లీలో అద్దెకుంటున్న వారిలో ఎక్కువ మంది పూర్వాంచలీలేనని.. వారంతా పేదలేనని చెప్పారు. అందుకే వారి కోసం ఎన్నికల అయిపోగానే కొత్త పథకాలు తెచ్చి ఉచిత విద్యుత్తు, నీరు అందజేస్తామన్నారు. ఇదిలా ఉండగా, న్యూఢిల్లీ నియోజకవర్గంలో ఇంటింటి పర్యటన సందర్భంగా కేజ్రీవాల్ కారులో వెళ్తుండగా ఆయన కాన్వాయ్‌పై కొందరు రాళ్లు విసిరారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన ఆప్.. ఇది బీజేపీ కుట్రేనంటూ ఆరోపించింది. 'బీజేపీకి ఓటమి భయం పట్టుకుంది. ఆ పార్టీ గూండాలు కేజ్రీవాల్ ప్రచారాన్ని ఎలాగైనా అడ్డుకోవాలని గాయపరిచేందుకు రాళ్లతో దాడి చేశారు. కేజ్రీవాల్ మీ పిరికిపందల దాడికి భయపడడు' అని విమర్శించింది.

ఇరాన్‌లో ఇద్దరు సుప్రీంకోర్టు జడ్జిల కాల్చివేత


- అనంతరం హంతకుడి ఆత్మహత్య.. కోర్టులోనే ఘటన



టెహ్రాన్, జనవరి 18: ఇరాన్‌లో ఇద్దరు సుప్రీం కోర్టు న్యాయమూర్తులను గుర్తు తెలియని సాయుధుడు ఒకడు శనివారం ఉదయం కాల్చి చంపాడు. తర్వాత తానూ కాల్చి చంపుకొన్నాడు. కోర్టు భవనంలోనే ఈ దారుణం చోటుచేసుకుంది. గతంలో ఆ జడ్జీలు అసమ్మతివాదులకు సామూహిక ఉరిశిక్షలు విధించారన్న కక్షతోనే చొరబాటుదారు ఈ పని చేసి ఉంటాడన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం ఆ 'చొరబాటుదారుడు' హ్యాండ్‌గన్ పట్టుకొని సెంట్రల్ టెహ్రాన్‌లో ఉన్న ఇరాన్ సుప్రీంకోర్టులోకి ప్రవేశించాడు. సుప్రీంకోర్టు 39వ బ్రాంచ్ అధిపతి అయిన హొజ్జత్ అల్ ఇస్లాం అలీ రజిని (71), సుప్రీంకోర్టు 53వ బ్రాంచ్ అధిపతి హొజ్జత్ అల్ ఇస్లాం వల్ ముసల్మీన్ మహమ్మద్ మొఖిసెహ్ (68)లను గురిపెట్టి కాల్పులు జరపగా వారు ప్రాణాలు కోల్పోయారు. ఈ కాల్పుల్లో ఒక బాడీగార్డు తీవ్రంగా గాయపడ్డాడు. 1988లో సుమారు 5వేల మందికి సామూహిక ఉరిశిక్షల అమలులో జడ్జి అలీ రజినీ కీలక పాత్ర ఉంది.

ఫుట్‌బాల్ కోసం 30లక్షల వీధి కుక్కల హతం

రబాట్, జనవరి 18: 2030లో మొరాకో దేశం స్పెయిన్, పోర్చుగల్‌లతో కలిసి ఫుట్‌బాల్ ప్రపంచ కప్ పోటీలను నిర్వహించనుంది. అందుకోసం చేసే సన్నాహాల్లో భాగంగా వీధి కుక్కల బెడదను నివారించాలని నిర్ణయించింది. 30 లక్షల వీధికుక్కలను నిర్మూలించాలని ప్రతిపాదించింది. ఇప్పటి నుంచే వాటికి విషపదార్థాలు ఇవ్వడం, కాల్చి చంపడం, ఇనుప రాడ్లతో తీవ్రంగా కొట్టడం ద్వారా చంపడం ప్రారంభించింది. దీనిపై ప్రపంచవ్యాప్తంగా జంతుప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ట్రస్టు భవన్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నారా భువనేశ్వరి



ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న జూ.ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్

ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణపై లోకేశ్ అసంతృప్తి

ఘాట్ గోడలు, పైకప్పు పెచ్చులు ఊడిపోవడంపై అసహనం

- సొంత నిధులతో మరమ్మతులకు సిబ్బందికి ఆదేశాలు
- వర్ధంతి సందర్భంగా టీడీపీ వ్యవస్థాపకుడికి నివాళులు
- తరలివచ్చిన కుటుంబసభ్యులు, అభిమానులు, నేతలు
- రాష్ట్రవ్యాప్తంగా వర్ధంతి కార్యక్రమాల నిర్వహణ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణ లోపంపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ మంత్రి నారా లోకేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తన సొంత నిధులతో మరమ్మతులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా శనివారం ఎన్టీఆర్ ఘాట్‌లో తల్లి భువనేశ్వరితో కలిసి ఆయన నివాళులర్పించారు. ఘాట్ గోడలు, పైకప్పు పెచ్చులు ఊడిపోవడం, గార్డెన్‌లో ఏర్పాటు చేసిన లైట్లు విరిగిపడి ఉండటాన్ని చూసి లోకేశ్ అసహనం వ్యక్తం చేశారు. అవసరమైన అనుమతులు తీసుకొని వీలైనంత తొందరగా ఘాట్ మరమ్మతులు పూర్తి చేయాలని ఆయన తన సిబ్బందిని ఆదేశించారు. 'ఎన్టీఆర్ అంటే కేవలం మూడు అక్షరాలు కాదు.. సినిమాల్లో, రాజకీయాల్లో నంబర్‌వన్‌గా నిలిచిన వ్యక్తి. తెలుగుజాతి చరిత్రలో ఆయన ఓ ప్రభంజనం' అని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించే విషయమై కేంద్రంతో చర్చలు జరుపుతున్నామని.. కచ్చితంగా వస్తుందని ఆశిస్తున్నామన్నారు. తెలంగాణలో టీడీపీని పునర్నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. ఇక్కడ ఒక్క ఎమ్మెల్యే లేకున్నా స్వచ్ఛందంగా ప్రజలే వచ్చి 1.60 లక్షల మంది సభ్యత్వం తీసుకున్నారని వెల్లడించారు. తెలంగాణలో పార్టీ పునర్వైభవానికి త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. తెల్లవారుజాము నుంచే ఎన్టీఆర్ ఘాట్‌కు కుటుంబసభ్యులు, అభిమానులు, టీడీపీ నేతల రాక మొదలైంది. ఉదయం 5.30 గంటలకే సినీనటులు జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్‌తో కలసి వచ్చి నివాళులర్పించి కాసేపు ఘాట్ వద్ద కూర్చున్నారు. తర్వాత సినీనటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ తన సోదరుడు రామకృష్ణ, ఇతర నేతలతో కలసి వచ్చి ఘాట్ వద్ద నివాళులర్పించారు.

ఎన్టీఆర్ పథకాలే వేరే పేర్లతో అమలు: బాలకృష్ణ

ప్రపంచంలోనే ఎన్టీఆర్‌ను మించిన నటనాచార్యులు ఎవరూ లేరని బాలకృష్ణ అన్నారు. కష్టజీవుల కన్నీళ్లు, అన్నార్తుల ఆకలి నుంచి టీడీపీ పుట్టిందన్నారు. ఎన్టీఆర్ పెట్టిన పథకాలు ఇప్పటికీ పేర్లు మార్చి కొనసాగిస్తున్నారని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా తెలుగు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన మహానాయకుడు ఎన్టీఆర్ అని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. కులాలకు, మతాలకు అతీతుడైన ఆయన జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఎన్టీఆర్ ఘాట్‌లో నివాళులర్పించిన వారిలో ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, టీటీడీ బోర్డు సభ్యుడు నర్సిరెడ్డి, తెలంగాణ టీడీపీ నేతలు బక్కని నర్సింహులు, అరవింద్‌కుమార్ గౌడ్ తదితరులున్నారు. ఇటు ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన హెచ్ఎండీఏ తీరు పట్ల ఎన్టీఆర్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వహణ బాధ్యతలు ఎన్టీఆర్ ట్రస్టుకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు..

రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలను ఆయన అభిమానులు, టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రక్తదానంతో పాటు రోగులకు పండ్ల పంపిణీ, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఖమ్మంలో ఎన్టీఆర్ విగ్రహానికి కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ రేణుకా చౌదరి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ రాజకీయాల్లో ఎన్టీఆర్ చరిత్ర సృష్టించారని.. జాతీయ రాజకీయాల్లో కూటమి ఏర్పాటుకు ఆద్యుడని అన్నారు.

ఏపీకి 'ఎయిర్‌బస్ హెలికాప్టర్'!?

- హెచ్125 హెలికాప్టర్ల ప్లాంటు ఏర్పాటు యోచన
- అన్నీ కుదిరితే అనంతపురం జిల్లాలో ఏర్పాటు

అమరావతి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హెచ్125 హెలికాప్టర్ల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని 'ఎయిర్ బస్' సంస్థ యోచిస్తోంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రాథమిక దశలోనే ఉంది. భారత్‌లో హెలికాప్టర్ల ఉత్పత్తి ప్రారంభించాలని ఫ్రాన్స్‌కు చెందిన ఎయిర్‌బస్ ఇప్పటికే నిర్ణయించుకుంది. ఇందుకు కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గుజరాత్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను పరిశీలిస్తోంది. ఈ నాలుగు రాష్ట్రాలతో ఎయిర్ బస్ ప్రతినిధులు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో... ఏపీ వైపే ఎయిర్‌బస్ మొగ్గు చూపే అవకాశముందని అంతర్జాతీయ మీడియా సంస్థలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే 'కియా'తో అంతర్జాతీయ గుర్తింపు పొందిన అనంతపురం జిల్లాలోనే హెచ్125 హెలికాప్టర్ల యూనిట్‌ను కూడా ఏర్పాటు చేసే అవకాశముందని చెబుతున్నాయి. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో సంప్రదింపులు జరిగాయని.. అనంతపురంలో అనువైన భూమిని కేటాయించాలంటూ జిల్లా యంత్రాంగానికి ప్రతిపాదనలు అందాయని వార్తలు వస్తున్నాయి.

ఇదీ హెచ్125 హెలికాప్టర్...

ఫ్రాన్స్‌కు చెందిన ప్రతిష్ఠాత్మక విమాన కంపెనీ 'ఎయిర్ బస్' హెచ్125 హెలికాప్టర్లను తయారు చేస్తోంది. ఇది సింగిల్ ఇంజిన్ హెలికాప్టర్. గరిష్ఠంగా ఆరుగురు ప్రయాణించగలరు. పర్యాటకం, సరిహద్దుల్లో పహారా, విపత్తు సమయంలో సహాయ చర్యల్లో చక్కగా వినియోగించవచ్చు. దీని గరిష్ఠ వేగం గంటకు 289 కిలోమీటర్లు. భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా అమ్ముడవుతున్న హెలికాప్టర్ ఇదే.





ఆలయం ముందు జస్టిస్ సూరేపల్లి నంద

శ్రీవారిసేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, జనవరి18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద తిరుమల శ్రీవారిని శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకుని ఉత్తరద్వార ప్రవేశం చేశారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకున్న జస్టిస్ నందకు వేదపండితులు ఆశీర్వచనం చేసి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఇద్దరిని బలిగొన్న అతివేగం

సూర్యాపేటలో ప్రైవేటు బస్సును వెనక నుంచి ఢీకొన్న మరో బస్సు

క్లీనర్ మృతి.. గుండెపోటుతో గుంటూరుకు చెందిన ప్రయాణికుడి మృతి

సూర్యాపేట క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అతివేగం ఇద్దరిని బలితీసుకుంది. ముందువెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును వెనక నుంచి మరో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన ఘటనలో రోడ్డు మీదపడి వెనక బస్సు క్లీనర్, గుండెపోటుకు గురై ఓ ప్రయాణికుడు మృతిచెందారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం తెల్లవారుజామున జరిగింది. ఏపీలోని నెల్లూరు నుంచి హైదరాబాద్ వెళుతున్న బస్సు డ్రైవర్ సూర్యాపేటలోని ఎన్టీఆర్ పార్క్ సమీపంలో సర్వీస్ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ వద్దకు రాగానే ఒక్కసారిగా వేగం తగ్గించాడు. అదే సమయంలో అతివేగంతో నెల్లూరు నుంచి హైదరాబాద్ వెళుతున్న మరో బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. వెనుక బస్సు క్లీనర్ ఒంగోలుకు చెందిన ఇండ్ల ప్రవీణ్ (22) ముందు అద్దానికి కొట్టుకున్నాడు. దీంతో అద్దం పగిలి బస్సు ముందు భాగంలో రోడ్డుపై పడిపోయాడు. బస్సు అతని పైనుంచి వెళ్లిపోవడంతో మృతిచెందాడు. ఈ ప్రమాదంతో వెనక బస్సులో ప్రయాణిస్తున్న గుంటూరుకు చెందిన పఠాన్ నయాబ్ రసూల్ (57) గుండెపోటుతో మృతిచెందాడు. కార్పెంటర్‌గా పనిచేసే రసూల్ హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్తున్నాడు. ప్రమాదంలో గాయపడిన పలువురు ప్రయాణికులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొంది స్వస్థలాలకు వెళ్లిపోయారు.

మూడు కార్లు ఢీ.. యువకుడి మృతి

- ఐదుగురు కర్ణాటకవాసులకు గాయాలు

అచ్చంపేట టౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఓ కారు ఎదురుగా వస్తున్న రెండు కార్లను ఢీకొనడంతో యువకుడు మృతిచెందగా మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకుంది.కర్ణాటకలోని గుల్బర్గా నుంచి ఒకే కుటుంబానికి చెందిన 12 మంది రెండు కార్లలో శ్రీశైలం వెళ్లి దైవదర్శనం చేసుకుని తిరుగు పయనమయ్యారు. శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై అచ్చంపేట మండలం హాజీపూర్ చౌరస్తా వద్ద వీరి కార్లను హైదరాబాద్ వైపు నుంచి రంగాపూర్ జాతరకు వెళుతున్న కారు అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో రంగాపూర్ వెళుతున్న కారులోని హైదరాబాద్‌కు చెందిన యువకుడు బిలాల్ (28) తలకు బలమైన గాయాలై మృతి చెందాడు. ఈ కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గుల్బర్గాకు చెందిన వారిలో ముందు కారులో ప్రయాణిస్తున్న విష్ణుకాంత్, విజయలక్ష్మి, వాసవి, మంజు, జగదీష్ అనే వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో అచ్చంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

టీటీడీలో కల్తీ నెయ్యికి ఇక కళ్లెం!

- వంద శాతం కల్తీని గుర్తించే నూతన పరికరాలు సిద్ధం

తిరుమల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలు, అన్నప్రసాదాల్లో వినియోగించే నెయ్యిలో కల్తీని వందశాతం గుర్తించేలా నూతన పరికరాలతో టీటీడీ ల్యాబ్ సిద్ధమైంది. లడ్డూ ప్రసాదాలకు వినియోగించే నెయ్యి కల్తీపై ఆరోపణలు రావడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. 2024 జూలై 8న నమూనాలు ఎన్డీడీబీ సీఏఎల్ఎఫ్ ల్యాబ్‌కు పంపగా, అదేనెల 17న ఈ మేరకు నివేదిక రావడం భక్తులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. తిరుమలలోని ల్యాబ్‌కు నెయ్యిని వందశాతం పరీక్షించే సామర్థ్యం లేదని పలువురు నిపుణులు నివేదిక ఇచ్చారు. దీంతో ఇక్కడి ల్యాబ్‌లో అత్యాధునిక యంత్రాలు ఏర్పాటు టీటీడీ ఈవో శ్యామలరావు నిర్ణయించారు. నెయ్యిని సూక్ష్మస్థాయిలో పరీక్షించేందుకు ఫ్యాటీ ఆసిడ్ మిథైల్ ఎస్టర్, బీటా-సిటోస్టెరాల్ వంటి పరీక్షలకు గ్యాస్ క్రోమాటోగ్రాఫ్ (జీసీ), హై పెర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రోమాటోగ్రాఫ్ (హెచ్‌పీఎల్‌సీ) అనే రెండు యంత్ర పరికరాలు అవసరమని నేషనల్ ల్యాబ్ నిపుణులు టీటీడీకి సూచించారు. దాదాపు రూ.70 లక్షల విలువైన ఈ రెండు పరికరాలను విరాళంగా ఇచ్చేందుకు నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డీడీబీ) అంగీకారం తెలిపింది. ఈ నేపథ్యంలో వీటిని ఇటీవల జర్మనీ నుంచి తిరుమలకు తీసుకువచ్చి ల్యాబ్‌లో అమర్చారు. వచ్చేనెల నుంచి ఈ ల్యాబ్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేలా టీటీడీ సన్నాహాలు చేస్తోంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

రేవంత్ 'ఫార్ములా' ఏమిటో..!?

ఫార్ములా-ఈ రేసు కంపెనీ కేసులో ఏమి జరగబోతోంది? మాజీ మంత్రి కేటీఆర్ ఈ కేసులో ఇరుక్కున్నారా? ఆయనను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అరెస్టు చేస్తుందా? చేస్తే ఎప్పుడు? ఇదే కేసులో మరో నిందితుడిగా ఉన్న హెచ్‌ఎండీఏ మాజీ కమిషనర్ అర్వింద్ కుమార్ అప్రూవర్‌గా మారబోతున్నారా? తెలంగాణలో గత కొన్ని వారాలుగా ఈ ప్రశ్నలు చక్కర్లు కొడుతున్నాయి. కేటీఆర్‌ను ఇప్పుడు అరెస్టు చేస్తారు. అప్పుడు అరెస్టు చేస్తారు అని మీడియాలో ఊహాగానాలు చేస్తున్నారు. అయితే కేసు మాత్రం జీడి పాకంలా సాగుతోంది. ఫార్ములా-ఈ వ్యవహారంలో కేటీఆర్ అడ్డంగా బుక్కయ్యారని ప్రభుత్వ వర్గాలు చెబుతుండగా, అసలు అవినీతే జరగనప్పుడు కేసు ఎక్కడ ఉంది? అని కేటీఆర్ ఎదురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఎంత బలంగా తన వాదన వినిపిస్తున్నదో.. కేటీఆర్ కూడా అంతే బలంగా తన వాదన వినిపిస్తున్నారు. దీంతో అసలు ఇందులో కేసు ఉందా? ఉంటే కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదు? అన్న అనుమానాలు ఏర్పడుతున్నాయి.

> **తెలుగుదేశం పార్టీకి లోక్‌సభలో 16 మంది సభ్యులు ఉన్నారు. ఈ మాత్రం సంఖ్యా బలాన్ని సమకూర్చుకోవడం మోదీ ప్రభుత్వానికి కష్టం కాదు. ఈ వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకునే చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి తన విధేయతను ప్రకటించారు. ప్రస్తుతానికి చంద్రబాబు అవసరం ప్రధాని మోదీకి, మోదీ అవసరం చంద్రబాబుకు ఉంది. జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు బీజేపీ పెద్దలతో సత్సంబంధాలు ఉన్నందున మూడు పార్టీల మధ్య సఖ్యత సజావుగా సాగుతోంది. ఈ సఖ్యత మునుముందు కూడా ఇలాగే కొనసాగితే ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ మంచి రోజులు వస్తాయని భావించవచ్చు. ఇప్పుడు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి కూడా భారీ ఆర్థిక ప్యాకేజీ లభిస్తున్నందున ఇందులో సందేహపడాల్సింది ఏమీ లేదు. అయితే ఈ సఖ్యతను చెడగొట్టడానికి ప్రయత్నిస్తున్న శక్తులను విస్మరించకూడదు.**

ఫార్ములా-ఈ వ్యవహారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలగా ఉన్నారు. ఈ వ్యవహారంలో కేటీఆర్‌పై కేసు కట్టి విచారణ చేయడానికి అనుమతి ఇవ్వవలసిందిగా గవర్నర్ జిష్ణుదేవ్‌కు ప్రభుత్వం ఫైల్ పంపింది. ప్రభుత్వం అడిగింది కదా అని గవర్నర్ వెంటనే అనుమతి ఇవ్వలేదు. మొత్తం ఫైల్‌ను కేంద్ర ప్రభుత్వ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు పంపి అభిప్రాయం చెప్పవలసిందిగా గవర్నర్ కోరారు. తుషార్ మెహతా సూచన మేరకు కేటీఆర్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ అనుమతి ఇచ్చారు. ఆ తర్వాత అవినీతి నిరోధక శాఖ అధికారులు కేసు నమోదు చేసి అప్పటి అధికారులు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డితో పాటు కేటీఆర్‌ను కూడా విడివిడిగా విచారించారు. ఏసీబీ కేసు ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కూడా కేసు నమోదు చేసుకొని ఈ ముగ్గురినీ విచారించారు. ఈ విచారణలో ఏం తేలింది? కేటీఆర్‌ను కేసులో ఇరికించే ఆధారాలు లభించాయా? లేదా? అన్నది సస్పెన్స్‌గానే ఉంది. ప్రభుత్వం చెల్లించిన 55 కోట్లు తమకు అందాయని ఫార్ములా-ఈ కంపెనీ అంగీకరిస్తున్నందున ఇందులో అవినీతి జరిగిందని ఎలా చెబుతారు? అని తాను విచారణ అధికారులను ఎదురు ప్రశ్నించినట్టు కేటీఆర్ చెబుతున్నారు. గతంలో ఓటుకు నోటు కేసులో కేసీఆర్ సర్కార్ రేవంత్‌రెడ్డిని అరెస్టు చేయించి ఇబ్బందుల పాల్జేసింది. నాడు తనను వేధించినందుకు ప్రతీకారం తీర్చుకునే అవకాశం వచ్చినందున ఫార్ములా-ఈ రేసు కేసులో కేటీఆర్‌ను అరెస్టు చేస్తారన్న అభిప్రాయం బలంగా వ్యాపించింది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ పెట్టుకున్న పిటిషన్‌ను హైకోర్టు, ఆ తర్వాత సుప్రీంకోర్టు కూడా కొట్టివేశాయి. ఈ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయవద్దని హైకోర్టు కొంత కాలంపాటు ఆయనకు రక్షణ కల్పించింది. దీంతో పిటిషన్లు డిస్మిస్ అయిన తర్వాత ఆయనను అరెస్టు చేస్తారని అందరూ భావించారు. ఇలాంటి కేసులలో నిందితులు వెంటనే హైకోర్టుకు వెళ్లి బెయిలు కోరే అవకాశం లేకుండా శుక్రవారం నాడు అరెస్టు చేయడం ప్రభుత్వాలకు అలవాటుగా మారింది. ఈ నేపథ్యంలో హైకోర్టుకు సంక్రాంతి సెలవులు ప్రారంభమైనప్పుడు కేటీఆర్‌ను అరెస్టు చేస్తారని భావించారు. సెలవులు ముగిశాయి. కేటీఆర్ ఈడీ విచారణకు కూడా వెళ్లి వచ్చారు. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో ఎప్పుడైనా కేటీఆర్‌ను అరెస్టు చేయవచ్చునని ప్రచారం జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఆయన లండన్ పర్యటనకు వెళ్లిన తర్వాత చంద్రబాబును అరెస్టు చేశారు. దీంతో సదరు అరెస్టుతో తనకు సంబంధం లేదని, చట్టం తన పని తాను చేసిందని, పోలీసులు చట్ట ప్రకారం చంద్రబాబును ఎత్తారని జగన్‌రెడ్డి అప్పుడు వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. దీంతో తెలంగాణలో ఈ సంఘటనను గుర్తుచేసుకొని ప్రస్తుతం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్నందున కేటీఆర్‌ను కూడా రేపో మాపో అరెస్టు చేస్తారని ప్రచారం మొదలైంది. రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లి రెండు రోజులు దాటింది. దీంతో అసలు కేటీఆర్ అరెస్టు ఉంటుందా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. ప్రభుత్వం కేటీఆర్‌ను అరెస్టు చేయిస్తే రాజకీయంగా తమకు లాభిస్తుందని భారత రాష్ట్ర సమితి నాయకులు మరోవైపు లెక్కలు వేసుకుంటున్నారు. కేటీఆర్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మనసులో ఏముందో తెలియడం లేదు. ఆయన గుంభనంగా ఉంటున్నారు. మంత్రులు మాత్రం జైలుకు వెళ్లడానికి కేటీఆర్ సిద్ధంగా ఉండాలని అడపాదడపా ప్రకటనలు చేస్తున్నారు. దీంతో మొత్తం వ్యవహారం ఇదిగో పులి అంటే అదిగో తోక అన్నట్టుగా తయారవుతోంది.

'క్విడ్ ప్రో కో'లో బలమెంత?

కేటీఆర్‌పై ఏసీబీ అధికారులు కేసులు కట్టి నెల రోజులు అయిపోయినా తదుపరి చర్యలు లేకపోవడంతో అసలు కేసులో బలం ఉందా? అన్న అనుమానాలు సహజంగానే తలెత్తుతాయి. సంబంధిత ఫైలును సొలిసిటర్ జనరల్ క్షుణ్ణంగా పరిశీలించి ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వవచ్చునని గవర్నర్‌కు సూచించి నందున కేసులో బలం లేకుండా ఉంటుందా? అనే అనుమానం కూడా అదే సమయంలో ఉత్పన్నమవుతోంది. అవినీతి జరిగింది అనడానికి తగిన ఆధారాలు లేకపోతే ప్రభుత్వం ఇంత హడావిడి ఎందుకు చేస్తుంది? కేటీఆర్‌ను అరెస్టు చేయలేని పరిస్థితి ఉంటే ప్రభుత్వం అభాసుపాలవుతుంది కదా! ఈ నేపథ్యంలో కేసు పూర్వాపరాల్లోకి వెళదాం. ఫార్ములా-ఈ రేసు నిర్వహణకు తొలుత త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. ఫార్ములా-ఈ కంపెనీతో పాటు గ్రీన్‌కో కంపెనీలో డైరెక్టర్లుగా ఉన్నవారు ఏర్పాటు చేసిన ఏస్ నెక్స్‌జెన్ కంపెనీ, ప్రభుత్వం ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. కారు రేసు నిర్వహణ కోసం తగిన రోడ్లను అభివృద్ధి చేయడం, ఇతర ఏర్పాట్లను చేయడం మాత్రమే ప్రభుత్వం బాధ్యత. రేసు నిర్వహణకు అయ్యే ఖర్చును ఏస్ నెక్స్‌జెన్ కంపెనీ భరించాలి. ఈ ఖర్చును రాబట్టుకోవడం కోసం స్పాన్సర్స్‌ను వెదుక్కోవడం కూడా ఏస్ నెక్స్‌జెన్ బాధ్యత. అయితే స్పాన్సర్లు లభించకపోవడంతో ఏస్ నెక్స్‌జెన్ నష్టపోయింది. దీంతో ఫార్ములా-ఈ కంపెనీకి ఒప్పందం ప్రకారం చెల్లించాల్సిన సొమ్మును ఈ కంపెనీ చెల్లించలేదు. ఈ క్రమంలో త్రైపాక్షిక ఒప్పందం అమలులో ఉండగానే ఫార్ములా-ఈ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ వ్యవహారంలో ఇది మొదటి తప్పు. ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకున్న ప్రభుత్వం హెచ్‌ఎండీఏ ద్వారా 55 కోట్లు ఫార్ములా-ఈ కంపెనీకి చెల్లించింది. ఈ చెల్లింపుల విషయంలో హెచ్‌ఎండీఏ పాలక మండలి ఆమోదం పొందలేదు. పాలక మండలి ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి ఉంటారు. అదే సమయంలో ఆర్థిక శాఖ అనుమతి కూడా పొందలేదు. మున్సిపల్ శాఖ ఒప్పందం కుదుర్చుకుంటే హెచ్‌ఎండీఏ ఎందుకు డబ్బులు చెల్లించాల్సి వచ్చిందనేది మరో ప్రశ్న. ఇవన్నీ పాలనాపరమైన లోపాలు. నిబంధనలు, బిజినెస్ రూల్స్ పాటించకపోవడం వల్ల ఇదంతా జరిగింది. నాటి మంత్రి కేటీఆర్ మౌఖికంగా ఆదేశించడంతో తాము చెల్లింపులు చేశామని నిందితులైన అధికారులు విచారణ అధికారుల వద్ద చెప్పారు. ఇదే నిజమైతే మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌ను ఈ కేసులో ఇరికించడం కష్టం. మంత్రులు, ఆ మాటకొస్తే ముఖ్యమంత్రి.. నోటి మాటగా ఎన్ని చెప్పినా నిబంధనల ప్రకారం నడుచుకోవాల్సిన బాధ్యత అధికారులదే. ముఖ్యమంత్రి లేదా మంత్రులను సంతోషపెట్టడానికి ప్రయత్నిస్తే అందుకు బాధ్యులైన అధికారులే మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ఇక ఫార్ములా-ఈ కంపెనీకి డాలర్ల రూపంలో చెల్లించినందున ఫెమా చట్టం వర్తిస్తుంది. డాలర్ల చెల్లింపులో నిబంధనలు పాటించలేదన్నది మరో ఆరోపణ. ఈ కారణంగానే ఈడీ రంగంలోకి దిగింది. సవరించిన చట్టాల ప్రకారం విదేశాలలో



> **త్రైపాక్షిక ఒప్పందం అమలులో ఉండగానే ఫార్ములా-ఈ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ వ్యవహారంలో ఇది మొదటి తప్పు. ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకున్న ప్రభుత్వం హెచ్‌ఎండీఏ ద్వారా 55 కోట్లు ఫార్ములా-ఈ కంపెనీకి చెల్లించింది. ఈ చెల్లింపుల విషయంలో హెచ్‌ఎండీఏ పాలక మండలి ఆమోదం పొందలేదు. పాలక మండలి ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి ఉంటారు. అదే సమయంలో ఆర్థిక శాఖ అనుమతి కూడా పొందలేదు. మున్సిపల్ శాఖ ఒప్పందం కుదుర్చుకుంటే హెచ్‌ఎండీఏ ఎందుకు డబ్బులు చెల్లించాల్సి వచ్చిందనేది మరో ప్రశ్న. ఇవన్నీ పాలనాపరమైన లోపాలు. నిబంధనలు, బిజినెస్ రూల్స్ పాటించకపోవడం వల్ల ఇదంతా జరిగింది. నాటి మంత్రి కేటీఆర్ మౌఖికంగా ఆదేశించడంతో తాము చెల్లింపులు చేశామని నిందితులైన అధికారులు విచారణ అధికారుల వద్ద చెప్పారు. ఇదే నిజమైతే మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌ను ఈ కేసులో ఇరికించడం కష్టం. మంత్రులు, ఆ మాటకొస్తే ముఖ్యమంత్రి.. నోటి మాటగా ఎన్ని చెప్పినా నిబంధనల ప్రకారం నడుచుకోవాల్సిన బాధ్యత అధికారులదే.**

చెల్లింపులు చేయాలంటే అందుకు సంబంధించిన పత్రాలు సవ్యంగా ఉన్నాయా? లేవా? అని బ్యాంకులు నిర్ధారించుకోవాలి. ప్రైవేటు కంపెనీలు విదేశీ మారకద్రవ్య రూపంలో చెల్లింపులు చేయాలన్నా కూడా బ్యాంకులు అన్ని పత్రాలనూ పరిశీలించిన మీదటే సొమ్ము బదలాయిస్తాయి. ఈ లెక్కన చూసుకుంటే విదేశీ మారకద్రవ్యం చెల్లింపుల్లో అవకతవకలు జరిగి ఉంటే అందుకు సంబంధిత బ్యాంకులు లేదా ఆథరైజ్డ్ బ్యాంక్ బ్రాంచీలు బాధ్యత తీసుకోవాలి. ఈ కారణంగానే హైదరాబాద్ ఇమేజ్‌ను కాపాడటం కోసం తాను చెల్లింపులు చేయాల్సిందిగా ఆదేశించానని, అయితే నిబంధనల ప్రకారం చేయడం అధికారుల బాధ్యత అని కేటీఆర్ సమర్థించుకుంటున్నారు. ఫార్ములా-ఈ కంపెనీకి లభించిన సొమ్ము తిరిగి తనకు వేరే రూపంలో అందినట్టు ఆధారాలు లేనప్పుడు అవినీతి కేసు ఎక్కడిదని కేటీఆర్ దబాయిస్తున్నారు. అయితే ప్రభుత్వం వాదన మరో విధంగా ఉంది. త్రైపాక్షిక ఒప్పందంలో భాగస్వామిగా ఏస్ నెక్స్‌జెన్ కంపెనీని ఎంపిక చేయడంలో కూడా అవకతవకలు జరిగాయని, కేవలం రెండు లక్షల ఈక్విటీతో ప్రారంభించిన కంపెనీ ఒక్క సీజన్‌కు 200 కోట్లు చెల్లించగలదని ఎలా నిర్ణయించారు? ఈ విషయంలో అప్పటి మంత్రి కేటీఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెబుతోంది. ఏస్ నెక్స్‌జెన్ కంపెనీ భాగస్వాములు అందరూ కేటీఆర్‌కు వ్యక్తిగతంగా సన్నిహితులు అని, వారిని కాపాడడానికే త్రైపాక్షిక ఒప్పందం అమలులో ఉండగానే ద్వైపాక్షిక ఒప్పందాన్ని తెర మీదకు తెచ్చారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. రేసు విషయంలో ఏస్ నెక్స్‌జెన్‌ను భాగస్వామిని చేయడానికి అంగీకరించినందునే గ్రీన్‌కో కంపెనీ నుంచి బీఆర్ఎస్ పార్టీకి ఎలక్టోరల్ బాండ్లు అందాయని ప్రభుత్వం చెబుతోంది. మొత్తం 41 కోట్ల రూపాయలను బాండ్ల రూపంలో గ్రీన్ కో కంపెనీ భారత రాష్ట్ర సమితి ఖాతాలో జమ చేసింది. ఇది క్విడ్ ప్రో కో కిందకే వస్తుందని ప్రభుత్వం వాదిస్తోంది. ఫార్ములా-ఈ కంపెనీ నుంచి కేటీఆర్‌కు నేరుగా ముడుపులు ముట్టకపోయినా క్విడ్ ప్రో కో రూపంలో గ్రీన్‌కో కంపెనీ నుంచి బీఆర్ఎస్ పార్టీకి నిధులు అందినందున కేటీఆర్ అవినీతికి, అధికార దుర్వినియోగానికి పాల్పడినట్టేనని ప్రభుత్వ వర్గాల అభిప్రాయంగా ఉంది. ఈ వాదనలో హేతుబద్ధత ఉన్నప్పటికీ న్యాయ సమీక్షలో నిలబడుతుందా? లేదా? అన్నది తేలాల్సి ఉంది. కేసులో మొదటి భాగమైన చెల్లింపులు, నిబంధనల ఉల్లంఘనలో కేటీఆర్‌ను నేరుగా ఇరికించడం సాధ్యమా? అన్న సందేహం కలుగుతోంది. మౌఖిక ఆదేశాలు ఇచ్చినంత మాత్రాన నేరుగా బాధ్యులను చేయలేమని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో అంతా ఒక పథకం ప్రకారం జరిగిందని ఏస్ నెక్స్‌జెన్ కంపెనీ ఎంపికకు, భారత రాష్ట్ర సమితికి సంబంధం ఉందని, ఇందులో క్విడ్ ప్రో కో జరిగిందని రుజువు చేయగల పరిస్థితి ఉంటేనే కేటీఆర్‌ను కేసులో ఇరికించవచ్చు. ఈ కారణంగానే కేటీఆర్ అరెస్టులో జాప్యం జరుగుతూ ఉండవచ్చు. కేటీఆర్ తప్పు చేశారని నిరూపించడానికి అవసరమైన బలమైన ఆధారాలు సేకరించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలన్న ఆలోచనలో ఏసీబీ అధికారులు ఉన్నట్టు చెబుతున్నారు. త్రైపాక్షిక ఒప్పందం గడువు ముగియక ముందే ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ఏస్ నెక్స్‌జెన్ కంపెనీకి భారీ ఉపశమనం కలిగించడం తప్పిదమే. ఈ కంపెనీ బదులు హెచ్‌ఎండీఏ ద్వారా చెల్లింపులు చేయడం కూడా నేరమే. అయితే ఈ రెండు సందర్భాలలో కేటీఆర్‌కు ప్రత్యక్ష సంబంధం ఉందని రుజువు చేయాల్సి ఉంటుంది. అధికారులు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి మాత్రం కచ్చితంగా ఇరుక్కుంటారు. ఇక కేటీఆర్ కూడా ఇరుక్కుంటారా? ఆయన అరెస్టు అవుతారా? అన్నవి ప్రస్తుతానికి శేష ప్రశ్నలు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనను ముగించుకొని వచ్చేసరికి ఏమి జరుగుతుందో చూద్దాం!

> **ఫార్ములా-ఈ కంపెనీ నుంచి కేటీఆర్‌కు నేరుగా ముడుపులు ముట్టకపోయినా క్విడ్ ప్రో కో రూపంలో గ్రీన్‌కో కంపెనీ నుంచి బీఆర్ఎస్ పార్టీకి నిధులు అందినందున కేటీఆర్ అవినీతికి, అధికార దుర్వినియోగానికి పాల్పడినట్టేనని ప్రభుత్వ వర్గాల అభిప్రాయంగా ఉంది. ఈ వాదనలో హేతుబద్ధత ఉన్నప్పటికీ న్యాయ సమీక్షలో నిలబడుతుందా? లేదా? అన్నది తేలాల్సి ఉంది.**

ఏపీకి మంచి రోజులు!

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ విషయానికి వద్దాం. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో తెలుగుదేశం-బీజేపీ-జనసేన చేయి చేయి కలిపి నడవడం వల్ల సత్ఫలితాలు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ నిలదొక్కుకుని బలపడాలంటే కేంద్ర సహకారం పూర్తిగా అవసరం. ఈ కారణంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టువిడుపులతో వ్యవహరిస్తున్నారు. కేంద్రానికి బేషరతుగా మద్దతు ఇస్తున్నారు. ఫలితంగా రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ల రూపంలో ఆర్థిక సహాయం అందించడానికి ముందుకు వచ్చింది. తాజాగా విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నిలబెట్టడానికి 11 వేల కోట్లకు పైగా ఆర్థిక ప్యాకేజీ ప్రకటించింది. పోలవరం ప్రాజెక్టు కూడా సజావుగా పూర్తికావడానికి అవసరమైన ఆర్థిక సహాయం చేయడానికి కేంద్రం ముందుకు వచ్చింది. ఈ మూడు అంశాలకు సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉదారంగా వ్యవహరించారని చెప్పవచ్చు. కేంద్రంలో మోదీ సర్కార్ మూడవ పర్యాయం అధికారం చేపట్టడంలో తెలుగుదేశం పార్టీ మద్దతు కీలకం. అలా అని తనకు లభించిన అవకాశాన్ని కేంద్రంపై పెత్తనం చేయడానికి కాకుండా రాష్ట్రానికి ప్రయోజనాలు పొందడానికి ఉపయోగించాలని చంద్రబాబు నిర్ణయించుకోవడం ఆయన పరిపక్వతకు నిదర్శనం. గతంలో కేంద్రంతో విభేదించినందున ఏం జరిగిందో ఆయనకు తెలుసు కనుక వాజపేయి సర్కారుకు బేషరతుగా మద్దతు ఇచ్చినట్టుగానే ఇప్పుడు మోదీ సర్కారుకు కూడా మద్దతు ఇస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి లోక్‌సభలో 16 మంది సభ్యులు ఉన్నారు. ఈ మాత్రం సంఖ్యా బలాన్ని సమకూర్చుకోవడం మోదీ ప్రభుత్వానికి కష్టం కాదు. ఈ వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకునే చంద్రబాబు.. కేంద్ర ప్రభుత్వానికి తన విధేయతను ప్రకటించారు. ప్రస్తుతానికి చంద్రబాబు అవసరం ప్రధాని మోదీకి, మోదీ అవసరం చంద్రబాబుకు ఉంది. జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు బీజేపీ పెద్దలతో సత్సంబంధాలు ఉన్నందున మూడు పార్టీల మధ్య సఖ్యత సజావుగా సాగుతోంది. ఈ సఖ్యత మునుముందు కూడా ఇలాగే కొనసాగితే ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ మంచి రోజులు వస్తాయని భావించవచ్చు. ఇప్పుడు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి కూడా భారీ ఆర్థిక ప్యాకేజీ లభిస్తున్నందున ఇందులో సందేహపడాల్సింది ఏమీ లేదు. అయితే ఈ సఖ్యతను చెడగొట్టడానికి ప్రయత్నిస్తున్న శక్తులను విస్మరించకూడదు. పొత్తులో ఉన్న భాగస్వామ్య పార్టీలు సొంతంగా ఎదగాలని ప్రయత్నించడం సహజం. ఈ ప్రయత్నంలో భాగస్వామ్య పక్షాల మధ్య పొరపొచ్చాలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతాయి. భాగస్వామ్య పక్షాల మధ్యనే కాదు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజల మధ్య అపోహలు సృష్టించే ప్రయత్నాలు కూడా జరుగుతాయి. 2019కి పూర్వం చంద్రబాబు ప్రభుత్వం రాజధాని అమరావతి నిర్మాణం కోసమే డబ్బంతా ఖర్చు చేస్తోందని ప్రచారం చేసి ఇతర ప్రాంతాల ప్రజల్లో అమరావతిపై వ్యతిరేకతను పెంచారు. ఇప్పుడు మళ్లీ అవే ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. వివిధ రూపాలలో ఉన్న మారీచులు రాజధాని అమరావతిపై విషం చిమ్మడం మొదలుపెట్టారు. లక్ష కోట్లతో రాజధాని నిర్మించడం అవసరమా? అని అసంబద్ధ వాదనలు మళ్లీ తెర మీదకు తెస్తున్నారు. ఒకే ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం ఏమిటి? అని విష ప్రచారాన్ని మళ్లీ మొదలెట్టారు. ఈ క్రమంలో వాస్తవాలకు పాతర వేస్తున్నారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం రాష్ట్ర బడ్జెట్ నుంచి ఒక్క పైసా కూడా కేటాయించలేదు. రాజధాని కోసం రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పూలింగ్ కింద ఇచ్చిన భూములే పెట్టుబడిగా అమరావతి నిర్మాణం జరుగుతోంది. ఇప్పుడు కేంద్రం కూడా పది వేల కోట్లకు పైగా గ్రాంట్‌గా ఇవ్వబోతోంది. తన నిర్మాణానికి అవసరమైన నిధులను తానే సమకూర్చుకోగల శక్తి రాజధాని అమరావతికి ఉంది. ఈ మోడల్‌ను రూపొందించిన చంద్రబాబును అభినందించాల్సిందే. గతంలో ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూములను అంతర్జాతీయ కంపెనీలకు కేటాయించడం ద్వారా సైబరాబాద్ నగరానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. తదుపరి ముఖ్యమంత్రులు కూడా అదే పని చేశారు. ఫలితంగా ఇప్పుడు హైదరాబాద్ దేశంలోనే అతి పెద్ద నగరాలలో ఒకటిగా నిలబడింది. ఈ నగరం వల్ల వస్తున్న ఆదాయంతోనే తెలంగాణలోని ఇతర జిల్లాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయగలుగుతోంది. భవిష్యత్తులో అమరావతి కూడా హైదరాబాద్ స్థాయిలో కాకపోయినా గ్రీన్ సిటీగా అభివృద్ధి చెందితే ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. అప్పుడు ఆ ఫలాలను రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రజలూ అనుభవిస్తారు. మూడు రాజధానులు అంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రాష్ట్రానికి చేసిన నష్టం ఎంతో అందరికీ తెలిసిందే. కార్యనిర్వాహక రాజధానిగా అభివృద్ధి చేస్తానని ప్రకటించి విశాఖపట్టణాన్ని చెరబట్టారు. ప్రైవేట్ కంపెనీలు, సంస్థలను హస్తగతం చేసుకున్నారు. భూములు కొల్లగొట్టారు. ఇప్పుడు

> **ఫార్ములా-ఈ వ్యవహారంలో కేటీఆర్‌పై కేసు కట్టి విచారణ చేయడానికి అనుమతి ఇవ్వవలసిందిగా గవర్నర్ జిష్ణుదేవ్‌కు ప్రభుత్వం ఫైల్ పంపింది. మొత్తం ఫైల్‌ను కేంద్ర ప్రభుత్వ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు పంపి అభిప్రాయం చెప్పవలసిందిగా గవర్నర్ కోరారు. తుషార్ మెహతా సూచన మేరకు కేటీఆర్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ అనుమతి ఇచ్చారు. ఆ తర్వాత అవినీతి నిరోధక శాఖ అధికారులు కేసు నమోదు చేసి అప్పటి అధికారులు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డితో పాటు కేటీఆర్‌ను కూడా విడివిడిగా విచారించారు. ఏసీబీ కేసు ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కూడా కేసు నమోదు చేసుకొని ఈ ముగ్గురినీ విచారించారు. ఈ విచారణలో ఏం తేలింది? కేటీఆర్‌ను కేసులో ఇరికించే ఆధారాలు లభించాయా? లేదా? అన్నది సస్పెన్స్‌గానే ఉంది.**

రాజధాని అమరావతిలో కబ్జాలకు తావుండదు. ప్రతి సెంటు భూమికీ పక్కాగా లెక్క ఉంటుంది. భూములు ఇచ్చిన రైతులకు పద్ధతి ప్రకారం ప్లాట్లు కేటాయిస్తున్నారు. మిగిలిన భూమిని గ్యారంటీగా చూపించి నిధులు సమకూర్చుకొని నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నారు. రాజధానిపై విషం చిమ్ముతున్న వారికి ఈ విషయం తెలియదా? తెలిసి కూడా విష ప్రచారం చేస్తున్నారంటే రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నారనే భావించాలి. ఆర్థిక భారం లేనప్పుడు రాజధాని ఎలా ఉండాలో చెప్పే అధికారం వారికి ఏముంటుంది? పెద్ద నగరాన్ని నిర్మించడం వల్ల రాష్ట్ర ప్రజలపై భారం పడనప్పుడు ఈ మారీచులకు కడుపుమంట ఎందుకు? రాష్ట్రం విడిపోయి పదేళ్లు దాటింది. ఇప్పటికీ రాజధాని లేని రాష్ట్రంగా మిగిలిపోవాల్సి రావడాన్ని మించిన విషాదం ఏమిటి? అమరావతి నిర్మాణానికి అడ్డుపుల్లలు వేస్తున్నవారి అంతరంగాన్ని రాష్ట్ర ప్రజలు ఇప్పటికైనా గుర్తించాలి. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నా, పేదలకు సంక్షేమం అందాలన్నా మహా నగరాల నుంచి లభించే ఆదాయమే ప్రధానం. అమరావతి నిర్మాణం కోసం ఖర్చు చేసే ప్రతి పైసా నుంచి ప్రభుత్వానికి 20 శాతం వరకు పన్నుల రూపంలో వెనక్కు వస్తోంది. రాష్ట్ర బడ్జెట్‌తో సంబంధం లేకుండా నిర్మితమవుతున్న నగరాన్ని అడ్డుకునేవారు ఎవరైనా ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్పాలి. ఈ కుటిల యత్నాలను తిప్పికొట్టని పక్షంలో కేంద్ర సహకారం ఉన్నా రాష్ట్రం బలపడదు. ఇదివరకు ఒకసారి మాయలో పడి నష్టపోయారు. మళ్లీ అదే పొరపాటు చేయవద్దు. తస్మాత్ జాగ్రత్త!

భారతీయులమన్న భావనే భవితకు భరోసా

> **ప్రజలందరూ ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి ఫలాలు అందరికీ చేరుతాయి. రాజ్యాంగ విలువలు నిలుస్తాయి. పాలకుల ఆకర్షణీయ నినాదాల మాటున సృష్టిస్తున్న అడ్డంకులను ఛేదించి, ఒక్కటిగా సాగడమే మెరుగైన భారత్ నిర్మాణానికి అవసరం.**


కలసి ఉంటే కలదు సుఖం, ఐకమత్యమే మహా బలం వంటివి ప్రాచుర్యం పొందిన నినాదాలు. "చెట్టా పట్టాల్ కట్టుకుని దేశస్థులంతా నడవవలెనోయ్" అన్నాడు గురజాడ. 'ఆవాజ్ దో- హమ్ ఏక్ హై' అనే నినాదం శ్రామికులు ఇస్తూ ఉంటారు. దీనర్థం మేమంతా ఒక్కటే అని గట్టిగా నినదించడం. ఇటువంటివన్నీ దేశ ప్రజలలో ఐక్యతభావాన్ని పెంపొందించి, దేశాన్ని ముందుకు నడిపించే నినాదాలు. ఇటువంటి ఐక్యతే రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదం నుంచి దేశానికి స్వాతంత్ర్యం సాధించింది.

ఇటీవల మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఒక నినాదం ఇచ్చారు. అదేమిటంటే 'ఏక్ హైతో సేఫ్ హై'. దీనర్థం- ఒకటిగా ఉంటే సురక్షితంగా ఉంటామని. ఇది కూడా పైకి మంచి నినాదంలానే కనపడుతుంది. కానీ దేశ ప్రజలను విడగొట్టడమే ఈ నినాదం లక్ష్యం. హిందువులందరూ ఒకటిగా ఉండాలి అనే రెచ్చగొట్టే నినాదమిది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మరో అడుగు ముందుకు వేసి 'బటేంగే తో కటేంగే' (విడిపోతే నాశనం అవుతాం) అన్నారు. హిందువుల్లో భయాలను కల్పించడం ఈ నినాదం ఉద్దేశం.

నిజంగా వీరికి హిందువులందరినీ ఏకం చేసే ఉద్దేశం ఉంటే డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చెప్పినట్టు దేశంలో కుల నిర్మూలనకు చర్యలు చేపట్టాలి. అలాగే పురుషులతో సమానమైన హక్కులు ఆచరణలో మహిళలకు ఉండాలి. ఈ రెండూ లేకుండా ఏకం చేయడం అసాధ్యం. మనదేశంలో నేడున్న కుల వ్యవస్థకు పునాది వర్ణ వ్యవస్థ. శాస్త్ర సాంకేతిక రంగాలలో సాధిస్తున్న పురోగతి గానీ, ఆర్థికాభివృద్ధి వంటివి గానీ ఈ కుల వ్యవస్థను నిర్మూలించలేకపోయాయి. మన దేశాన్ని పాలించిన స్థానిక పాలకులు, తరువాత వచ్చిన మొగలులు, యూరోపియన్ పాలకులు దేశంలో అనేక మార్పులు ప్రవేశపెట్టినా ఎవరూ కూడా ఈ కుల వ్యవస్థను తాకలేకపోయారు. ప్రజలను పుట్టుకతోనే వారి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా విభజించే ఈ కుల వ్యవస్థ భారతదేశ సనాతన ధర్మంలో భాగం. ఎన్నికలలో గెలుపునకు బ్రహ్మాస్త్రంలా సోషల్ ఇంజనీరింగ్ అనే నేటి రాజకీయ నేతల ప్రోద్బలంతో మరింత బలోపేతమయ్యే దిశలో సాగుతోంది. తాజాగా అసోం ముఖ్యమంత్రి మూడు అగ్రవర్ణాల సేవకే శూద్రులు అని బహిరంగంగానే కుండబద్దలు కొట్టారు. ఇటీవల వీరు 'కులం ఇంట్లోనే- బయటకొస్తే హిందువులం' అనే కొత్త నినాదం ఇచ్చారు. ఇది కులవ్యవస్థను మతం ముసుగులో కప్పిపుచ్చడానికే. వాస్తవంగా 'ఇంట్లోనే మతం- బయటకొస్తే మనమంతా భారతీయులం' అనే భావనే దేశానికి రక్షగా నిలుస్తుంది.

దీనితో పాటే మన దేశంలో మరొక అతిపెద్ద సామాజిక రుగ్మత మహిళల పట్ల వివక్షత. 'ప్రపంచ ఆర్థిక నివేదిక 2024' ప్రకారం లింగ వివక్షత సూచీలో 144 దేశాలకు గాను మన దేశ స్థానం 127. మన పొరుగుదేశాలైన బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, భూటాన్ వంటివి లింగ సమానత్వంలో మన కంటే మెరుగ్గా ఉన్నాయి. 'జార్జిటౌన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఉమెన్' సంస్థ నివేదిక ప్రకారం శాంతి, సంరక్షణ వంటి అంశాలలో మన దేశం 128వ స్థానంలో నిలిచింది. మహిళలపై లైంగిక హింస, వేధింపులు, అక్రమ రవాణా వంటి అంశాలలో ఆసియా ఖండంలో ప్రమాదకర దేశం ఇండియా అని ఆ నివేదిక పేర్కొంది. పురిట్లోనే ఆడ శిశువులను చంపేసిన చరిత్రా మనకుంది. వరకట్న దురాచారం నేటికీ కొనసాగుతూనే ఉంది. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళల పట్ల సమానత్వం సాధించకుండా 'ఏక్ హైతో సేఫ్ హై' అనే నినాదం ఎలా సాధ్యమవుతుంది?


నేడు మహిళల మీద అత్యాచారాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ అత్యాచారాలకు పాల్పడుతున్నది అత్యధికంగా ఆ మహిళలకు సన్నిహితంగా ఉన్నవారే. అంటే మోదీ చెప్పిన ఏక్ హై అనేది వీరికి పూర్తిగా వర్తిస్తుంది. అయితే మహిళకు మాత్రం మోదీ చెప్పిన సేఫ్ అంటే రక్షణ మాత్రం లేకుండా పోయింది. ఆశ్చర్యకరంగా ఈ నినాదాలిచ్చిన వారే ఇటువంటి రాబందుల కొమ్ము కాస్తున్నారు. అందువల్ల మహిళా సమానత్వం, మనుధర్మవాదుల ద్వారా సాధ్యం కాదు. అసలు సనాతనమంటేనే సమానత్వానికి వ్యతిరేకం. "మహిళలకు పురుషులపై ఆధిపత్యం ఉండనక్కర లేదు- వారిపై వారికి ఉంటే చాలు" అన్నారు మేరీ వోల్‌స్టోన్‌క్రాఫ్ట్ అనే 18వ శతాబ్దపు ప్రముఖ బ్రిటిష్ తత్వవేత్త. నేడు మన దేశంలో సరిగ్గా అదే కరువైంది.



మనుధర్మానికి పునాది అయిన ప్రజలను చీల్చి ఉంచే కుల వ్యవస్థను, మహిళల పట్ల వివక్షతను పెంచి పోషిస్తూ... మరోపక్క ఏకం కండి అనే నినాదం ఇవ్వడం... విద్వేషపూరిత, రాజకీయ ప్రయోజనాలతో కూడుకున్నదే. మతం పేరున ప్రజలను మభ్యపెట్టి నిరుద్యోగం, పేదరికం, అసమానతలు, ధరల పెరుగుదల, మహిళలపై అత్యాచారాలు, విద్వేష దాడులు, తెగల మధ్య చిచ్చులు వంటి సమస్యల నుంచి ప్రజలను పక్కదారిపట్టించడానికే ఈ నినాదం. "ఏ నినాదం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయో తెలుసుకోలేనంత కాలం ప్రజలు మోసపోతూనే ఉంటారు" అన్నది లెనిన్ చెప్పిన అక్షర సత్యం.

మోదీ చెప్పిన కోణం నుంచి కాకుండా మరో కోణం నుంచి చూస్తే ఈ రోజు దేశం ఎదుర్కొంటున్న సకల సమస్యల పరిష్కారానికి అదే నినాదం ఉపయోగపడుతుంది. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా దేశ ప్రజలందరూ ఐక్యమైతేనే నేటి దేశ సమస్యలను పరిష్కారం చేసుకోగలం. రైతులందరూ ఐక్యంగా ఉద్యమిస్తేనే వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర సాధించుకోవచ్చు. కార్మికులందరూ ఐక్యంగా పోరాడితేనే హక్కులు నిలుపుకోవడం, దేశ సంపదను, ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించుకోవచ్చు. దేశ ప్రజలందరూ ఐక్యంగా ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొస్తేనే ఉపాధి లేమి, ఆర్థిక అసమానతలు, దారిద్ర్యం వంటి సమస్యల పరిష్కారం సాధ్యమవుతుంది. కుల మతాలకతీతంగా ప్రజలందరూ చైతన్యం ప్రదర్శిస్తేనే మహిళల పట్ల వివక్షత, అత్యాచారాలు నిలవరించగలం. గొప్ప సామాజిక చైతన్యం, సోదరభావం పెంపొందిస్తేనే కుల వ్యవస్థ నిర్మూలించడం సాధ్యం. వాస్తవంగా ఇటువంటి ఐక్యత మన స్వాతంత్ర్యోద్యమ వారసత్వం. ప్రజలందరూ ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి ఫలాలు అందరికీ చేరుతాయి. రాజ్యాంగ విలువలు పరిరక్షించబడతాయి. ప్రజలు ఐక్యంగా ప్రతిఘటించకపోతే, ప్రభుత్వం నేడు ప్రజలపై వేస్తున్న భారాలను మరింత పెంచుతుంది. అందువల్ల ఇక్కడ కూడా యోగి ఆదిత్యనాథ్ ఇచ్చిన 'విడిపోతే నశిస్తాం' అనే నినాదం మరో కోణంలో వర్తిస్తుంది. పాలకుల ఆకర్షణీయ నినాదాల మాటున సృష్టిస్తున్న అడ్డంకులను ఛేదించి, మనమంతా భారతీయులమనే భావనతో ముందుకు సాగడమే మెరుగైన భారత్ నిర్మాణానికి నేడు అత్యవసరం.

■ ఎ. అజశర్మ
ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక



శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.2 కనిష్ఠం 18.8

ప్రకటనలపై పంచాయితీ

- ఎల్ అండ్ టీ, హెచ్ఎంఆర్ నుంచి బకాయిలు
- ఎనిమిదేళ్ల క్రితం జీహెచ్ఎంసీ నోటీసులు
- రాయితీ/మినహాయింపు ఉందంటోన్న మెట్రో వర్గాలు
- లిఖితపూర్వక ఆదేశాలు కావాలంటోన్న బల్దియా
- సుమారు రూ.65 కోట్లు పెండింగ్

జీహెచ్ఎంసీ, ఎల్అండ్టీ, హెచ్ఎంఆర్ల మధ్య ప్రకటనల రుసుము పంచాయితీ తేలడంలేదు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఈ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. కొన్నేళ్ల క్రితం బకాయిలు చెల్లించాలని బల్దియా నోటీసులివ్వగా.. సర్కారు వద్ద మాట్లాడతామని మెట్రో వర్గాలు పేర్కొన్నట్టు తెలిసింది. సుమారు రూ.65 కోట్లు ఎల్అండ్టీ, హెచ్ఎంఆర్ నుంచి రావాల్సి ఉందని బల్దియా ప్రకటనల విభాగం వర్గాలు చెబుతున్నాయి.

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్లో 69 కిలోమీటర్ల మేర మెట్రో మార్గం అందుబాటులోకి వచ్చింది. మూడు కారిడార్లలో 60 స్టేషన్లు, 2,599 పిల్లర్లు ఉన్నాయి. స్టేషన్ల వద్ద ఫుట్పాత్ల రెయిలింగ్లు, మెట్రో పిల్లర్లతోపాటు ప్రధాన చౌరస్తాల్లో వయాడక్ట్కు ప్రకటనల బోర్డులు, సెంట్రల్ మీడియన్లో లాలిపాప్లు ఏర్పాటు చేసిన ఎల్అండ్టీ, హెచ్ఎంఆర్ భారీగా ఆదాయం పొందుతున్నాయి. టెండర్ ద్వారా ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించాయి. నిబంధనల ప్రకారం నగరంలో ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేస్తే జీహెచ్ఎంసీ అనుమతి తీసుకొని నిర్ణీత రుసుము చెల్లించాలి. పరిమాణాన్ని బట్టి ఒక్కో బోర్డుకు ఏటా రూ.2,300 నుంచి రూ.4,500 చెల్లించాలని జీహెచ్ఎంసీ చెబుతోంది. ఇందులో సగం మాత్రమే ఆ సంస్థలు చెల్లిస్తున్నట్టు సమాచారం. ఎనిమిదేళ్లుగా సుమారు రూ.65 కోట్లు పెండింగ్ ఉన్నట్టు తెలిసింది. ఇందులో అత్యల్పం హెచ్ఎంఆర్ నుంచి రావాల్సి ఉండగా.. దాదాపు 90 శాతం ఎల్అండ్టీ చెల్లించాల్సి ఉంది. స్టేషన్ల వద్ద ఫుట్పాత్లకు ఇరువైపులా ఉన్న రెయిలింగ్కు ఏర్పాటుచేసిన, ఇతరత్రా ప్రకటనల ఆదాయం మాత్రమే తమకు వస్తుందని హెచ్ఎంఆర్ వర్గాలు చెబుతున్నాయి. బకాయి చెల్లించాలని గత ప్రభుత్వ హయాంలోనూ ఎల్అండ్టీ, హెచ్ఎంఆర్లకు జీహెచ్ఎంసీ నోటీసులిచ్చింది. అప్పటి ప్రభుత్వం వద్దకు పంచాయితీ చేరడంతో.. ప్రకటనల రుసుము విషయంలో ఇబ్బంది పెట్టవద్దని మౌఖికంగా ఆదేశాలు జారీ చేసినట్టు ఓ అధికారి తెలిపారు. దీనిపై లిఖితపూర్వకంగా ఎలాంటి ఆదేశాలు లేవు. ఈ నేపథ్యంలో అప్పుడప్పుడు బల్దియా నోటీసులిస్తోంది. ప్రభుత్వం రాయితీ ఇచ్చిందని ఎల్అండ్టీ, హెచ్ఎంఆర్ వర్గాలు చెబుతుండగా.. సర్కారు నుంచి స్పష్టమైన ఆదేశాలు (లిఖితపూర్వక) ఉండాలని జీహెచ్ఎంసీ అధికారులు సూచించారు. దీంతో మరోసారి ప్రకటనల వివాదం సర్కారుకు చేరినట్టు తెలుస్తోంది.



మెట్రో పిల్లర్లపై ఏర్పాటు చేసిన ప్రకటనల బోర్డులు (ఫైల్)

మెట్రో కారిడార్లలో వర్తించని నిబంధనలు

నగరంలో హోర్డింగ్లు, నిర్ణీత ఎత్తు మించి ప్రకటనల బోర్డుల ఏర్పాటును నిషేధిస్తూ గత ప్రభుత్వం ఏప్రిల్ 20, 2020న ఉత్తర్వులు (జీఓ-68) జారీ చేసింది. 15 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో హోర్డింగులు, దుకాణాల బోర్డులు ఉండొద్దని జీఓలో స్పష్టంగా పేర్కొంది. అనంతరం గ్రేటర్లోని మెజార్టీ హోర్డింగ్లు ఇప్పటికే తొలగించారు. అక్కడక్కడా ఉన్నా.. ఎలాంటి ప్రకటనలు ఏర్పాటు చేయడం లేదు. ఎల్అండ్టీ విషయంలో మాత్రం ఈ నిబంధనలు వర్తించడం లేదు. బారాకూన్ మాఫ్ అన్నట్టుగా ఆ సంస్థలు వ్యవహరిస్తున్నాయి. మెట్రో కారిడార్లలోని పలు ప్రాంతాల్లో 15 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్, నారాయణగూడ, సికింద్రాబాద్, మాదాపూర్, కొండాపూర్, తార్నాక, పంజాగుట్ట తదితర ప్రాంతాల్లో ఎక్కువ ఎత్తులో మెట్రో వయాడక్ట్, పోర్టల్ ఫ్రేమ్లున్నాయి. వీటిపై చాలా వరకు 15 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ప్రకటనల బోర్డులు ఉండడం గమనార్హం.



ఎన్టీఆర్కు ఘన నివాళి

దివంగత నేత, మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం నగర వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు ఘన నివాళులర్పించాయి. ఈ సందర్భంగా పలుచోట్ల రక్తదాన శిబిరాలను నిర్వహించి అన్నదానం చేశారు. రసూల్పురాలో బాలకృష్ణ ఎన్టీఆర్ అమరజ్యోతి ర్యాలీని ప్రారంభించారు.

వివరాలు 8వ పేజీలో..



బసవతారకం ఆస్పత్రిలో ఎన్టీఆర్ దంపతుల విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న బాలకృష్ణ



బీఆర్ఎస్ నాయకురాలు ఇందిరాగౌడ్పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రంగనాథ్

చెరువును కబ్జా చేస్తే ఏం చేస్తున్నారు?

- అధికారులు, పోలీసులపై హైడ్రా కమిషనర్ కన్నెర్ర
- పాఠశాల క్రీడా స్థలం, భవనాలు కట్టినా చర్యల్లేవా?
- గూండాలతో దాడులు చేయిస్తున్నా మిన్నకున్నారా?
- బాలకృష్ణ అనే వ్యక్తి ఆక్రమణలు చూసి విస్మయం
- జగద్గిరిగుట్టలో రంగనాథ్ పరిశీలన
- బీఆర్ఎస్ నేత ఇందిరాగౌడ్ భారీ కబ్జాపై ఆశ్చర్యం

జీడిమెట్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): "చెరువును పూడ్చి.. ఆక్రమించి నిర్మాణాలు చేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు..? గూండాలతో స్థానికులపై దాడులు చేస్తుంటే ఏం చేస్తున్నారు?" అని అధికారులు, పోలీసులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పరిశీలించి కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేయండి అని సూచించారు. ప్రభుత్వ, ఆలయ భూముల కబ్జాపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో శనివారం జగద్గిరిగుట్టలో వివిధ శాఖల అధికారులతో కలిసి రంగనాథ్ పర్యటించారు. భూదేవిహిల్స్ ప్రాంతంలో బాలకృష్ణ అనే వ్యక్తిపై వచ్చిన ఆరోపణలను పరిశీలించారు. అతడు ఏర్పాటు చేసుకున్న సామ్రాజ్యాన్ని చూసి విస్తుపోయారు. పరికి చెరువు స్థలంలో పాఠశాల క్రీడా మైదానం, భవనాల నిర్మాణాలను చూసి ఆశ్చర్యపోయారు. ఇంత జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులను నిలదీశారు. "ఎవరీ బాలకృష్ణ..? అతడి వివరాలు సేకరించండి.. మీ దగ్గర ఉన్న పత్రాలతో బుధవారం నా కార్యాలయానికి రండి" అని ఆదేశించారు. వేంకటేశ్వరస్వామి, గోవిందరాజుల స్వామి ఆలయ స్థలాలను ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామని రంగనాథ్ స్పష్టం చేశారు. ఇదే ప్రాంతంలో బీఆర్ఎస్ స్థానిక నాయకురాలు ఇందిరాగౌడ్ కబ్జా చేసిన భారీ స్థలాన్ని చూసి రంగనాథ్ ఆశ్చర్యపోయారు. ప్రభుత్వ భూముల్లో గదులు నిర్మించి ఆర్టీసీ సిబ్బంది విశ్రాంతికి అద్దెకు ఇవ్వడాన్ని గమనించి.. ఏం పత్రాలు ఉన్నాయని ప్రశ్నించారు. ఆధారాలు లేకపోతే కూల్చివేస్తామని, కేసులు

మిగతా 8వ పేజీలో..

గ్రేటర్ వ్యాప్తంగా..

భూగర్భ కేబుల్ వ్యవస్థ!

- ఓవర్హెడ్ లైన్లు తొలగించి యూజీసీ ఏర్పాటు దిశగా డిస్కం అడుగులు
- ఆసక్తిగల సంస్థలు, ఏజెన్సీలకు ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాలతో గ్రేటర్ వ్యాప్తంగా ఉన్న ఓవర్హెడ్ లైన్ల స్థానంలో భూగర్భ (యూజీసీ) కేబుల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు ఆసక్తిగల సంస్థలను, ఏజెన్సీలను టీజీఎస్పీడీసీఎల్ ఆహ్వానిస్తోంది. దేశంలోని ప్రముఖ నగరాలతోపాటు ఇతర దేశాల్లో అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్న అక్కడ పరిస్థితులను డిస్కం పరిశీలిస్తోంది. అంతర్జాతీయంగా అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థపై అనుభవం, ప్రతిపాదిత ఖర్చులపై ఆయా ఏజెన్సీలు అందజేసే నివేదిక ఆధారంగా దక్షిణ డిస్కం ముందుకెళ్లనుంది. ఇప్పటికే గ్రేటర్లో గత కొన్నేళ్లుగా కొత్తగా నిర్మిస్తున్న సబ్స్టేషన్ల మధ్య పూర్తిస్థాయిలో అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థను విద్యుత్శాఖ అందుబాటులోకి తీసుకువస్తోంది. అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ ఏర్పాటు చేస్తే భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా ఎలాంటి విద్యుత్ సమస్యలుండవని సీనియర్ ఇంజనీర్లు చెబుతున్నారు. గ్రేటర్లో 30-40 ఏళ్ల క్రితం వేసిన ఓవర్హెడ్ విద్యుత్ లైన్లు నేడు ప్రమాదంగా

మిగతా 8వ పేజీలో..



(ఫైల్)

గ్రేటర్లో విద్యుత్ నెట్వర్క్ వివరాలు

33/11 కేవీ సబ్స్టేషన్లు	498
33కేవీ యూజీ కేబుల్	1,280 కి.మీ
33కేవీ ఓవర్హెడ్లైన్స్	3,725 కి.మీ
11 కేవీ ఓవర్హెడ్లైన్స్	21,643 కి.మీ
సబ్స్టేషన్లలో పవర్ ట్రాన్స్ఫార్మర్లు	1,022
11కేవీ యూజీ కేబుల్	957 కి.మీ
డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు	1,50,992
విద్యుత్ స్తంభాలు	58,271



అర్హులందరికీ

రేషన్ కార్డులు

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందజేస్తామని, కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కులగణన ఆధారంగా రూపొందించిన జాబితాను క్షేత్రస్థాయి పరిశీలనకు పంపారు. నిర్ణీత ధ్రువీకరణ తర్వాత అర్హులైన అందరికీ కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న దరఖాస్తులను అర్హత ప్రకారం పరిశీలిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కులగణన పరిధిలోకి రానివారు రేషన్ కార్డు కోసం ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తులను అందజేయవచ్చన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతరం సాగే ప్రక్రియ అని కలెక్టర్ తెలిపారు.

హేళన చేస్తున్నాడని కడతేర్చారు

- వ్యక్తి హత్య కేసులో తొమ్మిదిమంది అరెస్ట్

కుషాయిగూడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి హత్యకేసును చర్లపల్లి పోలీసులు ఛేదించారు. తొమ్మిదిమంది నిందితులను అరెస్ట్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్స్పెక్టర్ రవికుమార్ వివరాలు వెల్లడించారు. జార్ఖండ్ రాష్ట్రం, దుమ్కా జిల్లా, ముకురాంపూర్ కమర్సాలి గ్రామానికి చెందిన బాబుషాయ్ తుడు(34) బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేజ్-1లోని ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. అతడి స్వగ్రామం, పరిసర గ్రామాలకు చెందిన మరికొంతమంది కూడా సదరు కంపెనీలో పనిచేస్తూ యాజమాన్యం కేటాయించిన గదుల్లో ఉంటున్నారు. వీరంతా సెలవు రోజుల్లో మద్యం తాగేవారు. బాబూషాయ్ తరచుగా తోటి కార్మికులను అవహేళన చేస్తూ, వారిపై ఆధిపత్యం ప్రదర్శించేవాడు. అతడి ప్రవర్తన నచ్చని తోటి కార్మికులు అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండగరోజు రాత్రి అందరూ కలిసి స్థానికంగా గల దుర్గాభవానీ వైన్స్లో మద్యం తాగారు. అనంతరం బాబుషాయ్ను చర్లపల్లి ఫుక్కట్నగర్ రోడ్డులోగల ఖాళీ ప్రదేశానికి తీసుకెళ్లి మళ్లీ మద్యం తాగించి చితకబాదారు. కిందపడిపోయిన అతడి

మిగతా 8వ పేజీలో..



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు



ప్రతీయేటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదాలను తగ్గించడానికి పోలీసులు, ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా వాహనదారుల్లో మార్పు రావడంలేదు. అతివేగంగా వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. రెండేళ్లలో సైబరాబాద్లో జాతీయ, రాష్ట్ర రహదారులపైనే అత్యధిక ప్రమాదాలు జరిగినట్లు ఆర్టీఏఎమ్ సెల్ అధ్యయనంలో వెల్లడైంది.

- సైబరాబాద్లో జాతీయ, రాష్ట్ర రహదారులపైనే అత్యధిక ప్రమాదాలు
- ఆర్టీఏఎమ్ సెల్ అధ్యయనంలో వెల్లడి

మృత్యుదారులు

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్ విభాగం అధికారులు రహదారి భద్రతకు, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా పలు ప్రాంతాల్లో యాక్సిడెంట్స్ను మాత్రం నివారించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి, యాక్సిడెంట్స్ జరగడానికి గల కారణాలను అధ్యయనం చేయడానికి సైబరాబాద్లో ప్రత్యేకంగా ఆర్టీఏఎమ్ సెల్ (రోడ్డు ట్రాఫిక్ యాక్సిడెంట్స్ మానిటరింగ్ సెల్) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రెండేళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాలను ఆర్టీఏఎమ్ సెల్ అధ్యయనం చేయగా.. కమిషనరేట్ పరిధిలో ఉన్న రాష్ట్ర, జాతీయ రహదారులు మృత్యుదారులుగా మారినట్లు తేలింది. 2023, 2024 సంవత్సరాల్లో జరిగిన 6,865 రోడ్డు ప్రమాదాల్లో 2,321 యాక్సిడెంట్లు కేవలం జాతీయ, రహదారులపైనే జరిగినట్లు పోలీసుల అధ్యయనంలో

మిగతా 8వ పేజీలో..



సికింద్రాబాద్ ఆలుగడ్డబావి జంక్షన్ వద్ద రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఈస్ట్జోన్ డీసీపీ అశోక్కుమార్

2023, 2024లో సైబరాబాద్ పరిధిలో రహదారుల వారీగా జరిగిన ప్రమాదాలు, మృతులు, క్షతగాత్రుల వివరాలు

రోడ్లు	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
జాతీయ/రాష్ట్ర రహదారులు	2,321	617	1,704
ఆర్ అండ్ బీ	1,310	399	911
జీహెచ్ఎంసీ	509	75	434
ఓఆర్ఆర్	269	80	189
పీవీఎన్ఆర్	20	05	15
హెచ్ఎండీఏ/హెచ్జీసీఎల్, హెచ్ఆర్డీసీఎల్/సీఆర్ఎంపీ, టీఎస్ఐఐసీ/మున్సిపాలిటీ, ఇతర రోడ్లు	2,436	441	1,995
మొత్తం	6,865	1,617	5,248

లాటరీ పేరుతో మోసం

వృద్ధుడి నుంచి రూ. 2.17 లక్షల కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): లక్కీ డ్రాలో లాటరీ తగిలిందని ఓ వృద్ధుడిని నమ్మించి రూ. 2.17 లక్షలు కాజేశారు సైబర్ నేరగాళ్లు. నగరానికి చెందిన వృద్ధుడి(67)కి వారం రోజుల క్రితం ఇన్స్టాగ్రామ్ ద్వారా గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. ఇన్స్టాగ్రామ్లో కొన్ని ఐడీలను సెలెక్ట్ చేసి కేరళలో లక్కీడ్రా నిర్వహించగా.. అందులో మీరు రూ. 5లక్షల గెలుచుకున్నారని నమ్మించాడు. లాటరీ డబ్బుకు సంబంధించిన చెక్కును మీకు అందజేయాలంటే జీఎస్టీ, ఇన్సూరెన్స్, ఇతర చార్జీల కింద కొంత డబ్బు చెల్లించాలని, ఆ డబ్బు తిరిగి మీ ఖాతాలో జమ చేస్తారని నమ్మించాడు. నిజమని నమ్మిన బాధితుడు గుర్తుతెలియని వ్యక్తులు చెప్పిన ఖాతాల్లో దశలవారీగా రూ. 2,17,426 జమ చేశాడు. డబ్బు అందగానే వారు స్పందించలేదు. మోసపోయానని గ్రహించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూసేస్తారా..

భర్తీ చేస్తారా..

- ఉపాధ్యాయులు లేక దీనస్థితిలో ఉర్దూ మీడియం పాఠశాలలు
- రిజర్వేషన్ కారణంగా భర్తీకాని ఖాళీలు
- తీవ్రంగా నష్టపోతున్న విద్యార్థులు

8

సమ్మర్ విద్యుత్ డిమాండ్

110 ఎంయూలు..!

దక్షిణ డిస్కం ఆపరేషన్ విభాగం అంచనా



డైరీని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

టీఈఏఈఏ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ (టీఈఏఈఏ) -2025 డైరీ, క్యాలెండర్‌ను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శనివారం ప్రజాభవన్‌లో ఆవిష్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీష్, చీఫ్ అడ్వైజర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలోని ఇంజనీర్ల ప్రతినిధి బృందం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఇమ్రాన్, యాదగిరి, నరోత్తం కుమార్, రాజా రవిచంద్ర, మజహార్, ప్రియాంక, అనిల్ రెడ్డి, ప్రవీణ్, సతీష్ పాల్గొన్నారు.

చర్లపల్లి జైలును సందర్శించిన న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు



ఖైదీలకు అందజేస్తున్న భోజనాన్ని పరిస్తున్న పంచాక్షరి, కిరణ్‌కుమార్

కుషాయిగూడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి జైలు కేంద్ర కారాగారాన్ని శనివారం న్యాయ సేవాధికార సంస్థ అధికార బృందం సందర్శించింది. తెలంగాణ రాష్ట్ర గౌరవ కార్యదర్శి సిహెచ్.పంచాక్షరి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గౌరవ కార్యదర్శి డి.కిరణ్ కుమార్ సెంట్రల్ జైలులో పర్యటించారు. జైలులో ఖైదీలకు అందజేస్తున్న చికిత్సలు, అధునాతన కిచెన్, 'మైనేషన్' బ్రాండ్‌తో తయారు చేస్తున్న వివిధ ఫ్యాక్టరీ ఉత్పత్తులు, నర్సరీ, ఖైదీల బ్యారక్‌లను వారు పరిశీలించారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో జైలులో చేపడుతున్న కార్యక్రమాలను సూపరింటెండెంట్ జి.రామచంద్రం వారికి వివరించారు. డిప్యూటీ సూపరింటెండెంట్‌లు డి.కాళిదాస్, వి.శశికాంత్, జి.రత్నం, ఇతర అధికార సిబ్బంది వారి వెంట ఉన్నారు.

కొత్త స్టేడియాల నిర్మాణాలకు బీసీసీఐ అండ

● హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు



బీసీసీఐ కార్యదర్శి దేవజిత్‌తో జగన్‌మోహన్ రావు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి సహకరించాలని బీసీసీఐ నూతన కార్యదర్శి దేవజిత్ సైకియాను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు కోరారు. శనివారం ముంబైలోని బీసీసీఐ కార్యాలయంలో దేవజిత్, సీఈఓ హేమంగ్ అమీన్‌తో జగన్‌మోహన్‌రావు, హెచ్‌సీఏ కోశాధికారి సీజే శ్రీనివాస్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మించనున్న స్టేడియాలకు బోర్డు నుంచి నిధులు అందించాలని కోరారు. హెచ్‌సీఏ ప్రారంభించే అభివృద్ధి పనులకయ్యే వ్యయంలో బీసీసీఐ 50శాతం భరిస్తుందని దేవజిత్ భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో క్రికెట్‌కున్న ఆదరణ దృష్ట్యా వచ్చే ఐపీఎల్‌లో హైదరాబాద్‌కు ఎక్కువ మ్యాచ్‌లు కేటాయించాలని కోరగా, ఈసారి లీగ్‌తోపాటు నాకౌట్ మ్యాచ్‌లు నిర్వహించే అవకాశమిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి బీసీసీఐ కట్టుబడి ఉందని, బోర్డు ముందు పెట్టిన ప్రతిపాదనలు త్వరలో కార్యరూపం దాల్చనున్నాయని జగన్‌మోహన్ రావు చెప్పారు.

ఫిబ్రవరి 28 వరకు ఆరు రైళ్లు రద్దు

హైదరాబాద్,జనవరి18(ఆంధ్రజ్యోతి): నిర్వహణ కారణాలతో జనవరి 20 నుంచి ఫిబ్రవరి 28 వరకు వేర్వేరు కేంద్రాల నుంచి నడిచే ఆరు రైళ్లను రద్దు చేసినట్టు దక్షిణమధ్య రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కాజీపేట-డోర్నకల్(67765), డోర్నకల్-కాజీపేట (67766), డోర్నకల్-విజయవాడ(67767) విజయవాడ-డోర్నకల్ (67768), విజయవాడ-గుంటూరు(67769), గుంటూరు-విజయవాడ(67770) మధ్య నడిచే 'ఎంఈఎంయూ' రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు తెలియజేశారు.

సైన్‌బోర్డు తొలగిస్తుండగా విద్యుదాఘాతం..

● ఇద్దరి మృతి

నాచారం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఈ ఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హబ్సిగూడ సైంటిస్టు కాలనీలోని మోతీ అర్కేట్ అపార్ట్‌మెంట్‌లో జె.బాలు(36) వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. రామంతాపూర్‌కు చెందిన అతడి సమీప బంధువు జి.మల్లేష్ (25)తో కలిసి శనివారం సమీపంలోని ఓ భవనంలో చిట్‌ఫండ్ కంపెనీ సైన్‌బోర్డును తొలగిస్తుండగా పక్కన ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలు తాకాయి. కరెంట్ షాక్ తగిలి ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



గన్ పార్కు వద్ద చైతన్య యాత్రకు ప్రారంభిస్తున్న నాయకులు

స్థానిక ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలి

● జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

మంగళ్‌హాట్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న ముదిరాజ్‌ల చైతన్యమే లక్ష్యంగా ముదిరాజు ప్రజా చైతన్య యాత్రకు శ్రీకారం చుట్టామని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి తెలిపారు. శనివారం గన్‌పార్కు వద్ద నెల్లి లక్ష్మీనారాయణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి బస్సు యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ, శివ ముదిరాజ్ ఆధ్వర్యంలో మొదటి విడతగా ఐదు జిల్లాలలో ఈ బస్సు యాత్ర చేపడుతున్నామన్నారు. జనాభా దామాషా ప్రకారం స్థానిక ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో బ్రహ్మా ముదిరాజ్, ఉప్పరి నారాయణ, చిన్నరాములు, కూర వెంకటయ్య, కోట్ల పుష్పల, కోట్ల పుష్పలత, ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులు, మేధావులు, కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.



సైకిల్ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న
బత్తుల సిద్దేశ్వర్, వేణుకుమార్, రఘురామ్ తదితరులు

బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలి

● లేకపోతే నిరాహారద దీక్ష : బీసీ సంఘాల హెచ్చరిక

బర్కత్‌పుర, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని పలు బీసీ సంఘాల నేతలు హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల గణన సర్వే ఫలితాలను వెంటనే వెల్లడించాలని, రిజర్వేషన్ల శాతం పెంచిన తర్వాతే పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ హిందూ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్, ఓబీసీ జేఏసీ చైర్మన్ డాక్టర్ వేణుకుమార్, బీసీ కులాల సమన్వయ వేదిక అధ్యక్షుడు బి.రఘురామ్‌నేత, ఓబీసీ పొలిటికల్ జేఏసీ కన్వీనర్ ఎస్‌పీఎన్ చారి, బీసీ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు కోట్ల వాసుదేవ్ మాట్లాడారు. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను తగ్గించడం వల్ల తీవ్ర అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఈ నెల 19 నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలో సైకిల్ యాత్ర నిర్వహిస్తామన్నారు. సైకిల్‌యాత్ర కిసాల్‌పూర్ నుంచి ప్రారంభమై వరంగల్‌లో ఫిబ్రవరి 2న ముగుస్తుందన్నారు. ఈ సైకిల్ యాత్ర ముగించేలోపే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీని నెలకొల్పాలని లేనిపక్షంలో ధర్నాలు, దీక్షలు, పాదయాత్రలు నిర్వహించి బీసీలను జాగృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నరహరి, మహేష్‌గౌడ్, కె.వి జయ్‌కుమార్, ఏ.అరుణ, పెండ్యాల సంపత్, పర్వతసతీష్ పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గోషామహల్ నియోజకవర్గానికి చెందిన ఇద్దరు లబ్దిదారులకు శనివారం ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బద్దం సతీష్‌గౌడ్, ధన్‌రాజ్, అశోక్, అశోక్ జైన్, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

- అఫ్జల్‌గంజ్, (ఆంధ్రజ్యోతి)



మహిళా మత్స్యకార సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మెట్టు సాయికుమార్

పోస్టర్ ఆవిష్కరణ

అఫ్జల్‌గంజ్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఫిబ్రవరి 8న జరగబోయే మహిళా మత్స్యకార జాతీయ సదస్సు పోస్టర్‌ను శనివారం తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా మత్స్యకారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు

మంగళ్‌హాట్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి స్టేషన్ రోడ్‌లోని ఫుట్‌పాత్ ఆక్రమణపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి శనివారం ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకొని దుకాణాలు ఏర్పాటు చేసిన 15 మందిపై కేసులు నమోదు చేశారు. ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను తొలగించారు. నిత్యం రద్దీగా ఉండే నాంపల్లి స్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో ప్రజలు నడిచేందుకు ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు కబ్జాకు గురికావడంతో పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై నడవడం వల్ల వాహనాలు ఢీకొని ప్రమాదాల బారినపడుతున్నారు. కబ్జాలకు పాదచారులు ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని అందులో భాగంగానే సెంపల్ డ్రైవ్ నిర్వహించి పలువురిపై కేసులు నమోదు చేయడం జరిగిందని అధికారులు తెలిపారు.



లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారి ఆలయ క్యాలెండర్‌ను
అందచేస్తున్న మాజీ చైర్మన్ వెంకటేష్

అమ్మవారి క్యాలెండర్ అందజేత

చాంద్రాయణగుట్ట జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్‌లను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయం మాజీ చైర్మన్ కె.వెంకటేష్ శనివారం మర్యాదపూర్వకంగా కలి శారు. వారికి అమ్మవారి శేషవస్త్రాలతో లాల్ దర్వాజా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కీర్తి రాజ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదం

● శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ దండ రాజిరెడ్డి



బెలూన్లను ఎగురవేసి అంతర్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీలను ప్రారంభిస్తున్న వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి



కోలాటం ఆడుతున్న విద్యార్థులు

రాజేంద్రనగర్, జనవరి18(ఆంధ్రజ్యోతి) : సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయని, విద్యార్థులు దైనందిన జీవితంలో క్రీడలను భాగం చేసుకోవాలని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. రాజేంద్రనగర్‌లోని ఉద్యాన కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న 4వ అంతర్ కళాశాలల క్రీడలు, ఆటలు, సాంస్కృతిక, వైజ్ఞానిక సమ్మేళనం శనివారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా అతిథిగా హాజరైన ఆయన బెలూన్లను ఎగురవేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం డాక్టర్ దండ రాజిరెడ్డి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, ఉద్యాన విశ్వవిద్యాలయంలో చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాతినిధ్యం ఇస్తున్నామన్నారు. ఇందుకు విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలన్నీ కళాశాలలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్రీడల వల్ల జీవితంలో ఆటుపోట్లను ఎదుర్కొనే శక్తి, సామర్థ్యం పెంపొందుతాయని, చదువులో కూడా రాణిస్తారని అన్నారు. ఆటల పోటీల తో పోటీ తత్వం పెరుగుతుందన్నారు. ఈర్ష్యా ద్వేషాలకు అతీతంగా స్పోర్ట్స్‌మెన్ షిప్ ఎజెండాగా క్రీడా పోటీలు జరగాలని ఆయన సూచించారు. తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీకలైన బతుకమ్మ, కోలాటాలు. ప్రేరిణి శివతాండవం, నృత్యాలు అంశాలలో విద్యార్థులు ప్రావీణ్యం కలిగి ఉండాలన్నారు. రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రశాంత్ మాట్లాడుతూ, ఐదు ఉద్యాన కళాశాలల నుంచి 20 క్రీడాంశాలు, 18 సాంస్కృతిక పోటీలలో 251 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.భగవాన్, డీన్ డాక్టర్ ఎం.రాజశేఖర్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ లక్ష్మీనారాయణ, మల్యాల, మొజెర్ల, ఉద్యాన కళాశాలల అసోసియేట్ డీన్‌లు డాక్టర్ జె. చీనా నాయక్, డాక్టర్ పిడిగెం సైదయ్య, జోనల్ హెడ్ డాక్టర్ సురేశ్ రెడ్డి, ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రహదారి భద్రత మన బాధ్యత: జేటీసీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేశ్

చార్మినార్ జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత మనందరి బాధ్యత అని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (జేటీసీ) పి.రమేశ్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని శనివారం బండ్లగూడలోని దక్షిణ మండల ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జేటీసీ మాట్లాడుతూ.. పాతబస్తీలో రెండు ప్రధాన రహదారులైన కర్నూల్ జాతీయ రహదారి, శ్రీశైలం అంతర్రాష్ట్ర రహదారి పై నిత్యం వేలాది వాహనాలు అధిక లోడ్‌తో వెళ్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతు న్నాయన్నారు. నగరంలో ఏటా పెరుగుతున్న రహదారి ప్రమాదాలను అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు రవాణశాఖ రోడ్డు భద్రతా ఉత్సవాలను జనవరిలో నిర్వహిస్తున్న దన్నారు. అనంతరం అడ్మినిస్ట్రేటి వ్ అధికారి హరిప్రసాద్ మాట్లాడుతూ.. డ్రైవింగ్ అనేది వ్యక్తిగత అనుభవంగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు వాహనాలు కండీషన్‌లో ఉండకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, అవగాహన లోపంతో రోడ్డు ప్రమా దాలు ఎక్కువ జరుగుతున్నారు. వాహదారులు డ్రైవింగ్ చేసేప్పుడు తగిన జాగ్రతలు తీసుకోవాలన్నారు. కార్యమంలో ఏఓలు హరి ప్రసాద్, సునీత, ఎంవీఐలు రవీందర్ రాజ్,ఘంటా రవీందర్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జె.సురేశ్ పాల్గొన్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న
ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మోహన్ రావు

ఉల్లంఘనులపై ఉక్కుపాదం మోపుతాం

● ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు

చాంద్రాయణగుట్ట జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై ఉక్కుపాదం మోపుతామని ఫలక్‌నుమా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మోహన్ రావు హెచ్చరించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్, ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఫలక్‌నుమా ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో శాలిబండలో పోలీసులు ప్లకార్డులు పట్టుకొని రోడ్డు భద్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, వాహనదారులు, ఆటో డ్రైవర్ ఇష్టానుసారంగా వాహనాలను నడపడానికి వీలు లేదన్నారు ఫ్రీ లెఫ్ట్ తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం తాగి, ఫోన్లు మాట్లాడుతూ వాహనాలను నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నటసార్వభౌముడికి ఘన నివాళి



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న
టీడీపీ హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ నాగు నగేష్ తదితరులు



గౌలిపురాలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు బీవై శ్రీకాంత్, నాయకులు తయ్యబా తస్లీమ్, శంకర్ ముదిరాజ్, షఫీక్, సల్ల రాజ్ కుమార్,దుర్గేష్ కుమార్ ముదిరాజ్ తదితరులు. (చాంద్రాయణగుట్ట - ఆంధ్రజ్యోతి)

చార్మినార్ జనవరి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు, నటసార్వభౌమ, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారరామారావు 29వ వర్ధంతిని శనివారం చాంద్రాయణగుట్ట, చార్మినార్, యాకుత్‌పురా, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో టీడీపీ నాయకులు నిర్వహించారు. నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ నాగు నగేష్ ముఖ్య అతిథిగా పాల్గొని తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షఫీక్ షర్వాన్, సమీఉద్దీన్ రఫీ, ఎన్టీఆర్ అభిమాన సంఘం నగర కార్యదర్శి బర్ల శ్రావణ్ కుమార్, సాయి వరుణ్ ఎండీ షఫీ, సత్య కృష్ణ, యాది లాల్, జోగిందర్ సింగ్ , గురుప్రసాద్, వేణు, రాము తదితరులు పాల్గొన్నారు,



పాతబస్తీ బేలాలోని సూరజ్ భాన్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో మహిళలకు పండ్లు పంపిణీ చేస్తున్న ఆయన అభిమాని పెద్దోజు రవీంద్ర చారి తదితరులు
-(చాంద్రాయణగుట్ట -ఆంధ్రజ్యోతి)

హైదర్‌గూడ చౌరస్తాలో..

రాజేంద్రనగర్, జనవరి18(ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ప్రజల గుండెల్లో నేటికి పదిలంగా ఉన్న మహానుభావుడని తెలంగాణ తెలుగుదేశం రాష్ట్ర అధికార ప్రతినిధి మ్యాడం రామేశ్వర్‌రావు అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్‌గూడ చౌరస్తాలో శనివారం ఎన్‌టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. తెలంగాణ తెలుగుదేశం రాష్ట్ర అధికార ప్రతినిధి మ్యాడం రామేశ్వర్‌రావు ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఎ.కృష్ణారెడ్డి, సోమారం రాజ్‌కుమార్, ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.జయవంత్‌రావు, ఎ.బాల్‌రాజ్, కె.కొండల్‌రెడ్డి, ఆర్.బాలప్ప, అంజనేయులు గౌడ్, కె.సోమేశ్‌గౌడ్, రాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.



హైదర్‌గూడలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న
మ్యాడం రామేశ్వర్‌రావు, తదితరులు

వృత్తి నిబద్ధతతో పనిచేయాలి



టీఎన్జీఓస్ డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, టీఎన్జీఓస్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు,
హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కృష్ణయాదవ్ తదితరులు

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు వృత్తి నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో శనివారం టీజీఓ జిల్లా ఉద్యోగుల సంఘం-2025 డైరీని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఉద్యోగులు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. రాష్ట్రంలో 42 వేల మంది గెజిటెడ్ అధికారులున్నారని, వారు ఉద్యోగులకు దిక్సూచిగా నిలవాలన్నారు.

కార్యక్రమంలో టీజీఓఎస్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణయా దవ్, సెంట్రల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్య నారాయణ, నాయకులు శ్యాం, జగన్‌మోహన్‌రావు, పరమేశ్వర్‌రెడ్డి, సుజాత, ఖాదర్, ఆశన్న, సురేందర్, కోటాజీ, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ మార్కెటింగ్ కోర్సులతో మెరుగైన ఉపాధి అవకాశాలు

● కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మహ్మద్ ఫిరోజ్‌ఖాన్

బర్కత్‌పుర, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ మార్కెటింగ్ కోర్సులతో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మహ్మద్ ఫిరోజ్‌ఖాన్ పేర్కొన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ది యెల్లో పిల్లో సంస్థ రూపొందించిన భారత్ డిజిటల్ చాంప్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు, యువత డిజిటల్ మార్కెటింగ్‌లో నైపుణ్యత సాధించి మంచి ఉద్యోగాలు పొంది ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. వివిధ ఉపాధి కోర్సులలో శిక్షణ పొందే యువతకు తనవంతు ఆర్థిక సహాయం అందిస్తానన్నారు. ది యెల్లో పిల్లో సంస్థ నిర్వహిస్తున్న ఉపాధి కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ అభిజిత్ కపాడియా, ఎం.కె.గౌరీ, మహ్మద్ వలీ అబిద్ వికాస్, మారన్ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/yOMJahVలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.



లక్ష్మీగూడ రాజీవ్ గృహకల్పలో రేషన్ కార్డుల
దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

రాజేంద్రనగర్ సర్కిల్‌లో రేషన్ కార్డుల పరిశీలన

రాజేంద్రనగర్, జనవరి18 (ఆంధ్రజ్యోతి) : రాజేంద్ర నగర్ సర్కిల్ పరిధిలో 25 మంది అధికారులు రేషన్ కార్డుల దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. సర్కిల్ పరిధిలో రేషన్ కార్డుల కోసం 7112 దరఖాస్తులు రాగా, ఇప్పటి వరకు 3955 దరఖాస్తులను అధికారుల బృందం పరిశీలించింది. రాజేంద్ర నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతోంది. ఈ నెల 21లోగా రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాల్సి ఉందని ఆయన తెలిపారు. శనివారం లక్ష్మీగూడ లో జరిగిన రేషన్ కార్డుల పరిశీలనలో మహిళా నాయకురాలు ఎ.శరణమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న
మార్కెట్ డైరెక్టర్ ముంగి రఘుపాల్‌రెడ్డి

కష్టపడే వారికి పార్టీలో సముచిత స్థానం

కార్వాన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను గుర్తించి సముచిత స్థానం కల్పించడమే కాంగ్రెస్ పార్టీ విధానమని గుడిమల్కాపూర్ మార్కెట్ డైరెక్టర్ ముంగి రఘు భూపాల్‌రెడ్డి అన్నారు. గుడిమల్కాపూర్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తున్నానన్నారు. ఈ నేపథ్యంలోనే తనకు నేడు మార్కెట్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం వచ్చిందన్నారు. తనపై నమ్మకం ఉంచి డైరెక్టర్‌గా అవకాశం ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కూరాకుల కృష్ణ, కిషన్, అబ్దుల్ అహ్మద్, షేక్ షకీలా, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు క్యాన్సర్ అవగాహన శిబిరం

రాజేంద్రనగర్, జనవరి18(ఆంధ్రజ్యోతి) : రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవుపల్లి డివిజన్ పద్మశాలీపురంలోని మార్కండేయ భవన్‌లో ఈ నెల 19న ఉదయం 10 గంటలకు క్యాన్సర్ పై అవగాహన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పద్మశాలీ సంఘం నాయకులు తెలిపారు. సర్జికల్ అంకాలజీ విభాగానికి చెందిన డాక్టర్ మధు దేవరశెట్టి బృందంలోని డాక్టర్లు ఈ అవగాహన శిబిరంలో పాల్గొని ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ హాజరవుతున్నారన్నారు. పద్మశాలీపురం, కాటేదాన్ పరిసర ప్రాంతాల ప్రజలు క్యాన్సర్ అవగాహన శిబిరానికి హాజరై సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అన్ని రంగాలపై అవగాహన పెంపొందించుకోవాలి

● నిజాం కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్



ఆయిస్టర్ సంస్థ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న
నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ఏవీ రాజశేఖర్

బర్కత్‌పుర, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు అన్ని రంగాలపై పూర్తి అవగాహన పెంపొందిం చుకోవాలని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ఏవీ రాజశేఖర్ కోరారు. శనివారం ఆయిస్టర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువ ఎంపవర్ 2కె 25 వాల్‌పోస్టర్‌ను ప్రిన్సిపాల్ ఆవిష్కరించి మాట్లాడారు. ఉన్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిస్టర్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ సింగాడే మాట్లాడుతూ, స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిజాం కళాశాల అకాడమి కో-ఆర్డినేటర్ డాక్టర్ రాధిక, ఆయిస్టర్ సంస్థ ప్రతినిధులు అరవింద్, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

గడువు ముగిసిన కూల్‌డ్రింక్స్ విక్రయం: నిందితుడి అరెస్ట్

పహాడిషరీఫ్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అధిక సంపాదన కోసం తాగేందుకు అనువుగాని, ఎక్స్‌పైరీ అయిన (గడువు ముగిసిన) కూల్‌డ్రింక్స్‌ను విక్రయిస్తున్న వ్యక్తిని మహేశ్వరం ఎస్‌ఓటీ, పహాడిషరీఫ్ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. ఒడిషాకు చెందిన పరేష్ సేత్ (46), కొంతకాలం క్రితం నగరానికి వచ్చాడు. బతుకుదెరువు కోసం తుల్జాభవానీ వైన్స్ సమీపంలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. అధిక సంపాదన కోసం కాటేదాన్ ప్రాంతానికి చెందిన మహాదేవ్ పటేల్ అనే వ్యాపారి నుంచి గడువు ముగిసిన కూల్ డ్రింక్స్ సేకరించి విక్రయిస్తున్నాడు. సాధారణంగా గడువు ముగిసిన కూల్ డ్రింక్స్ తాగేందుకు పనికిరావు. ఇలాంటి కూల్‌డ్రింక్స్‌ను విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పరేష్‌ను మహేశ్వరం ఎస్ఓటీ, పహాడిషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి గడువుముగిసిన థమ్స్ అప్, స్ప్రైట్, కిన్లీ, కింగ్‌ఫిషర్ సోడా, మాజా బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

మూసేస్తారా.. భర్తీ చేస్తారా..

ఉపాధ్యాయులు లేక దీనస్థితిలో ఉర్దూ మీడియం పాఠశాలలు

- రిజర్వేషన్ కారణంగా భర్తీకాని ఖాళీలు
- తీవ్రంగా నష్టపోతున్న విద్యార్థులు
- పోస్టులను భర్తీ చేయకుంటే స్కూళ్లు మూతపడే ప్రమాదం



హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉర్దూ మీడియం బోధనలు అధ్వాన్నంగా మారాయి. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా ఉపాధ్యాయులు లేకపోవడంతో తరగతుల నిర్వహణ రోజురోజుకు ఇబ్బందికరంగా మారుతోంది. రిజర్వేషన్ కారణంగా డీఎస్సీలో పలు పోస్టులు భర్తీ కాకపోతుండటంతో ఉన్న టీచర్లపైనే అదనపు భారం పడుతోంది. ఫలితంగా పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం తగ్గుతోంది. జిల్లాలోని 16 మండలాల్లో 691 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. ఇందులో 45 ప్రత్యేక, మిక్స్‌డ్ ఉర్దూ మీడియం స్కూళ్లు ఉండగా.. 9,450 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే ఆయా స్కూళ్లలో తగినంత మంది ఉపాధ్యాయులు లేకపోవడంతో మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన పిల్లలు చదువుకు దూరమవుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గుతుండడంతో పలుచోట్ల పాఠశాలలు మూతపడుతున్నాయి.

రిజర్వేషన్ కారణంగా 194 పోస్టులు ఖాళీ..

డీఎస్సీ-2024 నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలో 310 ఉర్దూ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్, ఎస్‌జీటీ, పీఈటీ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల దరఖాస్తు చేసుకున్నారు. అయితే 310 పోస్టులకు గాను కేవలం 116 పోస్టులను భర్తీ చేయగా.. 194 పోస్టులను ఖాళీగానే ఉంచారు. ఆయా కేటగిరీల్లో ప్రకటించిన పోస్టులకు రిజర్వేషన్ కలిగిన అభ్యర్థులు లేకపోవడంతో అధికారులు వాటిని భర్తీ చేయలేదు. దీంతో ఉర్దూ మీడియంలో డీఈడీ, బీఈడీ, లాంగ్వేజ్ పండిట్ కోర్సులను పూర్తిచేసిన మైనార్టీ అభ్యర్థులు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. రిజర్వేషన్ పేరిట పెద్ద సంఖ్యలో పోస్టులను బ్యాక్‌లాగ్‌లో చేర్చడంతో తీవ్రవేదనకు లోనయ్యారు. వాస్తవంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో రిజర్వేషన్ ప్రకారమే పోస్టులను కేటాయిస్తుంటారు. ఉర్దూ మీడియంలోనూ బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులకు రిజర్వేషన్ ఆధారంగా పోస్టులు కేటాయిస్తున్నప్పటికీ ఆయా వర్గాల్లో అర్హులైన అభ్యర్థులు ఉండటం లేదు. మైనార్టీతో పాటు జనరల్ కేటగిరీలో అర్హులైన అభ్యర్థులున్నప్పటికీ రిజర్వేషన్ కారణంగా వారికి అవకాశం ఇవ్వకపోవడం లేదు. దీంతో ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేయలేకపోతున్నారు.

పోస్టులను డీ-రిజర్వ్ చేయాలి..

డీఎస్సీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో సమాన ప్రాతినిధ్యం కల్పించాలని ఎన్నో ఏళ్లుగా అభ్యర్థులు కోరుతున్నప్పటికీ ఉర్దూ మీడియంలో వర్తించని పరిస్థితి నెలకొంది. దీంతో నోటిఫికేషన్‌లో వందల సంఖ్యలో పోస్టులను ప్రకటిస్తున్నప్పటికీ భర్తీ విషయానికి వచ్చేసరికి పదుల సంఖ్యలోనే అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరుతున్నారు. డీఎస్సీ-2024 ఉర్దూ మీడియం పోస్టుల్లో భర్తీకాని వాటిని డీ-రిజర్వ్ చేసి ఇతర రిజర్వేషన్లలో మెరిట్ మార్కులు సాధించిన వారికి ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు. ప్రభుత్వం రెండో జాబితాను ప్రకటించి అర్హులకు న్యాయం చేయాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

> **ప్రత్యేక ఉర్దూ డీఎస్సీని ప్రకటించాలి**
>
> మైనార్టీ డిక్లరేషన్‌లో భాగంగా తాము అధికారంలోకి వస్తే స్పెషల్ ఉర్దూ డీఎస్సీ ప్రకటిస్తామని అప్పట్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఆ హామీని అమలు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలి. రిజర్వేషన్ కలిగిన అభ్యర్థులు లేరనే కారణంగా వందలాది పోస్టులను బ్యాక్‌లాగ్‌లో చేర్చడం సరికాదు.
>
> - జావిద్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు

వాస్కోడిగామా రైలులో గోవా మద్యం పట్టివేత

హైదరాబాద్ సిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): గోవా నుంచి హైదరాబాద్‌కు వాస్కోడిగామా రైలులో అక్రమంగా రవాణా చేస్తున్న మద్యాన్ని హైదరాబాద్ ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. రూ. 2.50లక్షల విలువైన 84 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. గోవా నుంచి హైదరాబాద్‌కు వచ్చే వాస్కోడిగామా రైలులో అక్రమంగా మద్యం రవాణా అవుతున్నట్లు ఎక్సైజ్ అధికారులకు శనివారం విశ్వసనీయ సమాచారం అందింది. దాంతో నాంపల్లి ప్రత్యేక టీమ్‌లుగా ఏర్పడిన ఎస్‌టీఎఫ్ పోలీసులు రైల్లో తనిఖీలు నిర్వహించగా 84 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. అయితే పోలీసుల తనిఖీల నేపథ్యంలో నిందితులంతా జారుకున్నట్లు తెలిసింది. దాంతో పోలీసులు మద్యాన్ని మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌టీఎఫ్ టీమ్ ఆధికారిక ఎస్సీ భాస్కర్, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, బిక్షారెడ్డి, ఎస్ఐ బాలరాజు, ఇతర సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు.

నకిలీ పత్రాలతో ప్లాట్ల అమ్మకం

- ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు





కాళిముత్తు, లావణ్య

దుండిగల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలను సృష్టించి భూమిని విక్రయించిన ఇద్దరు వ్యక్తులను వేర్వేరు సంఘటనల్లో దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు సమావేశంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ వెంకట్‌రెడ్డి నిందితుల వివరాలను వెల్లడించారు. 2022లో అల్వాల్ విజయరామరాజు అనే వ్యక్తి మల్లంపేట్‌లో కేజిఆర్ వెంచర్ వేశారు. అయితే నకిలీ పత్రాలు, ఆధార్ కార్డును సృష్టించిన శివ, నరేష్ అనే వ్యక్తులు సంగారెడ్డి జిల్లా, జిన్నారం మండలం, బొల్లారం గ్రామంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన సంతుల కాళిముత్తు (33)ను విజయరామరాజుగా చెబుతూ దే-అక్టోబర్‌లో ప్లాట్‌ను శ్రీకాంత్‌ సాహుకు విక్రయించారు. దీనిపై గత ఏడాది సెప్టెంబర్‌లో విజయరామరాజు దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు శనివారం కాళిముత్తును అరెస్ట్ చేశారు. ఆదే వెంచర్‌లో ప్లాట్ యజమాని స్వాతి అమెరికాలో ఉంటుండగా.. కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన నరేష్, శ్రావణి మల్కాజిగిరికి చెందిన లావణ్య(35)ను స్వాతిగా చూపిస్తూ రవికుమార్ అనే వ్యక్తికి ప్లాట్‌ను విక్రయించారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు విచారణ చేపట్టి లావణ్యను శనివారం అరెస్ట్ చేశారు.

రూ.5 లక్షలివ్వండి.. రూ.10 లక్షలిస్తా

- నకిలీ కరెన్సీతో విదేశీయుడి మోసాలు
- అరెస్ట్ చేసిన పోలీసులు



దేవలూయిస్

హయత్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నకిలీ కరెన్సీతో మోసాలకు పాల్పడుతున్న విదేశీయుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. జీన్ పేరుతో ఉన్న కామెరూన్ దేశం పాస్‌పోర్టు, ఒక సెల్ ఫోన్, నాలుగు 500 రూపాయల నోట్లను స్వాధీనం చేసుకున్నారు. హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్ తెలిపిన వివరాల మేరకు.. కామెరూన్ దేశానికి చెందిన జాక్సన్ దేవలూయిస్ కిట్ (42) రెండు నెలల టూరిస్టు వీసాపై 2017లో ఇండియాకు వచ్చాడు. వీసా ముగిసినప్పటికీ బెంగళూరులోని శాంతినగర్ హోర్మావులో ఉంటున్నాడు. అప్పటి నుంచి దేవలూయిస్ కిట్ నకిలీ కరెన్సీ పేరుతో పలువురిని మోసం చేస్తున్నాడు. ఈ క్రమంలో 2020లో కర్ణాటక పోలీసులు నకిలీ కరెన్సీ వ్యవహారంలో దేవలూయిస్‌ను అరెస్టు చేశారు. అయితే జైలుపై బయటకు వచ్చిన అతడు తన స్నేహితుడు లాంధ్రీ తో కలిసి అదే పనిని తిరిగి చేయడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో హయత్‌నగర్‌కు చెందిన రమాల్ వాలి వలలో పడ్డాడు. రూ.5 లక్షల ఒరిజినల్ నోట్లు ఇస్తే రూ.10 లక్షల నకిలీ కరెన్సీ ఇస్తానని దేవలూయిస్ కిట్ రమాల్‌కు చెప్పాడు. దీంతో రమాల్ హయత్‌నగర్ రావాలని చెప్పడంతో దేవలూయిస్, అతడి స్నేహితుడు లాంధ్రి శనివారం బాగ్యలత అయిబోయినగర్ కాలనీలోని ఒక లాడ్జికి వచ్చారు. వారి వ్యవహారంపై అనుమానం వచ్చిన రమాల్ విషయాన్ని పోలీసులకు చెప్పాడు. దీంతో లాడ్జి వద్దకు చేరుకున్న పోలీసులు దేవలూయిస్ కిట్‌ను అదుపులోకి తీసుకోగా, లాంధ్రి పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐఎంఎస్ సభ్యుడిగా ప్రద్యుమ్నకుమార్ సాహూ



ప్రద్యుమ్నకుమార్

బిట్స్‌పిలానీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మ్యాథమెటికల్ సొసైటీ (ఐఎంఎస్) సభ్యుడిగా బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్ గణితశాస్త్ర విభాగానికి చెందిన ప్రొఫెసర్ ప్రద్యుమ్నకుమార్ సాహూ ఎన్నికయ్యారని సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆచార్య ఎంఎం పిఠార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2028 మార్చి 31 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారన్నారు. కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మ్యాథమేటికల్ సొసైటీ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడంలో సాహూ కీలక పాత్ర పోషించాలని పిఠార్ ఆకాంక్షించారు.

చెరువును కబ్జా చేస్తే ఏం చేస్తున్నారు?

(5వ పేజీ తరువాయి)

నమోదు చేస్తామని హెచ్చరించారు. తమలాగే ఎంతోమంది కబ్జాలు చేశారని, వారి అక్రమ కట్టడాలనూ కూల్చండని ఇందిరాగౌడ్ కోరడంతో రంగనాథ్ స్పందించారు. తప్పు నుంచి తప్పుకోవడానికి అందరిపైనా నిందలేసి వేయొద్దని, ఆక్రమణదారులు ఎవరైనా వదలబోం అని అన్నారు. ఇందిరాగౌడ్‌తో బుధవారం నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని సూచించారు. చర్లలు విశేషమైనదని జనాన్ని ఉసిగొల్పి కబ్జాదారులు లబ్ధిపొందుతున్నారని, ప్రజలు సహకరిస్తేనే ఆక్రమణలను అడ్డుకోగలమని రంగనాథ్ వ్యాఖ్యానించారు.

విశ్వ విఖ్యాతకు ఘన నివాళి

- ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు ● నివాళులర్పించిన కుటుంబ సభ్యులు, ప్రముఖులు



ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో 'తారకరామం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితల సంఘం అధ్యక్షులు పరుచూరి గోపాలకృష్ణ తదితరులు

బంజారాహిల్స్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుడు నందమూరి తారకరామారావు అని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా శనివారం ఫిలింనగర్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్టీఆర్‌ను ఆదర్శంగా తీసుకుని తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఎన్టీఆర్ కుమారుడు నందమూరి మోహనకృష్ణ మాట్లాడుతూ.. తెలుగు జాతికి ప్రపంచ వ్యాప్తంగా ఆ పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంపై కేంద్రం దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెల్లంద వెంకటేష్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మాగంటితో కలిసి మోహనకృష్ణ ప్రారంభించారు.

రసూల్‌పురలో అమరజ్యోతి ర్యాలీ

బేగంపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకే పేరు మార్చి నేటి పాలకులు అమలు చేస్తున్నారని సినీ హీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా బేగంపేట రసూల్‌పురలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద శ్రీపతి సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమరజ్యోతి ర్యాలీని ఎన్టీఆర్ కుమారులు బాలకృష్ణ, రామకృష్ణ శనివారం ప్రారంభించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.

ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకొచ్చిన గొప్ప నాయకుడు ఎన్టీఆర్ అని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ చైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో శనివారం ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు ఆయన నివాళులర్పించారు. బాలకృష్ణ మాట్లాడుతూ.. తనను అభిమానించే తెలుగు ప్రజలకు ఏదో ఒకటి చేయాలని నిత్యం పరితపించేవారన్నారు. సినిమా రంగంలో రాణిస్తూనే పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టారన్నారు. రాష్ట్ర ఎన్నో సంస్థలు, ఎన్నో సంక్షేమాలను పరిష్కరించి ప్రజల గుండెల్లో శాశ్వత స్థానాన్ని పొందారన్నారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో..

సిరిపురం(విశాఖపట్నం), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు చలనచిత్ర రంగానికి ఎన్టీఆర్, ఏఎన్నార్ రెండు కళ్లు అని త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి అన్నారు. లోక్ నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 29వ వర్ధంతి, ఏఎన్నార్ శతజయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. పౌరాణిక పాత్రల్లో ఎన్టీఆర్‌ను మించిన నటుడు లేరని, ప్రజలు ఆయన్ను దైవంలా కొలిచేవారని గుర్తుచేసుకున్నారు. రూ.2కిలో బియ్యం, ఆస్తిలో మహిళలకు సమాన హక్కును కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనని కొనియాడారు. సినీ నటుడు బ్రహ్మానందం, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు.



రసూల్‌పురలో ఎన్టీఆర్ అమరజ్యోతి ర్యాలీని ప్రారంభిస్తున్న నందమూరి బాలకృష్ణ, రామకృష్ణ



ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న ఎన్టీఆర్ మనవరాలు నందమూరి మోహనరూప

హేళన చేస్తున్నాడని కడతేర్చారు

(5వ పేజీ తరువాయి)

తల్లి లుబీరామ్, అభిలాష్ భక్తి బంధాలయంలో కొట్టారు. రక్తపు మడుగులో ఉన్న బాబుసాహేబ్‌ను అక్కడే వదిలేసి పారిపోయారు. పుప్పాల్‌గూడలో వ్యక్తి చనిపోయి ఉన్నాడని పండగ మరుసటి రోజు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీ తరలించి కేసు దర్యాప్తు ప్రారంభించారు. లుబీరామ్‌ మహేందర్ (27), రాసిలాల్ పోరాన్ (28), అభిలాష్ భక్తి(33), ఉత్తమ్ హన్స్‌దా (22), కోనేలాండ్ సోరెన్ (26), సికిందర్ మరాండీ(24), సికిందర్ ముర్ము (18), సందీప్ ముర్ము(26), గులాబ్ ముర్ము (27)లను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నేరాన్ని అంగీకరించారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

మృత్యు'దారు'లు

(5వ పేజీ తరువాయి)

తేలింది. ఈ ప్రమాదాల్లో 617 మంది ప్రాణాలు కోల్పోయారు.

నిర్లక్ష్యంగా వాహనాలను నడుపుతూ..

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నలుమైపులా జాతీయ, రాష్ట్ర రహదారులు ఉన్నాయి. ఐటీ కంపెనీలు, విద్యా, కన్‌స్ట్రక్షన్ సంస్థలు, ఫార్మా తదితర పరిశ్రమలు, అంతర్జాతీయ విమానాశ్రయం ఉండటం, వాటన్నింటికీ ప్రధాన రహదారులకు అనుసంధానం చేయడంతో.. నిత్యం కమిషనరేట్ పరిధిలో లక్షలాది వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. కొంతమంది వాహనదారులు నిబంధనలు పాటించకుండా, నిర్లక్ష్యంగా వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ప్రమాదాలను తగ్గించడానికి, హిట్ అండ్ రన్ కేసులను ఛేదించడానికి ఆర్టీఏఎం సెల్ ప్రత్యేకంగా అధ్యయనం చేస్తోంది.

సికింద్రాబాద్‌లో 'రాణా' సందడి

గణపతి ఆలయంలో నూతన చిత్ర యూనిట్ పూజలు

రెజిమెంటల్‌బజార్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు దగ్గుబాటి రాణా శనివారం సికింద్రాబాద్‌లోని గణేష్ ఆలయానికి రావడంతో సందడి నెలకొంది. కొత్త సినిమా ప్రారంభం సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం క్లాప్ కొట్టి సినిమా చిత్రీకరణ ప్రారంభించారు. నటుడు ప్రియదర్శి, యాంకర్ సుమ తదితరులు హాజరయ్యారు.



గణపతి ఆలయం వద్ద రాణా, ప్రియదర్శి, సుమ తదితరులు

జేఎన్టీయూ విద్యా విధానాలు భేష్

హిమాచల్‌ప్రదేశ్ మంత్రి రాజేశ్ ధర్మాణి



మంత్రి రాజేశ్ ధర్మాణితో వర్సిటీ వీసీ బాలకిష్టారెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి

కూకట్‌పల్లి, జనవరి, 18 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ విద్యార్థులకు కాలానికి అనుగుణంగా టెక్నాలజీని ఉపయోగిస్తూ ఉన్నతమైన విద్యను అందిస్తున్నారని హిమాచల్‌ప్రదేశ్ గృహ నిర్మాణ, సాంకేతిక విద్య మంత్రి రాజేశ్ ధర్మాణి పేర్కొన్నారు. తెలంగాణలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల పర్యటనలో భాగంగా శనివారం ఆయన జేఎన్టీయూను సందర్శించారు. వర్సిటీ డైరెక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు మంత్రి బృందానికి స్వాగతం పలికి విద్యార్థులకు అందిస్తున్న సాంకేతిక విద్య గురించి వివరించారు. జేహబ్, ఇంక్యుబేషన్ సెంటర్ పరిశోధన, పరిశ్రమ విధానంలో మార్పులు, ఆటోమొబైల్ ప్రత్యేక ల్యాబ్ తయారీ, ఆదాయ నిక్ మూల్యాంకన విధానాలు, రికార్డుల డిజిటలైజేషన్ సహాయ అంశాలపై వీసీ బాలకిష్టారెడ్డితో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో అమలు చేస్తున్న విధానాలను మంత్రి అభినందించారు.

సమ్మర్ విద్యుత్ డిమాండ్ 110 ఎంయూలు..!

- దక్షిణ డిస్కం ఆపరేషన్ విభాగం అంచనా ● ఫిబ్రవరి నాటికి సమ్మర్ యాక్షన్‌ప్లాన్ పనులు పూర్తి



హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో సమ్మర్ యాక్షన్‌ప్లాన్ పనులు ఫిబ్రవరి మొదటి వారం నాటికి పూర్తిచేసే దిశగా దక్షిణ డిస్కం చర్యలు చేపట్టింది. 2025 వేసవిలో సమ్మర్ డిమాండ్ అత్యధికంగా 110 మిలియన్ యూనిట్ల(ఎంయూ)కు చేరుకుంటుందని డిస్కం ఆపరేషన్ విభాగం అంచనా వేస్తోంది. డిమాండ్ ఏ స్థాయిలో పెరిగినా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నది. విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతున్న ఉప్పల్, మేడ్చల్, పటాన్‌చెరు, సంగారెడ్డి, సరూర్‌నగర్, బాచుపల్లి తదితర ప్రాంతాల్లో కొత్త విద్యుత్‌లైన్లు వేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో డిమాండ్‌కు తగినట్లు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచడంతో పాటు, సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచే దిశగా పనులు చేస్తున్నారు. గ్రేటర్‌లో సాధారణంగా ప్రతిరోజు 65-70 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ నమోదవుతుండగా సమ్మర్‌లో 25-30% మేర అధికంగా నమోదవుతోంది. గతేడాది రికార్డు స్థాయిలో పెరిగిన సమ్మర్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ సమ్మర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా విద్యుత్ శాఖ చర్యలు తీసుకుంటోంది.

శివారు ప్రాంతాల్లో ఫీడర్ల విభజన.. కొత్తలైన్లు

సంగారెడ్డి, మేడ్చల్ సర్కిళ్ల పరిధిలో వేసవిలో డిమాండ్ భారీగా పెరిగే అవకాశాలుండడంతో ఆయా ప్రాంతాల్లో దక్షిణ డిస్కం ప్రత్యేక దృష్టిసారించింది. సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌లో చేపట్టిన పనులు పూర్తిచేసే బాధ్యత ఆయా సర్కిళ్ల ఎస్‌ఈలదేనని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. రంగారెడ్డి జోన్‌లో సమ్మర్ డిమాండ్‌కు అనుగుణంగా 81 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచడంతో పాటు 1,252 డిస్ట్రిబ్యూషన్ల కొత్తగా ఏర్పాటు చేస్తున్నారు. మేడ్చల్ జోరుపేటలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులోకి తీసుకువచ్చారు. హబ్సిగూడ సర్కిల్‌లో 90కి పైగా 11కేవీ ఫీడర్లను విభజించడంతో పాటు 14 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థాయి పెంచుతున్నారు. 545 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచడంతో పాటు కొత్త డీటీఆర్‌లు ఏర్పాటు చేస్తున్నారు. సైబర్ సిటీ సర్కిల్‌లో- 232, సరూర్‌నగర్‌లో - 309, రాజేంద్రనగర్‌లో- 171 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు.

సమ్మర్‌లో విద్యుత్ డిమాండ్

	2023	2024	2025
మెగావాట్లు	3,756	4,352	4,800
మిలియన్ యూనిట్లు	81.39	90.68	110

2025 సమ్మర్‌లో నమోదయ్యే డిమాండ్(ముందస్తు అంచనా)



పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి

రైలులో గంజాయి సరఫరా.. ఇద్దరు మహిళల అరెస్ట్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ నుంచి మహారాష్ట్ర వెళ్తున్న రైలులో మహిళలు సరఫరా చేస్తున్న 17.76 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు మహిళలను అరెస్టు చేయగా.. సూత్రధారి పరారీలో ఉన్నాడు. సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన ఇక్బాల్ బాను(20) ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కాంచన(21) స్నేహితులు. వారు బిలాస్‌పూర్‌లో ఒకే పాఠశాలలో చదువుకున్నారు. కాంచనకు రెండేళ్ల క్రితం మహారాష్ట్రకు చెందిన రాజా ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. ఈ క్రమంలో సులువుగా డబ్బు సంపాదించాలంటే మహారాష్ట్రకు గంజాయి తీసుకెళ్లాలని, ప్రతి ప్యాకెట్‌కు రూ.1000 ఇస్తానని రాజా చెప్పడంతో కాంచన అంగీకరించింది. రాజా సహకారంతో ఇక్బాల్, కాంచన కలిసి 8 ప్యాకెట్లలో రూ.4.44 లక్షల విలువ చేసే 17 కిలోల గంజాయితో విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. శనివారం రైల్వే ఎస్సీ చందానాదీప్తి, డీఎస్పీ వాజిద్ ఆదేశాల మేరకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న విశాఖ రైలులో రైల్వే ఎస్ఐ సాజిద్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. ఈ క్రమంలో గంజాయి, రెండు మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు వారిని అరెస్టు చేశారు. సూత్రధారి రాజా ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

దుకాణాల్లో అగ్నిప్రమాదం

- రూ.20 లక్షల మేర ఆస్తినష్టం

అఫ్జల్‌గంజ్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి స్టేషన్ రోడ్డులోని ఇస్కాన్ ఆలయం పక్కన ఉన్న దుకాణాల్లో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రూ.20 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లింది. సీఐ ఇమ్మాన్యుయేల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్కాన్ ఆలయం పక్కనే ఉన్న బెల్లులు, వస్త్ర దుకాణాల్లో శనివారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. గౌలిగూడ అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని పోలీసుల సహకారంతో మంటలను అదుపుచేశారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గ్రేటర్ వ్యాప్తంగా.. భూగర్భ కేబుల్ వ్యవస్థ!

(5వ పేజీ తరువాయి)

మారడంతోపాటు పలు బస్తీలు, కాలనీల్లో విద్యుత్‌తీగలతో షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలను శాశ్వతంగా నివారించడంతోపాటు ఓవర్‌హెడ్‌లైన్లను పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుళ్లను ఏర్పాటు చేసేదిశగా డిస్కం అడుగులు వేస్తోంది.హైదరాబాద్ సౌత్, సెంట్రల్, సికింద్రాబాద్, రాజేంద్రనగర్ సర్కిళ్లలో పాత కాలం నాటి ఓవర్‌హెడ్ లైన్లు ఉండటంతో వాటిపై అధిక లోడ్ పడుతోంది. ఓవర్‌హెడ్ లైన్ల స్థానంలో అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం భారీ వ్యయంతో కూడుకున్న పని విద్యుత్‌రంగ నిపుణులు చెబుతున్నారు.

కలబందతో కాంతివంతంగా...

ముఖం మీద చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. వాతావరణ కాలుష్యం, సూర్య కిరణాలు, చలి గాలులవల్ల ముఖం నిగారింపు కోల్పోతుంటుంది. కలబంద గుజ్జుతో చిన్న చిట్కాలు పాటిస్తే మెరిసే చర్మాన్ని సొంతం చేసుకోవచ్చు.



- ఒక చెంచా కలబంద (అలోవెరా) గుజ్జులో అర చెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖమంతా పట్టించాలి. పది నిమిషాలు ఆరిన తరవాత మంచి నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తూ ఉంటే ఎండ వల్ల వచ్చిన నలుపుదనం తగ్గుతుంది. చర్మానికి తేమ అంది ముఖం నున్నగా మెరుస్తుంది.
- రెండు చెంచాల కలబంద గుజ్జులో మూడు చెంచాల కీర గుజ్జు వేసి కలపాలి. దీనిని ముఖానికి పట్టించాలి. కళ్ల మీద కీర చక్రాలు పెట్టుకోవాలి. అరగంట విశ్రాంతి తీసుకున్న తరవాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా రెండు రోజులకు ఓసారి చేస్తూ ఉంటే ముఖం కాంతివంతంగా మారుతుంది.
- ఒక అంగుళం కలబంద ముక్క నుంచి గుజ్జును తీసి దానికి రెండు చెంచాల గ్రీన్ టీ నీళ్లు కలపాలి. ఈ మిశ్రమాన్ని వేళ్లతో కొద్దిగా తీసుకుంటూ నుదుటి మీద, కళ్ల కింద, బుగ్గల మీద రాయాలి. ఇరవై నిమిషాలు ఆరిన తరవాత మంచి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారం రోజులు చేస్తే నుదుటి మీద గీతలు, కళ్ల కింద వలయాలు, మూతి చుట్టూ ముడతలు తగ్గిపోతాయి. చర్మం బిగుతుగా మారుతుంది.
- అర చెంచా కలబంద గుజ్జులో ఒక ఇ విటమిన్ క్యాప్సూల్ లోని నూనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని పలుచగా ముఖమంతా రాయాలి. అరగంట తరవాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రెండు రోజులకోసారి చేస్తూ ఉంటే ముఖం మీద మొటిమలు, గుల్లలు రావు. ఈ చిట్కా పొడి చర్మం ఉన్న వారికి ప్రయోజనకరంగా ఉంటుంది.
- ఒక చెంచా కలబంద గుజ్జులో రెండు చెంచాల నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించాలి. పది నిమిషాల తరవాత మంచి నీళ్లతో కడిగేసుకుంటే ముఖం మీద ఉండే జిడ్డు, మురికి తొలగిపోయి ప్రకాశవంతంగా కనిపిస్తుంది. ఈ చిట్కా జిడ్డు చర్మం ఉన్నవారికి బాగా పనిచేస్తుంది.

ఈ గింజలు ఔషధంలా పని చేస్తాయి

చియా గింజలను సాధారణంగా సలాడ్స్, స్మూతీలు, పండ్ల రసాలు, పాలు, కొబ్బరి నీళ్లలో కలుపుకుని తీసుకుంటూ ఉంటారు. ఇవి శరీరాన్ని నాజూగ్గా ఉంచడంతోపాటు అంతర్గత అవయవాలను శుద్ధి చేసి జీవక్రియలు సక్రమంగా జరిగేలా చేస్తాయి. రాత్రి పూట చియా గింజలను నీళ్లలో నానబెట్టి ఉదయాన్నే పరగడుపున తీసుకుంటే అనారోగ్య సమస్యలు రావని నిపుణులు చెబుతున్నారు.



జీర్ణక్రియకు: చియా గింజల్లో పీచుపదార్థం అధికంగా ఉంటుంది. తరచూ చియా గింజలను తీసుకోవడం వల్ల పేగు కదలికలు మెరుగుపడి జీర్ణాశయం పరిశుభ్రమవుతుంది. మలబద్ధకం లాంటి సమస్యలు రావు.

బరువుకు: ఈ గింజలను నీటిలో నానబెట్టినపుడు అవి అధికంగా నీటిని పీల్చుకుని జెల్లీ రూపంలోకి మారతాయి. వీటిని ఆహారంలో చేర్చుకుంటే కడుపులో జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. దీంతో ఏదో ఒకటి తినాలనే కోరిక తగ్గి ఆకలి అనిపించదు. క్రమంగా శరీర బరువు నియంత్రణలోకి వస్తుంది.

కండరాలకు: చియా గింజల్లో అత్యధికంగా ప్రోటీన్లు, అమైనో యాసిడ్లు ఉంటాయి. ఇవి కండరాలను బలోపేతం చేస్తాయి. కండరాల నొప్పి, నరాల బలహీనత, మోకాళ్ల నొప్పులు తదితర సమస్యలను నివారిస్తాయి.

గుండెకు: చియా గింజలు తినడం వల్ల శరీరానికి ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ఆల్ఫాలినోలెనిక్ యాసిడ్ లభిస్తాయి. దీని వల్ల రక్తంలో లిపిడ్ ప్రొఫైల్ పెరిగి గుండె జబ్బులు దరిచేరవు.

ఎముకలకు: చియా గింజల్లో కాల్షియం, మెగ్నీషియం, పాస్ఫరస్ ఎక్కువగా ఉంటాయి. ప్రతిరోజూ చియా గింజలను తీసుకోవడం వల్ల ఎముకల్లో సాంద్రత పెరుగుతుంది. ఎముకలు పెళుసుగా మారడం, ఆర్థరైటిస్ లాంటి సమస్యలు తగ్గుతాయి.

సినిమా బాగుంటే ఏదీ ఆపలేదు...

మూడేళ్లుగా సంక్రాంతికి వరుస విజయాలు అందుకుంటున్న దర్శకుడు అనిల్ రావిపూడి. తాజాగా ఆయన తీసిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం కూడా విజయం సాధించింది. ఈ నేపథ్యంలో అనిల్ రావిపూడిని 'నవ్య' పలుకరించింది.



సినిమా విజయాన్ని మీరు ఎలా ఆస్వాదిస్తున్నారు?

ఇది నాకు మూడో సంక్రాంతి... మూడో విజయం... అంటే హ్యాట్రిక్. ఇది దిల్ రాజుగారితో ఆరో సినిమా. ప్రేక్షకులు మేము అనుకున్న దానికన్నా ఎక్కువ విజయాన్ని ఇచ్చారు. అన్ని వర్గాలవారు ఈ సినిమాకు వస్తున్నారు. నవ్వుకుంటున్నారు. నిన్న రాత్రి మహేష్ బాబు గారిని కలిశాం. ఆయనకు సినిమా బాగా నచ్చింది. మహేష్‌గారికి ఈ తరహా కామెడీ చాలా నచ్చుతుంది. ఆయనకు సెకండాఫ్ స్క్రీన్‌ప్లే, బుడ్డాడు, ఉపేంద్ర లమ్మేల కామెడీ ఎంతో నచ్చాయి. సినిమా చూస్తున్నంతసేపూ ఆయన పిల్లలు సితార, గౌతమ్ నవ్వుతూనే ఉన్నారట!

ఈ మధ్యకాలంలో సినిమాల విజయాలను సోషల్ మీడియా ప్రభావితం చేస్తోందనే వాదన వినిపిస్తోంది..!

సోషల్ మీడియా సినిమా ఫలితాలను ప్రభావితం చేస్తుందంటే నేను నమ్మను. సినిమాలో విషయం ఉంటే ఏ సోషల్ మీడియా ఆపలేదు. ప్రేక్షకులకు నచ్చిన కంటెంట్ ఇవ్వగలిగితే వాళ్లే ఆ సినిమాను నెత్తిమీద పెట్టుకొని తీసుకువెళ్తారు. బావుంటే ఆడకుండా ఉండదు. సోషల్ మీడియాలో ఎంత నెగిటివ్ చేసినా విజయాన్ని ఆపలేరు. సినిమా బావుంటే- దాన్ని ఆపే శక్తి దేనికీ లేదు.

మీరు సోషల్ మీడియాలో ట్రోల్స్‌ను, ప్రచారాలను పట్టించుకొంటారా?

సోషల్ మీడియాలో ట్రోల్స్ నా మీదే కాదు... అందరి మీద వస్తున్నాయి. వీటివల్ల ప్రభావితం అవుతున్నారు. అయితే ట్రోల్స్‌తో పాటుగా కొన్నిసార్లు ప్రశంసలు కూడా వస్తున్నాయి. జాగ్రత్తగా చూస్తే... సోషల్ మీడియా మన సమాజానికి ప్రతిబింబం. మంచి, చెడులు రెండూ ఉంటాయి. మంచితో పాటుగా వెళ్లిపోతే సమస్య ఉండదు. ఇక వ్యక్తిగతంగా నేను సోషల్ మీడియా ట్రోల్స్‌ను పెద్దగా పట్టించుకోను. నా ఫ్రెండ్స్ కొందరు ట్రోల్స్‌వల్ల ఇబ్బంది పడుతూ ఉంటారు. పట్టించుకోవద్దని వాళ్లకు కూడా చెబుతుంటాను. మనల్ని పొగిడేవాళ్లు ఎక్కడ ఉన్నారో అక్కడికి వెళ్లి, వాళ్ల ద్వారా ఆనందాన్ని పొందటం మంచిది. లక్ష మంది పొగుడుతున్నపుడు ఒకరిద్దరు విమర్శించినా పట్టించుకోకూడదు.

'ఇప్పుడు ప్రేక్షకులు కొత్తదనం కోరుకుంటున్నారు. వారు మారిపోయారు' అనే వాదనలతో మీరు ఏకీభవిస్తారా?

'ప్రేక్షకులు మారిపోయారు' అనే వాదనను నేను వేరే కోణం నుంచి చూస్తాను. ప్రతి పదేళ్లకు ప్రేక్షకుల అభిరుచుల్లో తేడాలు వస్తాయి. దీనికి తగినట్లే కథలు, స్క్రీన్‌ప్లే, నిర్మాణ పద్ధతుల్లో మార్పులు వస్తాయి. దీన్ని పట్టుకొని ముందుకు వెళ్లాలి. నా ఉద్దేశంలో హారర్, యాక్షన్, ఫ్యామిలీ, కామెడీ- ఇలా అన్ని రకాల సినిమాలనూ చూసే ప్రేక్షకులు ఎప్పుడూ ఉంటారు. వాళ్లను థియేటర్‌లకు రప్పించాలంతే!

సినిమాలో ఏదో ఒక కొత్త ప్రపంచాన్ని చూపించకపోతే ప్రేక్షకులు థియేటర్‌కు రావటం లేదని కొందరు అంటున్నారు. మీరేమంటారు?

నాకు ఈ వాదన సరికాదని అనిపిస్తుంది. 'డీజే టిల్లు'ను తీసుకోండి. దానిలో కొత్త ప్రపంచమేదీ లేదు కదా! 'సంక్రాంతికి వస్తున్నాం'లో రాజమండ్రిలోని శివ రాజు అనే కుటుంబంలోకి తీసుకువెళ్లగలిగాం. సినిమా నచ్చితే చాలు... చూస్తారు. అయితే ఇక్కడ ఇంకో విషయం కూడా ఉంది. కొవిడ్ తర్వాత ప్రేక్షకులు చాలా ఆలోచించి కానీ సినిమాలకు రావటం లేదు. అందువల్ల ట్రైలర్, టీజర్ దగ్గర నుంచి చాలా జాగ్రత్తగా ప్రేక్షకులకు అందించాలి. అప్పుడే వాళ్లు థియేటర్‌కు వస్తారు.

ప్రతి సీన్‌కు ఒక ఎలివేషన్, పావుగంటకు ఒక ట్విస్ట్ లేకపోతే ప్రేక్షకులు సినిమాలు చూడటం లేదనే వాదన కూడా ఉంది కదా!

స్టార్‌ల సినిమాల్లో ఇవి తప్పనిసరి. ఎందుకంటే స్టార్‌లతో తీసే సినిమాలలో హీరోని సెలబ్రేట్ చేయాలి. కథతో పాటుగా ఇలాంటి సెలబ్రేషన్‌వల్ల ప్రేక్షకుల్లో ఉత్సుకత పెరుగుతుంది. కథ, డ్రామా కన్నా హీరోని ఎంత ఎలివేట్ చేయగలిగితే అంత విజయం సాధిస్తుంది. స్టార్ హీరో చూడటానికి వెళ్లిన ఫ్యాన్స్... క్లాప్స్ కొట్టాలి. విజిల్స్ వేయాలి. అదే దర్శకుడి మొదటి లక్ష్యం. మిగిలినదంతా ఆ తర్వాతే! ఒకవేళ ఇలాంటి ఉత్సాహం కలిగించటంలో విఫలమయితే సినిమా ఫెయిల్ అయ్యే ప్రమాదం కూడా ఉంటుంది. ఫ్యాన్స్‌కు ఉత్సుకత కల్పించి- మంచి కథను కూడా ఇవ్వగలిగితే అది నెక్స్ట్ లెవెల్ అవుతుంది. అద్భుతం అవుతుంది.

> **మెగాస్టార్‌తో సినిమా...**
>
> చిరంజీవి గారితో సినిమా ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. ఒక కథ లైన్ అనుకున్నాం. అది ఆయనకు నచ్చింది. ఇప్పుడు 'సంక్రాంతికి వస్తున్నాం...' అయిపోయింది కాబట్టి దానిమీద వర్క్ చేయాలి. ఆయనకు చెప్పాలి. ఆ తర్వాత ఎప్పుడు టేక్‌ఆఫ్ అవుతుందనే విషయాన్ని ప్లాన్ చేయాలి.

ఈ సెలబ్రేషన్ మూడ్‌లో పడిపోయి నిజమైన కథను మర్చిపోతున్నామా?

పాన్ ఇండియా మార్కెట్ విస్తరించిన తర్వాత ప్రతి రెండేళ్లకో, మూడేళ్లకో హీరో సినిమా వస్తోంది. అప్పుడు దాన్ని సెలబ్రేట్ చేయాల్సిందే! ఒకప్పుడు ఒక స్టార్‌వి ఆరేడు సినిమాలు వచ్చేవి. ఇప్పుడు ఒకటే వస్తోంది. కొన్నిసార్లు రెండేళ్లకు ఒకటి వస్తోంది. మనకు ఆరుగురు పెద్ద స్టార్స్ ఉన్నారనుకుందాం. ఆరుగురి సినిమాలూ రావటం లేదు. అప్పటికీ, ఇప్పటికీ పరిస్థితులు మారిపోయాయి. నార్త్ మార్కెట్‌ను చూసుకోవాలి. అక్కడ ఎలాంటి సినిమాలు చూస్తున్నారో గమనించి- దానికి తగినట్లుగా తీయాలి. నార్త్ ఇండియాలో ఎలివేషన్స్, మాస్ కంటెంట్‌ను బాగా చూస్తున్నారు. దీనివల్ల మిగిలిన సినిమాలకు కొంత స్పేస్ చిక్కుతోంది.



ఈ ఉత్సాహంలో ఒకే రకం కథలు వస్తున్నాయనే విమర్శ కూడా ఉంది..!

ప్రేక్షకులు సినిమాలు చూడకపోతే అనుకోవాలి. ఇలాంటి సినిమాలకు బ్రహ్మరథం పడుతున్నప్పుడు అలాంటి కామెంట్ చేయటానికి నేను ఇష్టపడను. ఒక వర్గం ప్రేక్షకులు ఈ తరహా సినిమాలు చూడటానికి ఇష్టపడుతున్నారు. అన్ని వర్గాలు వస్తున్నారా అంటే చెప్పలేను. కానీ మొదటి వారం రోజుల్లో కలెక్షన్స్ వచ్చేస్తున్నాయి కదా! ఈ సినిమాలను ఎంత మంది ప్రేక్షకులు చూస్తున్నారనే విషయం గమనిస్తే సినిమా విజయవంతమైందో లేదో తెలుస్తుంది కదా!

మలయాళంలో తక్కువ బడ్జెట్‌లోతీసిన సినిమాలు విజయవంతం అవుతాయి కదా...

మలయాళంలో తీసే సినిమాలు వేరుగా ఉంటాయి. వాళ్లు తక్కువ ఖర్చుతో త్వరగా తీస్తారు. కొన్ని సినిమాలైతే కోటి, రెండు కోట్ల రూపాయలతో అయిపోతాయి. మలయాళం ప్రేక్షకుల అభిరుచులు కూడా భిన్నంగా ఉంటాయి. అవి వాళ్లకు నచ్చుతాయి. మన ప్రేక్షకులు వేరు.

అయితే ఇదంతా తెలుగు ప్రేక్షకుల అభిరుచులవల్లే అంటారా?

మన డైరక్టర్లు కొన్ని తరహా సినిమాలు తీస్తే చూడటానికి ప్రేక్షకులు ఇష్టపడరు. అదే తరహా సినిమాని ఇతర భాషా దర్శకులు తీస్తే చూస్తారు. నన్నే ఉదాహరణగా తీసుకోండి. నా దగ్గర నుంచి ప్రేక్షకులు కొన్ని రకాల సినిమాలు ఇష్టపడతారు. దానికి భిన్నంగా తీస్తే చూడరు. నాకు 'కాంతార'లాంటి సినిమా తీయాలని ఉంటుంది. కానీ తీస్తే... ప్రేక్షకులు చాచి కొడతారు. ప్రేక్షకులకు ఏం కావాలో అర్థం చేసుకొని, దానికి తగినట్లుగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ, మార్కెట్‌ను అర్థం చేసుకుంటూ సినిమా తీయగలిగితే విజయం సాధించగలుగుతాం.

> **సినిమా... ఓ లాటరీ**
>
> నా ఉద్దేశంలో ప్రతి సినిమా ఒక లాటరీ లాంటిది. నేను తీసిన 'సంక్రాంతికి వస్తున్నాం' కూడా ఒక లాటరీనే కదా! ఈ సినిమా రాజుగారికి ఊపిరి పోసింది. హిట్ అయి రెవెన్యూ వస్తోంది కాబట్టి మాట్లాడుకుంటున్నాం.. నిజం చెప్పాలంటే ఏ సినిమా ఎందుకు విజయవంతమవుతుందో మనం చెప్పలేం! అది తెలిస్తే అందరూ హిట్ సినిమాలే తీస్తారు కదా

దర్శకుడు బాబీ వంటివారు బాలీవుడ్‌కు వెళ్తున్నారనే వార్తలొస్తున్నాయి. మీకూ అలాంటి ఆలోచన ఉందా?

నాకు అలాంటి ఆలోచన లేదు. చక్కగా తెలుగు సినిమాలు తీసుకోవాలని ఉంది. మన ప్రేక్షకులకు ఏడాదికి ఒక సినిమా ఇచ్చుకుంటూ వెళ్తా!

• సివిఎల్ఎన్ ప్రసాద్

చిత్రజ్యోతి
SINCE 1965

తమన్ ఆవేదన.. చిరంజీవి ఓదార్పు



'డియర్ తమన్..నిన్న నువ్వు మాట్లాడిన మాటలు హృదయాన్ని తాకేలా ఉన్నాయి. ఎప్పుడూ సరదాగా మాట్లాడుతూ ఉండే నీలో ఇంత ఆవేదన ఉండటం నాకు ఆశ్చర్యంగా అనిపించింది. మనసు ఎంత కలత చెందితే నువ్వు ఇంతగా స్పందించావో అని అనిపించింది' అని చిరంజీవి అన్నారు. ఇటీవలె నిర్వహించిన 'డాకు మహారాజ్' విజయోత్సవ సభలో తమన్ మాట్లాడుతూ 'నెగెటివ్ ట్రోల్స్ వల్ల తెలుగు సినిమా ఇండస్ట్రీ పరువు పోతోంది. అలాంటి వాటి వల్ల సినిమా చాలా నష్టపోతోంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చిరంజీవి స్పందించారు. 'సినిమా అయినా, క్రికెట్ అయినా, మరో సామాజిక సమస్య ఏదైనా సోషల్ మీడియా వాడుతున్న ప్రతి ఒక్కరు తమ మాటల ప్రభావం ఆయా వ్యక్తుల మీద ఎలా ఉంటుందోనని ఆలోచించాలి' అని 'ఎక్స్'లో పోస్టు చేశారు.



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా దర్శకుడు జ్యోతికృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'హరిహర వీర మల్లు'. ఏ.ఎమ్.రత్నం నిర్మిస్తున్నారు. 'కంగువ', 'డాకు మహారాజ్' చిత్రాలతో ప్రతినాయకుడిగా ఆకట్టుకున్న బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ పాత్రలో కనిపించనున్నారు. నిధి అగర్వాల్, నర్గిస్ ఫక్రీ కథానాయికలు. ఈ సినిమా నుంచి మొదటి పాటను విడుదల చేశారు. ఈ పాటను పవన్ కల్యాణ్ పాడారు. 'మాట వినాలి గురుడా మాట వినాలి.. మాట వినాలి మంచి మాట వినాలి' అని సాగే ఈ గీతానికి పెంచల్ దాస్ సాహిత్యం, కీరవాణి సంగీతం అందించారు. మార్చి 28న విడుదలవుతోంది.

వేసవి వినోదం



నితిన్ హీరోగా నటించిన కామెడీ ఎంటర్‌టైనర్ 'రాబిన్ హుడ్' విడుదల తేదీ ప్రకటించారు. శ్రీలీల హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాను మార్చి 28న విడుదల చేస్తున్నామనీ, వేసవిలో మంచి వినోదాన్ని అందించే సినిమా ఇదని నిర్మాతలు నవీన్ యర్నేని, వై.రవిశంకర్ చెప్పారు. నితిన్‌తో ఇంతకుముందు 'భీష్మ' చిత్రాన్ని రూపొందించిన వెంకీ కుడుముల 'రాబిన్‌హుడ్'ని ఆసక్తికరంగా రూపొందించారని తెలిపారు. కేతిక శర్మ పాల్గొన్న సెకండ్ సింగిల్ కొన్ని రోజుల్లో విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు.

అందుకే న్యూజిలాండ్ వెళ్లాం



'కన్నప్ప' చిత్రం షూటింగును న్యూజిలాండ్‌లో చేయడానికి ప్రధాన కారణం అక్కడి పచ్చదనంతో కూడిన రమణీయ ప్రదేశాలేనని హీరో మంచు విష్ణు అన్నారు. ఆయన హీరోగా ముఖేష్ కుమార్ సింగ్ రూపొందించిన 'కన్నప్ప' చిత్రం తమిళ ట్రైలర్‌ను శనివారం చెన్నైలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మంచు విష్ణు మీడియాతో మాట్లాడుతూ "ఈ స్టోరీ 2015లోనే సిద్ధమైంది. అప్పటి నుంచి కొన్నేళ్ళ పాటు పరిశోధన చేసిన తర్వాత ఈ ప్రాజెక్టును ప్రారంభించాం" అని తెలిపారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

నవ్వుల విందు



సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ హీరోలుగా కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. 'మ్యాడ్' చిత్రానికి సీక్వెల్‌గా సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని మార్చి 29న విడుదల చేస్తున్నట్టు ప్రకటిస్తూ పోస్టర్‌ని విడుదల చేశారు. 'మీరు హ్యాండిల్ చేయగలిగిన దానికంటే ఎక్కువ వినోదం, మీరు ఊహించిన దానికంటే ఎక్కువ మ్యాడ్‌నెస్' అని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ సీక్వెల్‌తో మరోసారి నవ్వుల విందును అందించబోతున్నారు దర్శకుడు కల్యాణ్ శంకర్.

వినోదంతో పాటు సందేశం



- సుకుమార్

దర్శకుడు సుకుమార్ బండ్రెడ్డి తనయురాలు సుకృతి వేణి నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకత్వం వహించారు. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, శేష సింధూరావు నిర్మించారు. ఈ నెల 24న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా సుకుమార్ మాట్లాడుతూ "సుకృతి నటన చూసి షాకయ్యాను. సినిమాలో వినోదంతో పాటు సందేశం కూడా ఉంది" అని అన్నారు. ఇది అందరి మనసుల్ని హత్తుకునే సినిమా అని దర్శకురాలు పద్మావతి చెప్పారు.

ఆదరిస్తే మరిన్ని మంచి చిత్రాలు వస్తాయి



- దర్శకుడు ముత్యాల సుబ్బయ్య

రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'తల్లి మనసు'. వి. శ్రీనివాస్ (సిప్పీ) దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య తనయుడు అనంత కిశోర్ నిర్మించారు. ఈనెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ముత్యాల సుబ్బయ్య మాట్లాడుతూ 'తల్లికి ఎన్ని నిర్వచనాలు ఇచ్చినా సరిపోవు. అలాంటి తల్లి సబ్జెక్టును తీసుకొని సినిమా చేశాం. ప్రేక్షకులు కథలో, పాత్రలలో పూర్తిగా నిమగ్నమయ్యేవిధంగా సినిమా వచ్చింది. ఇలాంటి మంచి చిత్రాలను ఆదరిస్తే మరిన్ని మంచి సినిమాలు వస్తాయి' అని అన్నారు. దర్శకుడు వి. శ్రీనివాస్ మాట్లాడుతూ 'ఓ తల్లి ఎలాంటి సంఘర్షణలకు గురయ్యిందన్న అంశాన్ని ప్రేక్షకులకు హత్తుకునేలా వైవిధ్యంగా చెప్పాం' అని తెలిపారు.

రెండు భాషల్లో 'రాక్షస'...



కన్నడ నటుడు ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటించిన ద్విభాషా చిత్రం 'రాక్షస'. అరుణ్ రాథోడ్, శ్రీధర్, గౌతమ్, సోమశేఖర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. లోహిత్ హెచ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం వచ్చే నెల 26న కన్నడతో పాటు తెలుగులోనూ విడుదలవుతోంది. ఈ సినిమా తెలుగు హక్కులను నిర్మాత ఎం.వీ.ఆర్.కృష్ణ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది. మంచి కంటెంట్ ఉన్న ఈ చిత్రం తప్పకుండా ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది" అని అన్నారు.

మరోసారి తెలుగులో...




యోగేశ్ కల్లే హీరోగా పాన్ ఇండియా చిత్రం 'త్రిముఖ'తో తెరంగేట్రం చేస్తున్నారు. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి రాజేశ్ నాయుడు, శ్రీదేవి మద్దాలి దర్శకత్వం వహిస్తున్నారు. హర్ష కల్లే నిర్మాత. ఇందులో సన్నీ లియోన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉన్న ఈ చిత్రం మార్చిలో విడుదల కానుంది.


SWM
MOVIE MAXX
24TH JAN 2025
TOVINO THOMAS
IDENTITY
తెలుగులో
WRITTEN & DIRECTED BY
AKHIL PAUL – ANAS KHAN
PRODUCER
RAJU MALLIATH
PRODUCE
DR ROY C
2025 లో విడుదలైన తొలి మలయాళ సూపర్ హిట్
చిత్రం 40 కోట్లు వసూలు చేసి తెలుగులో యాక్షన్
థ్రిల్లర్ మూవీగా విడుదలవుతోంది.


యాక్షన్, ఎమోషన్, సెంటిమెంట్ అన్నీ కలిసిన అద్భుత చిత్రం
SRI HANUMAN MOVIE MAKERS
జనవరి 24 వస్తున్నారు
హాంగ్ కాంగ్ వారియర్స్
FROM DIRECTOR SOI CHEANG
IN TELUGU ENGLISH HINDI & TAMIL
TWILIGHT OF THE WARRIORS WALLED IN
FROM THE DIRECTOR OF MONKEY KING FRANCHISE
AVAILABLE IN ALL DIGITAL FORMATS
నైజాం: మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ LLP, మరట్వాడ, ఒరిస్సా: రాజశ్రీ ప్రొడక్షన్స్, సీడెడ్: N సినిమాస్, వైజాగ్: విఘ్నేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్స్,
ఈస్ట్, వెస్ట్: శ్రీ కనకదుర్గా ఫిలిమ్స్ - 9701399557, నెల్లూరు: UR సినిమాస్, కృష్ణ, గుంటూరు సంప్రదించండి: NVR సినిమా - 99669 63111, 79895 67742


SITHARA ENTERTAINMENTS
SRIKARA STUDIOS
FORTUNE FOUR CINEMAS
BLOCKBUSTER HUNTING
A BOBBY KOLLI FILM
DAAKU MAHARAAJ
PRODUCED BY
SURYADEVARA NAGA VAMSI · SAI SOUJANYA
A THAMAN S MUSICAL
IN CINEMAS NOW


MEGA SANKRANTHI
PART 2
VALUE ZONE
AN aha ORIGINAL
MANSION HOUSE
UNSTOPPABLE 4
WITH NBK
ప్రభాస్ పెళ్లి ఎప్పుడు ?
గణపవరం అమ్మాయి ...
WATCH NOW
₹499/YEAR
SUBSCRIBE NOW
aha
MANA TELUGU APP
realme
KOHLER


SMT ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
GLOBAL STAR
RAM CHARAN
SANKRANTI BLOCKBUSTER
SHANKAR'S
GAME CHANGER
PRODUCED BY RAJU - SHIRISH
A THAMAN S MUSICAL
TELUGU - TAMIL - HINDI - KANNADA - MALAYALAM
NOW IN CINEMAS


DIL RAJU PRESENTS
SRI VENKATESWARA CREATIONS
#VENKYANIL03
BLOCKBUSTER PONGALUU
సంక్రాంతికి వస్తున్నాం
AN ANIL RAVIPUDI FILM
PRODUCER SHIRISH

ఆంధ్రజ్యోతి
బిజినెస్
హైదరాబాద్ ● ఆదివారం 19 జనవరి 2025

హైదరాబాద్‌లో మలబార్ గోల్డ్ కొత్త షోరూమ్



హైదరాబాద్: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్.. హైదరాబాద్‌లోని టోలిచౌకిలో కొత్త షోరూమ్‌ను ఏర్పాటు చేసింది. మలబార్ గోల్డ్‌కు హైదరాబాద్‌లో ఇది 15వ షోరూమ్. శనివారం నాడు ఈ షోరూమ్‌ను జూబ్లీహిల్స్ శాసన సభ్యుడు మాగంటి గోపినాథ్, షేక్‌పేట్ కార్పొరేటర్ మొహమ్మద్ రషీద్ ఫరాజుద్దీన్ ప్రారంభించారు. హైదరాబాద్ ప్రజలకు మరింత చేరువ కావటానికి ఈ షోరూమ్ ఎంతగానో దోహదపడుతుందని మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎంపీ అహమ్మద్ అన్నారు. ఈ షోరూమ్‌లో సాంప్రదాయ, వినూత్నమైన స్టైల్స్‌తో కూడిన ఆభరణాలు అందుబాటులో ఉంటాయని మలబార్ గోల్డ్ తెలిపింది. షోరూమ్ ప్రారంభం సందర్భంగా వినియోగదారుల కోసం ఈ నెల 31 వరకు ప్రత్యేక సిల్వర్ ఆఫర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించింది. ఈ కార్యక్రమంలో మలబార్ గోల్డ్‌కు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

2030 నాటికి రూ.52 లక్షల కోట్లు

భారత ఆటోమొబైల్ రంగంపై గూగుల్-బీసీజీ నివేదిక అంచనా

న్యూఢిల్లీ: భారత వాహన పరిశ్రమ పరిమాణం 2030 నాటికి రెట్టింపు స్థాయి 60,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.52 లక్షల కోట్లు)కు చేరుకోవచ్చని టెక్నాలజీ దిగ్గజం గూగుల్, బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) సంయుక్తంగా విడుదల చేసిన నివేదిక అంచనా వేసింది. ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ ఆటో ఎక్స్‌పోలో ఈ నివేదికను విడుదల చేశారు. అంతర్జాతీయ ట్రెండ్‌కు భిన్నంగా భారత ఆటోమొబైల్ రంగం తనదైన వినూత్న మార్గంలో దూసుకెళ్లుతోందని నివేదిక పేర్కొంది. "భారత్ ఇప్పటికే మూడో అతిపెద్ద ఆటోమొబైల్ పరిశ్రమగా ఎదిగింది. వచ్చే కొన్నేళ్లలో ఇండస్ట్రీ విప్లవాత్మక మార్పులకు లోనుకానున్నది. విద్యుత్ వాహనాల్లో అంతర్జాతీయ ఆవిష్కరణలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు డిజిటల్, కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతిక వినియోగం వాహన తయారీదారులకు అత్యంత కీలకంగా మారింది. ఈ రంగంలో విజయం సాధించాలంటే, మారుతున్న వినియోగదారుల అభిరుచులు, అవసరాలకు అనుగుణమైన వాహనాలను మార్కెట్లోకి తీసుకురావాల్సి ఉంటుందని" బీసీజీ ఎండీ, పార్ట్‌నర్ నటరాజన్ శంకర్ అన్నారు. ప్రీ-పర్చేజ్ నుంచి ఇన్ వెహికిల్ ఎక్స్‌పీరియెన్స్, ఆఫ్టర్ సేల్స్ సర్వీస్ వరకు ఏఐ ద్వారా వినియోగదారులకు మంచి అనుభూతిని కలిగించడంతో పాటు వాహన విలువను పెంచేందుకు వీలుంటుందని గూగుల్ ఇండియా ఓమ్నీ చానల్ బిజినెస్ డైరెక్టర్ భాస్కర్ రమేశ్ అన్నారు. ఆటో రంగంలో ఆవిష్కరణలు, వృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఈ ఇండస్ట్రీతో భాగస్వామ్యానికి ఉత్సాహంగా ఎదురు చూస్తున్నామన్నారు. నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..



వచ్చే ఐదేళ్లలో ప్రపంచ నం.1
భారత వాహన పరిశ్రమపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

- భారత్‌లో విద్యుత్ వాహనాల (ఈవీ)కు గిరాకీ వేగంగా పెరుగుతోంది. ప్రతి ముగ్గురు కొనుగోలుదారుల్లో ఒకరు ఈవీ కొనుగోలు ఆలోచనలో ఉన్నారు. ఎలక్ట్రిక్ కార్ల కొనుగోలుదారులు ఆధునిక హంగులు, ఆధునిక టెక్నాలజీ, సమగ్రతకు ప్రాధాన్యమిస్తుండగా.. ఎలక్ట్రిక్ టూ వీలర్ వినియోగదారులు సౌకర్యం, అందుబాటు ధరలో లభిస్తుందా..?, వాస్తవికత అంశాలపై దృష్టి సారిస్తున్నారు.
- ఈవీల కొనుగోలు నిర్ణయంలో ఆ ఇంటి మహిళల ప్రభావం 52 శాతంగా ఉంది. సంప్రదాయ పెట్రోల్, డీజిల్ ఇంజన్ వాహనాల కొనుగోలు విషయంలో ఇది 38 శాతంగా ఉంది.
- ఎలక్ట్రిక్, షేర్డ్, కనెక్టెడ్ మొబిలిటీ విభాగాల ఆదాయం 10,000 కోట్ల డాలర్ల (రూ.8.66 లక్షల కోట్లు) స్థాయికి చేరవచ్చని అంచనా.
- భారత వాహన వినియోగదారుల వినూత్న, వేగంగా మారుతున్న ప్రాధాన్యాలను ఇండస్ట్రీ వర్గాలు గుర్తించాల్సిన అవసరం ఉంది.

భారత వాహన పరిశ్రమ వచ్చే ఐదేళ్లలో ప్రపంచ నంబర్ వన్‌గా అవతరించనుందని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. దేశీయ ఆటోమొబైల్ ఇండస్ట్రీ ఇప్పటివరకు 4.5 కోట్ల ఉద్యోగాలను సృష్టించిందని, మిగతా రంగాలతో పోలిస్తే ఇదే అత్యధికమని ఆయన పేర్కొన్నారు. అంతేకాదు, జీఎస్‌టీ రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అత్యధిక ఆదాయం పంచుతున్న రంగం కూడా ఇదేనన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఫాడా) ఆధ్వర్యంలో శనివారం జరిగిన సదస్సులో మంత్రి ప్రసంగించారు. భారత్‌లో తయారైన వాహనాలకు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ ఉందన్నారు. దేశంలో తయారవుతున్న మొత్తం మోటార్ సైకిళ్లలో 50 శాతం విదేశాలకు ఎగుమతవుతున్నాయని అన్నారు. 2014లో తాను కేంద్ర రవాణా మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు దేశీయ వాహన పరిశ్రమ సైజు రూ.7.5 లక్షల స్థాయిలో ఉండగా.. ప్రస్తుతం దేశీయ ఆటోమొబైల్ రంగ పరిశ్రమ సైజు రూ.22 లక్షల కోట్ల స్థాయికి చేరుకుందన్నారు. కాగా, యూఎస్ ఆటోమొబైల్ ఇండస్ట్రీ సైజు రూ.78 లక్షల కోట్లు, చైనా వాహన మార్కెట్ రూ.47 లక్షల కోట్ల స్థాయిలో ఉన్నాయి.



ఎక్స్‌పోలో ఈవీలదే హవా

దేశ రాజధాని ఢిల్లీలో 'భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025' పేరుతో ప్రారంభమైన వాహనాల ప్రదర్శన పండగ సందడిగా సాగుతోంది. ఈ ఎక్స్‌పోలో రెండో రోజూ ఎలక్ట్రిక్ వాహనాలే ప్రధానంగా సందర్శకుల దృష్టిని ఆకర్షించాయి.





ప్యాసింజర్ వెహికిల్స్ సెగ్మెంట్లో వియత్నాంకు చెందిన విన్‌ఫాస్ట్, చైనాకు చెందిన బీవైడీ తమ కొత్త వాహనాలను ఈ ఎక్స్‌పోలో ప్రదర్శించాయి. విన్‌ఫాస్ట్ తన లగ్జరీ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ లైన వీఎఫ్ 7, వీఎఫ్ 6ను ప్రదర్శించింది. ఈ రెండు మోడళ్లను ఈ ఏడాదిలోనే భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టనున్నట్లు తెలిపింది. బీవైడీ సైతం తన ఈఎస్‌యూవీ 'సీలియన్ 7'ను పరిచయం చేసింది.



ఎక్స్‌పో తొలిరోజున క్రెటా ఈవీని ఆవిష్కరించిన దక్షిణ కొరియా కంపెనీ హ్యుండయ్.. శనివారం ఎలక్ట్రిక్ త్రీ వీలర్‌తో పాటు మైక్రో ఫోర్ వీలర్‌లో ఆధునిక కాన్సెప్ట్ మోడళ్లను ప్రదర్శించింది.

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ దేశంలో తొలి డీ ప్లస్ సెగ్మెంట్ ఎస్‌యూవీ మజెస్టర్‌ను ఆవిష్కరించింది. బీఎండబ్ల్యూ దేశీయంగా తయారు చేసిన సరికొత్త ఎక్స్3 మోడల్‌ను విడుదల చేసింది. దీని ధర రూ.75.8 లక్షలుగా ఉంది.



ఎలక్ట్రిక్ బస్‌ల తయారీదారైన ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఈ ఎక్స్‌పోలో 12 మీటర్ల బ్లేడ్ బస్ ప్లాట్‌ఫామ్‌పై రీడిజైన్ చేసిన బ్లేడ్ బ్యాటరీ చాసిస్‌తో పాటు 9 మీటర్ల సిటీ, 12 మీటర్ల కోచ్ బస్సులను ప్రదర్శించింది.

ఎక్స్ వర్క్స్ కాంట్రాక్టుల్లో ఐటీసీ ఎప్పుడు తీసుకోవాలి?

ఇదీ GST



రాంబాబు గొండాల

నిర్మాణ రంగంలో ఉన్న ఒక ప్రముఖ కంపెనీ తాను నిర్మించబోయే వాణిజ్య సముదాయానికి కావాల్సిన సిమెంట్, స్టీల్, ఇతర ఇన్‌పుట్స్‌ను నేరుగా ఉత్పత్తిదారుల నుంచి కొనుగోలు చేయాలని భావించింది. దీనివల్ల స్థానిక మార్కెట్‌తో పోలిస్తే తక్కువ ధరకే తనకు కావాల్సిన ఇన్‌పుట్స్‌ను కొనవచ్చని భావించింది. అనుకున్న విధంగానే ఆయా కంపెనీలతో సంప్రదింపులు జరిపిన తర్వాత కావాల్సిన సరుకును ఆయా ఫ్యాక్టరీల నుంచి నేరుగా పొందేట్లుగా ఎక్స్ వర్క్స్ కాంట్రాక్టు రాసుకున్నారు. దీని ప్రకారం ఫ్యాక్టరీ నుంచి నిర్మాణ స్థలానికి మధ్య జరిగే రవాణా, బీమా ఇతరత్రా ఖర్చులను కొనుగోలుదారుడే భరించాలి.

ఎక్స్‌వర్క్స్ అంటే అమ్మకపుదారుడు తన ఉత్పత్తిని కొనుగోలుదారునికి తన ఫ్యాక్టరీ గేటు దగ్గరే అందిస్తున్నట్లు లెక్క. కాబట్టి తదుపరి ఖర్చు మొత్తం కొనుగోలుదారుడే భరించాలి. ఇక్కడ ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే.. ఎక్స్ వర్క్స్ అంటే కేవలం రవాణా లాంటి ఖర్చు మాత్రమే కాదు. ఆ సరుకుకు సంబంధించిన పూర్తి యాజమాన్య హక్కులు కూడా కొనుగోలుదారునికి ఫ్యాక్టరీ గేటు దగ్గరే బదిలీ అవుతాయి. అంటే, ఒకసారి ఆ సరుకు ఫ్యాక్టరీ గేటు దాటితే.. ఆ సరుకుకు సంబంధించిన పూర్తి బాధ్యత కొనుగోలుదారునిదే. అమ్మకందారునికి ఎలాంటి బాధ్యత ఉండదు.

పైన చెప్పిన ఉదాహరణలో ఆ నిర్మాణ సంస్థ తనకు కావాల్సిన ఉత్పత్తులు స్థానికంగా లభ్యమైనప్పటికీ తక్కువ ధరకు పొందాలనే ఉద్దేశంతో నేరుగా ఫ్యాక్టరీ నుంచి కాంట్రాక్టు కుదుర్చుకుంది. నిజానికి ఇక్కడ ఎక్స్ వర్క్స్ అనేది తప్పనిసరి కాదు. రవాణా, ఇతర ఖర్చులు కలిపినా తనకు స్థానిక ధరలతో పోలిస్తే తక్కువకు వస్తుంది. కాబట్టి ఆ విధంగా కాంట్రాక్టు కుదుర్చుకుంది.

కొన్ని వ్యాపారాలకు తప్పనిసరి

అయితే, కొన్ని రకాల వ్యాపారాల్లో ఎక్స్ వర్క్స్ కాంట్రాక్ట్ అనేది తప్పనిసరి. ఉదాహరణకు ఆటోమొబైల్ రంగం. ఒక కారు డీలర్ తనకు కావాల్సిన కార్లను తప్పనిసరిగా ఎక్స్ వర్క్స్ ప్రాతిపదికనే కొనాలి. అంటే, కార్ల తయారీదారు, ఆ కారు డీలర్ కొనుగోలు చేసిన కార్లను ఎక్స్ వర్క్స్ ప్రాతిపదికన అంటే ఫ్యాక్టరీ గేటు దగ్గరే అందిస్తాడు. ఇలాంటి సందర్భాల్లో కొనుగోలు చేసిన కార్ల తాలూకు యాజమాన్య హక్కులు.. డీలర్ వేర్ హౌస్‌కో, షోరూమ్‌కో కార్లు చేరుకున్నప్పుడు కాకుండా కార్ల తయారీ స్థలంలోనే అంటే ఫ్యాక్టరీ గేటు దగ్గరే ఆ డీలర్ పొందుతాడు. ఉదాహరణకు హైదరాబాద్‌లో ఉన్న డీలర్ చెన్నైలోని ప్లాంట్‌లో కార్లు కొనుగోలు చేశాడు. రవాణాకు ఒక ఐదారు రోజుల సమయం పడుతుందని అనుకుందాం. అంటే జనవరి నెలాఖరులో కార్లు కొనుగోలు చేస్తే.. ఆ కార్లు డీలర్ దగ్గరకు చేరే సరికి జనవరి నెల పూర్తయి ఫిబ్రవరి మొదలవుతుంది. ఇలాంటి సందర్భాల్లో జీఎస్‌టీకి సంబంధించి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) పొందటానికి కొంత ఇబ్బంది ఎదురవుతుంది. ఐటీసీ నిబంధనల ప్రకారం ఒక వస్తువు మీద క్రెడిట్ తీసుకోవాలంటే ఆ వస్తువును కొనుగోలుదారుడు కచ్చితంగా పొంది ఉండాలి. అంటే, రిసీవ్ చేసుకుని ఉండాలి. మరి అలాంటప్పుడు ఈ కారు డీలర్ తాను కొనుగోలు చేసిన కార్లను ఎప్పుడు రిసీవ్ చేసుకున్నట్లు భావించాలి? వాటి మీద ఎప్పుడు క్రెడిట్ తీసుకోవాలి? కారు భౌతికంగా తన షోరూమ్‌లో పొందినది ఫిబ్రవరిలో కాబట్టి కార్లను అదే నెలలో పొందినట్లు భావించి ఫిబ్రవరి నెల రిటర్న్‌లో క్రెడిట్ తీసుకోవాలా? లేదా తనకు యాజమాన్య హక్కులు జనవరిలోనే బదిలీ అయ్యాయి కాబట్టి, జనవరిలోనే తాను కార్లు పొందినట్లు భావించి సంబంధిత ఐటీసీ జనవరి నెల రిటర్న్‌లో తీసుకోవాలా ? ఇలాంటి గందరగోళం ఎక్స్ వర్క్స్ లావాదేవీల్లో ఉండేది.

స్పష్టతనిచ్చిన ప్రభుత్వం

ఈ గందరగోళాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇటీవల ఒక సర్క్యులర్ జారీ చేసింది. దీని ప్రకారం, వస్తువులను రిసీవ్ చేసుకోవటం అంటే భౌతికంగా వస్తువులను పొంది ఉండాల్సిన అవసరం లేదు. ఎక్స్ వర్క్స్ ప్రాతిపదికన వస్తువులను కొనుగోలు చేసినప్పుడు.. ఆ వస్తువుల మీద సర్వ హక్కులు కొనుగోలుదారునికి ఫ్యాక్టరీ గేటు దగ్గరే సంక్రమిస్తాయి. కాబట్టి ఆ క్షణమే అతను ఆ వస్తువులను రిసీవ్ చేసుకున్నట్లు భావించాలి. ఐటీసీకి సంబంధించిన ఇతర నియమ నిబంధనలు సరిగ్గా ఉన్నట్లయితే, పైన చెప్పిన ఉదాహరణలో కారు డీలర్ తాను కొనుగోలు చేసిన కార్ల తాలూకు క్రెడిట్ జనవరి నెల రిటర్నులోనే తీసుకోవచ్చు. ప్రభుత్వం ఇచ్చిన ఈ వివరణతో ఎక్స్ వర్క్స్ కాంట్రాక్టుల్లో ఐటీసీ తీసుకోవటానికి స్పష్టత లభించింది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	117	విజయవాడ	136
వరంగల్	117	గుంటూరు	135
కరీంనగర్	117	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	104
కర్నూలు	117	నెల్లూరు	109
విశాఖపట్నం	132	అనంతపురం	109
గోదావరి	136		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

19వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	510
వరంగల్	482	గోదావరి	503
చిత్తూరు	503	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	81,110 ▼	74,350 ▼	1,04,000 ▲
విజయవాడ	81,800 ▼	77,000 ▲	93,000 ▼
విశాఖపట్నం	79,340 ▲	72,730 ▲	91,660 ▼
రాజమండ్రి	84,110 ▼	74,350 ▼	94,600 ▲
ప్రొద్దుటూరు	80,300 ▼	74,360 ▼	93,000 ▼
ముంబై	79,239	72,583	90,820

స్పోర్ట్స్

స్వియటెక్, సిన్నర్ దూకుడు

- టేలర్, పోలిని పరాజయం
- ఆస్ట్రేలియన్ ఓపెన్

ప్రీ క్వార్టర్స్‌లో ప్రవేశం



స్వియటెక్

మెల్‌బోర్న్: ప్రపంచ నెం.1 సిన్నర్, రెండో సీడ్ స్వియటెక్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ముందంజవేశారు. అయితే పురుషులు, మహిళల విభాగంలో నాలుగో సీడ్‌లు టేలర్ ఫ్రిట్జ్, జాస్మిన్ పోలిని, 10వ సీడ్ డానిలి కొలిన్స్‌కు మూడో రౌండ్‌లో పరాజయం ఎదురైంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో..ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ స్వియటెక్ (పోలెండ్) 6-1, 6-0తో ఎమ్మా రదుకాను (బ్రిటన్)ను చిత్తు చేసి ప్రీక్వార్టర్స్‌కు చేరింది. టాప్ సీడ్ సిన్నర్ (ఇటలీ) 6-3, 6-4, 6-2తో గిరోన్ (అమెరికా)పై గెలిచి నాలుగో రౌండ్‌లోకి ప్రవేశించాడు. నాలుగో సీడ్ ఫ్రిట్జ్ (అమెరికా)కు 3-6, 7-5, 7-6 (1), 6-4తో మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్) షాకిచ్చాడు. దిగ్గజం రోజర్ ఫెదరర్ తర్వాత 38 అంతకుమించి ఏళ్ల వయస్సులో ఆస్ట్రేలియన్ ఓపెన్ నాలుగో రౌండ్‌కు చేరిన ఆటగాడిగా మోన్‌ఫిల్స్ రికార్డు నెలకొల్పాడు. 28వ సీడ్ స్విటోలినా (ఉక్రెయిన్) 2-6, 6-4, 6-0తో నాలుగో సీడ్ పోలిని (ఇటలీ)పై, 19వ సీడ్ కీస్ (అమెరికా) 6-4, 6-4తో తన దేశానికే చెందిన 10వ సీడ్ కొలిన్స్‌పై నెగ్గి ప్రీక్వార్టర్స్‌లో అడుగు పెట్టారు. ఆరో సీడ్ రిబకినా 6-3, 6-4తో యాస్ట్రెంస్కాపై, ఎనిమిదో సీడ్ ఎమ్మా నవారో 6-4, 3-6, 6-4తో జెబ్యూర్‌పై నెగ్గారు.పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో భారత ఆటగాడు బాలాజీ/రేయస్ వరేలా (మెక్సికో) 6-7 (7), 6-4, 3-6తో బోర్గెస్/కాబ్రల్ చేతిలో ఓడారు.

టైటిల్‌కు ఒకే అడుగు

- ఫైనల్లో భారత జట్లు
- నేడు నేపాల్‌తో పురుషులు, మహిళల ఢీ
- ఖోఖో వరల్డ్ కప్





న్యూఢిల్లీ: మొట్టమొదటి ఖోఖో ప్రపంచ కప్‌లో ఆతిథ్య భారత జట్లు టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచాయి. మహిళలు, పురుషుల విభాగాలలో మనోళ్లు ఫైనల్‌కు దూసుకుపోయారు. శనివారం జరిగిన మహిళల సెమీఫైనల్లో భారత్ 66-16 పాయింట్ల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. ఆదివారం జరిగే ఫైనల్లో నేపాల్‌తో భారత మహిళలు అమీతుమీ తేల్చుకుంటారు. మరో సెమీస్‌లో నేపాల్ 89-18 పాయింట్ల తేడాతో ఉగాండాపై గెలుపొందింది. హోరాహోరీగా సాగిన పురుషుల సెమీఫైనల్లో భారత్ 62-42 పాయింట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయంతో ఊపిరి పీల్చుకుంది. అటు అటాకింగ్, ఇటు డిఫెన్స్‌లో అద్భుత ప్రదర్శన చేసిన సఫారీలు ఓ దశలో భారత్‌కు షాకిచ్చేలా కనిపించారు. నాలుగో టర్న్‌లో జూలు విదిలిచ్చిన మనోళ్లు దక్షిణాఫ్రికాకు చెక్ పెట్టారు. ఫైనల్లో నేపాల్‌ను భారత పురుషులు ఎదుర్కొంటారు. రెండో సెమీస్‌లో నేపాల్ 72-20 పాయింట్ల తేడాతో ఇరాన్‌ను ఓడించింది.

గుకేష్ శుభారంభం

విక్ ఆన్ జీ (నెదర్లాండ్స్): వరల్డ్ చాంపియన్ డి.గుకేష్ టాటా స్టీల్ చెస్ మాస్టర్స్ విభాగంలో శుభారంభం చేశాడు. శనివారం ప్రారంభమైన ఈ పోటీల్లో తొలి గేమ్‌లో స్థానిక జీఎం అనీష్ గిరితో తలపడిన గుకేష్ 41వ ఎత్తులో అతడికి చెక్ చెప్పి, బోణీ కొట్టాడు. ఉజ్బెకిస్థాన్ జీఎం అబ్దుసట్టోరోవ్‌తో పోటీ పడిన ప్రజ్ఞానంద 46వ ఎత్తు దగ్గర డ్రా చేసుకున్నాడు. మరో భారత జీఎం లియోన్ లూక్ మెండోంకా 31 ఎత్తులో కీమెర్ చేతిలో పరాజయం పాలయ్యాడు.

చాంపియన్స్ సైన్యమిదే



బుమ్రా



జైస్వాల్

జైస్వాల్‌కు పిలుపు ● సిరాజ్‌పై వేటు

- షమి, శ్రేయా‌స్‌కు దక్కిన చోటు
- బుమ్రాకూ బెర్త్ ● వైస్ కెప్టెన్‌గా గిల్
- చాంపియన్స్ ట్రోఫీ భారత జట్టు



మహ్మద్ షమి

ముంబై: పాకిస్థాన్, దుబాయ్ వేదికలుగా ఫిబ్రవరి 19 నుంచి జరిగే ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే భారత వన్డే జట్టును ప్రకటించారు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ 15 మందితో కూడిన జట్టును శనివారం వెల్లడించింది. విలేకరుల సమావేశంలో అగార్కర్‌తో పాటు కెప్టెన్ రోహిత్ పాల్గొన్నాడు. ఈ జాబితాలో మార్పుచేర్పులకు వచ్చే నెల 13 వరకు గడువుంటుంది. మరోవైపు ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు సైతం ఇదే జట్టు కొనసాగనుంది. ఇక రోహిత్ నేతృత్వంలోని ఈ టీమ్‌లో ఊహించినట్టుగానే వెటరన్ పేసర్ మహ్మద్ షమికి చోటు దక్కింది. అలాగే దేశవాళీల్లో ఫామ్ చాటుకున్న మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ ఏడాది తర్వాత జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఓవరాల్‌గా జట్టులో ఐదుగురు స్పెషలిస్ట్ బ్యాటర్లు, ఇద్దరు కీపర్లు, నలుగురు ఆల్‌రౌండర్లు, నలుగురు బౌలర్లు ఉన్నారు.

బుమ్రాకు ఐదు వారాల విశ్రాంతి: ఆస్ట్రేలియా టూర్‌లో గాయపడిన స్టార్ పేసర్ బుమ్రాను కూడా జట్టులోకి తీసుకున్నారు. అతనికి ఐదు వారాల పాటు విశ్రాంతి అవసరమని, ఫిబ్రవరి మొదటి వారానికల్లా కోలుకోగలడని బోర్డు ఆశిస్తోంది. అయితే ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లకు తను సందేహమే కాబట్టి పేసర్ హర్షిత్ రాణాను బ్యాకప్ పేసర్‌గా తీసుకున్నారు.

జైస్వాల్‌కు చాన్స్: యశస్వీ జైస్వాల్ తొలిసారిగా భారత వన్డే జట్టులోకి వచ్చాడు. ఇప్పటిదాకా 23 టీ20, 19 టెస్టులు ఆడినా 50 ఓవర్ల మ్యాచ్ ఆడలేదు. అయితే రెండు ఫార్మాట్లలో అతడి భీకర ఫామ్‌ను పరిగణనలోకి తీసుకుని జట్టు రిజర్వ్ ఓపెనర్‌గా ఎంపిక చేశారు. ఇక వికెట్ కీపర్లుగా పంత్, రాహుల్ వ్యవహరించనున్నారు. అలాగే విజయ్ హజారే ట్రోఫీలో ఏడు మ్యాచ్‌ల్లో ఐదు శతకాలు, 779 రన్స్‌తో అదరగొట్టిన కరుణ్ నాయర్‌ను సెలెక్టర్లు పట్టించుకోలేదు.

పేస్ ఆల్‌రౌండర్ ఒక్కడే..: హార్దిక్, జడేజా, అక్షర్, సుందర్‌ల రూపంలో నలుగురు ఆల్‌రౌండర్లున్నారు. అయితే వీరిలో పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ ఒక్కడే. ఒకవేళ తను గాయపడితే బ్యాకప్ ప్లేయర్ లేడు. తెలుగు క్రికెటర్ నితీశ్ కుమార్‌కు చాన్స్ ఇచ్చి ఉంటే బావుండేదన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.

భారత జట్టు

రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, యశస్వీ జైస్వాల్, కోహ్లీ, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, శ్రేయాస్ అయ్యర్, హార్దిక్ పాండ్యా, జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్, బుమ్రా, మహ్మద్ షమి, అర్ష్‌దీప్ సింగ్.

సిరాజ్‌పై వేటెందుకు?

ఇటీవలి కాలంలో భారత జట్టుకు రెగ్యులర్‌గా ఆడుతున్న హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ సెలెక్టర్ల నమ్మకం కోల్పోయాడు. ఆసీస్ టూర్‌లో తను అంచనాలను అందుకోలేకపోయాడు. దీంతో అతడి స్థానంలో అర్ష్‌దీప్ సింగ్‌ను తీసుకున్నారు. 'బుమ్రా ఆడే విషయంలో స్పష్టత లేదు కాబట్టి మాకు కొత్త బంతితో ప్రభావం చూపి, డెత్ ఓవర్లలోనూ ఆకట్టుకునే బౌలర్ అవసరం. అందుకే మేం అర్ష్‌దీప్‌ను తీసుకున్నాం. దురదృష్టవశాత్తూ సిరాజ్‌కు చోటు దక్కలేదు. ఎందుకంటే తను కొత్త బంతితో ఆకట్టుకోలేకపోతున్నాడు' అని కెప్టెన్ రోహిత్ స్పష్టం చేశాడు.

గిల్ మరోసారి

ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్, చాంపియన్స్ ట్రోఫీకి కూడా శుభ్‌మన్ గిల్ వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. గతంలో శ్రీలంక పర్యటనలోనూ అతను వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. దీంతో గిల్‌ను పరిమిత ఓవర్లలో భవిష్యత్ కెప్టెన్‌గా సెలెక్టర్లు పరిగణిస్తున్నట్టు విశ్లేషిస్తున్నారు. గతంలో జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు

రంజీల్లో ఆడుతున్నా..



ముంబై: భారత కెప్టెన్ రోహిత్ శర్మ ముంబై జట్టు తరపున రంజీ ట్రోఫీలో ఆడనున్నాడు. ఈనెల 23 నుంచి జమ్మూ కశ్మీర్‌తో జరిగే మ్యాచ్‌లో తాను బరిలోకి దిగనున్నట్టు రోహిత్ తెలిపాడు. 2015 నవంబరులో హిట్‌మ్యాన్ చివరి రంజీ ఆడాడు. భారత ఆటగాళ్ల ఆసీస్ పర్యటనలో విఫలం కావడంతో బీసీసీఐ పలు మార్పులు చేపట్టింది. ఇందులో భాగంగా అందుబాటులో ఉండే ఆటగాళ్లంతా దేశవాళీల్లో ఆడాల్సిందేనని తేల్చింది. ఆసీస్ టూర్‌లో రోహిత్ నాలుగు టెస్టుల్లో 31 పరుగులే చేసి విమర్శల పాలయ్యాడు. అయితే ఎవరూ కావాలని రంజీలకు దూరంగా ఉండరని, తమ బిజీ షెడ్యూల్ కారణంగా తగిన విశ్రాంతిని కోరుకుంటామని రోహిత్ వివరించాడు.



కర్ణాటక పాంచ్ పటాకా

- ఐదోసారి విజయ్ హజారే టైటిల్
- ఫైనల్లో విదర్భ చిత్తు

వడోదర: టోర్నీ ఆసాంతం అదరగొట్టిన కర్ణాటక ఫైనల్లోనూ అదే జోరును కనబరచి విజయ్ హజారే ట్రోఫీని కైవసం చేసుకుంది. రవిచంద్రన్ స్మరణ్ (92 బంతుల్లో 101) శతకంతో కదం తొక్కడంతో శనివారం జరిగిన ఫైనల్లో మయాంక్ అగర్వాల్ సారథ్యంలోని కర్ణాటక 36 పరుగులతో విదర్భపై నెగ్గింది. తొలుత కర్ణాటక 50 ఓవర్లలో 348/6 స్కోరు చేసింది. అభినవ్ (79), శ్రీజిత్ (78) సత్తా చాటారు. ఛేదనలో విదర్భ 48.2 ఓవర్లలో 312 పరుగులకు ఆలౌటైంది. ధ్రువ్ షోరే (110) సెంచరీతో పోరాడాడు. చివర్లో దూబే (63) ఆశలు రేపాడు. అయితే అభిలాష్ అతడిని అవుట్ చేసి కర్ణాటకకు ఊరట నిచ్చాడు.

సంక్షిప్తస్కోర్లు: కర్ణాటక: 50 ఓవర్లలో 348/6 (స్మరణ్ 101, అభినవ్ 79, కృష్ణన్ 78, దర్శన్ 2/67, నచికేత్ 2/70); **విదర్భ:** 50 ఓవర్లలో 312 ఆలౌట్ (ధ్రువ్ 110, దూబే 63, కౌశిక్ 3/47, అభిలాష్ 3/58, ప్రసిద్ధ్ 3/84).

పాక్‌కు ఆధిక్యం

విండీస్‌తో తొలి టెస్టు

ముల్తాన్: పాకిస్థాన్-వెస్టిండీస్ జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టులో స్పిన్నర్లు కదం తొక్కారు. రెండో రోజు శనివారం ఆటలో ఇరు జట్ల నుంచి ఏకంగా 19 వికెట్లు నేలకూలడం విశేషం. పాక్ గడ్డపై టెస్టుల్లో ఒకే రోజు ఇన్ని వికెట్లు పడడం ఇదే తొలిసారి. ముందుగా పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 230 పరుగులకు ఆలౌటైంది. సాద్ షకీల్ (84), రిజ్వాన్ (71) మాత్రమే రాణించారు. ఆ తర్వాత విండీస్ తొలి ఇన్నింగ్స్ 137 పరుగులకే ముగిసింది. స్పిన్నర్లు నోమన్ అలీ (5/39), సాజిద్ ఖాన్ (4/65) వణికించారు. ఆట ముగిసే సమయానికి పాక్ రెండో ఇన్నింగ్స్‌లో 109/3 స్కోరుతో నిలిచింది. ప్రస్తుతం జట్టు 202 పరుగుల ఆధిక్యంలో ఉంది.

సాత్విక్ జోడీకి నిరాశ

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ సూపర్ 750 టోర్నీలో భారత స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టికి నిరాశే మిగిలింది. శనివారం జరిగిన డబుల్స్ సెమీఫైనల్స్‌లో సాత్విక్-చిరాగ్ జంట 18-21, 14-21తో నూర్ ఇజ్జుద్దీన్-గోహ్ సే ఫీ (మలేసియా) చేతిలో పోరాడి ఓడింది. 2022లో ఈ ట్రోఫీ నెగ్గిన సాత్విక్ జోడీ ఈసారి టైటిలే లక్ష్యంగా బరిలోకి దిగింది. అయితే నూర్-గోహ్ ద్వయం వారి ఆశలకు గండికొట్టింది.

ఆసీస్, దక్షిణాఫ్రికా శుభారంభం

అండర్-19 టీ20 ప్రపంచ కప్

కౌలాలంపూర్: అండర్-19 మహిళల టీ20 వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ శుభారంభం చేశాయి. స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా తొమ్మిది వికెట్లతో నెగ్గింది. తొలుత స్కాట్లాండ్ 15.1 ఓవర్లలో 48 పరుగులకే కుప్పకూలగా, లక్ష్యాన్ని ఆసీస్ జట్టు 6.4 ఓవర్లలో పూర్తి చేసింది. ఇంకో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 22 పరుగులతో న్యూజిలాండ్‌ను ఓడించింది. మరో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టు నేపాల్‌పై నెగ్గింది. ఇంగ్లండ్-ఐర్లాండ్ మ్యాచ్ వర్షంతో అర్ధంతరంగా ముగిసింది. ఇక నైజీరియా-సమోవా, పాకిస్థాన్-అమెరికా మ్యాచ్‌లు ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయ్యాయి.

పాత బస్తీలో 'మెట్రో' కూల్చివేతలు షురూ!

» మరోసారి భూసామర్థ్య పరీక్షలకు చర్యలు

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పాత బస్తీ మెట్రో నిర్మాణానికి సంబంధించిన కూల్చివేతలు ప్రారంభమయ్యాయి. ఆస్తుల సేకరణలో భాగంగా ఇటీవల చెక్కులు అందజేసిన నిర్వాసితుల ఇళ్లను తొలగిస్తున్నారు. కారిడార్‌లోని దారుల్‌షిఫా నుంచి మీరాలంమండి వరకు నిర్మాణాలను తొలగిస్తూ శిథిలాలను తరలిస్తున్నారు. మొత్తం 1100 మందిలో ఇప్పటివరకు 260 మంది అనుమతి పత్రాలు అందజేశామని, ఇందులో 50 మందికి ఇటీవల చెక్కులు పంపిణీ చేశామని అధికారులు చెబుతున్నారు. ఫిబ్రవరి 20లోపు 1100 మందికి చెక్కులు అందజేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. నిర్వాసితులందరికీ చెక్కులు పంపిణీ చేస్తే మార్చి 1 నుంచి నిర్మాణ పనులను ప్రారంభించేందుకు హెచ్‌ఏఎంఎల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట వరకు చేపడుతున్న కారిడార్ నిర్మాణంలో భాగంగా హెచ్‌ఏఎంఎల్ అధికారులు మరోసారి భూసామర్థ్య పరీక్షలు చేపట్టారు.

మెరుగైన సేవలందించే దిశగా పోలీసులు

» శాఖ ప్రతిష్ఠను పెంచేలా కార్యక్రమం: డీజీపీ జితేందర్

హైదరాబాద్, జనవరి18(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పోలీసులు మరింత మెరుగైన సేవలందించేలా తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ వినూత్న శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శనివారం డీజీపీ కార్యాలయంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీసు అధికారులతో ఆయన సమావేశమయ్యారు. పోలీసు విభాగాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడం, శాఖ ప్రతిష్ఠను పెంపొందించేలా ప్రవర్తన ఉండటం, మహిళల భద్రత, సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకోకుండా ఉండటం తదితర అంశాలపై పోలీసు సిబ్బందికి సూచనలిచ్చారు. ప్రతి జిల్లా నుంచి కొంతమంది పోలీసులను ఎంపిక చేసి నూతన లక్ష్యాలపై శిక్షణ ఇవ్వడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

ధన్గర్ కులాన్ని బీసీ జాబితాలో చేర్చాలి

» బీసీ కులాల పేర్ల మార్పుపై ఫిర్యాదుల స్వీకరణ

హైదరాబాద్, జనవరి18 (ఆంధ్రజ్యోతి): పశుపోషణ, గొర్రెలు, మేకల పెంపకం కులవృత్తిగా ఉన్న ధన్గర్ కులాన్ని బీసీ జాబితాలో చేర్చాలని తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్‌కు ఆ కులం ప్రతినిధుల బృందం వినతి పత్రం సమర్పించింది. ఇటు 'బూంజువ' కులం విషయంలో జిల్లాల పరిమితులను ఎత్తివేయాలని ఆ కులం ప్రతినిధులు కోరారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే బూంజువ కులాలకు కులం సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని.. ఇతర జిల్లాల్లో ఇచ్చేలా చూడాలని బీసీ కమిషన్‌కు విన్నవించారు. జనవరి 3న బీసీ వర్గాల్లోని 8 కులాలకు పేర్ల మార్పులు, పర్యాయపదాలు జోడించాలనే అభ్యర్థనపై జారీ చేసిన నోటిఫికేషన్ గడువు ముగింపు సందర్భంగా అభ్యంతరాలు, ఫిర్యాదులను బీసీ కమిషన్ స్వీకరించింది.

ప్రజోపయోగ ప్రాజెక్టులకు సత్వర అనుమతులు

» కేంద్ర అటవీ శాఖ డైరెక్టర్ జనరల్ జితేంద్ర కుమార్

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజోపయోగ ప్రాజెక్టులకు సత్వరమే అనుమతులు మంజూరు చేస్తామని కేంద్ర అటవీ శాఖ డైరెక్టర్ జనరల్ జితేంద్ర కుమార్ తెలిపారు. తెలంగాణలో ఉన్న అటవీ అనుమతుల పెండింగ్ విషయంపై జితేంద్ర కుమార్, పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియల్ అధ్యక్షతన అత్యున్నత సమావేశం అరణ్య భవన్‌లో శనివారం జరిగింది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసి రాష్ట్రంలో అటవీ శాఖలో పెండింగులో ఉన్న వివిధ ప్రాజెక్టులపై చర్చించారు. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి అందుకు అనుగుణంగా జితేంద్ర కుమార్‌ను రాష్ట్ర అధికారులతో చర్చించేందుకు హైదరాబాద్ పంపించారు. పెండింగ్ ప్రాజెక్టులు, కారణాలు, ఇతర అంశాలపై జితేంద్ర కుమార్.. అటవీ, రోడ్లు భవనాలు, జాతీయ రహదారుల విభాగం అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం 161 ప్రాజెక్టులు అనుమతుల కోసం పెండింగులో ఉన్నాయని ఈ సందర్భంగా డోబ్రియల్ ఆయనకు వివరించారు. అంతకుముందు దక్షిణాది రాష్ట్రాల అటవీ అధికారులతో సమావేశమైన జితేంద్ర కుమార్.. 'ఏక్ పేడ్ మా కే నామ్' (తల్లి పేరుతో మొక్క నాటడం), నగర వన్ యోజన పథకాలపై ఆయన చర్చించారు.

ముదిరాజ్ కార్పొరేషన్‌కు 2 వేల కోట్లు ఇవ్వాలి

» జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధిక జనాభా ఉన్న ముదిరాజులలోనే అత్యధిక పేదరికం తాండవిస్తోందని, ముదిరాజుల అభ్యున్నతి కోసం ఏర్పాటుచేసిన కార్పొరేషన్‌కు రూ.2 వేల కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. తెలంగాణలోని ముదిరాజ్‌ల చైతన్యమే లక్ష్యంగా 'ముదిరాజు ప్రజా చైతన్య బస్సు యాత్ర'ను శనివారం హైదరాబాద్ గన్‌పార్క్ నుంచి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొదటి విడత కింద 5 జిల్లాల్లో పర్యటన ఉంటుందని, ఆ తరువాత రెండో విడతలో మిగిలిన జిల్లాల్లో యాత్ర చేస్తానని కుమారస్వామి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బ్యాంకుల్లో భద్రతా ఏర్పాట్లు పెరగాలి..

» సీసీ కెమెరాలతోపాటు నిపుణులైన సెక్యూరిటీని నియమించుకోవాలి: రాచకొండ సీపీ సుధీర్‌బాబు



హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులు తమ భద్రత ఏర్పాట్లను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని రాచకొండ సీపీ సుధీర్ బాబు సూచించారు. దేశంలో ఏటీఎం, బ్యాంకు దోపిడీ ఘటనలు వెలుగుచూస్తున్న నేపథ్యంలో నేర నివారణ చర్యల్లో భాగంగా కమిషనరేట్‌లో శనివారం బ్యాంకుల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. బ్యాంకుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, నిపుణులైన సెక్యూరిటీ సిబ్బంది నియామకంతోపాటు సైబర్ నేరాలను అడ్డుకునేందుకు ఎప్పటికప్పుడు సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఇటీవల రాయపర్తి, బీదర్, మంగళూరులో బ్యాంకు, ఏటీఎం దోపిడీ ఘటనలను పరిశీలిస్తే బ్యాంకుల్లో భద్రతా లోపాలు బయటపడ్డాయని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఉన్న 489 బ్యాంకుల్లో ఉన్న భద్రతా ఏర్పాట్లను పోలీసు అధికారులు పరిశీలించారన్నారు. పలు లోపాలను గుర్తించి ఆయా బ్యాంకు శాఖల వద్ద ఏర్పాట్ల గురించి సీపీ సదరు బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.


ప్రాజెక్టులకు అత్యవసర ప్రణాళిక రూపొందించాలి: ఈఎన్‌సీ అనిల్‌కుమార్

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ప్రాజెక్టుకు జాతీయ ఆనకట్టల భద్రత చట్టం(ఎన్‌డీఎస్‌ఏ), కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యవసర చర్యల ప్రణాళికను రూపొందించాలని డ్యామ్ భద్రత రాష్ట్ర కమిటీ ఛైర్మన్, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నిర్ణీత వ్యవధిలోగా ఈ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ప్రాజెక్టుల వరద గేట్లతోపాటు రెగ్యులేటరీ గేట్లను వెంటనే మరమ్మతు చేయాలని కోరారు. నిబంధనల ప్రకారం అన్ని మరమ్మతులు చేపట్టాలని నిర్దేశించారు. అన్ని కట్టల వద్ద వరద సజావుగా వెళ్లడానికి వీలుగా ఆక్రమణలు ఉంటే తొలగించాలని నిర్దేశించారు. ఇందుకు జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ శాఖ సహకారం తీసుకోవాలన్నారు. 10 వేల ఎకరాలకు పైగా నీటిని అందించే కాలువలను తొలి విడతలో మరమ్మతు చేయాలన్నారు. వానాకాలంలోపు పనులు పూర్తికావాలన్నారు. కాలువల గట్లపై వన మహోత్సవంలో మొక్కలు నాటాలని సూచించారు.

మహా.. హైదరాబాద్!

హెచ్‌ఎండీఏ విస్తరణను ప్రతిపాదిస్తూ రూపొందించిన మ్యాప్

- మ్యాప్‌లో బ్లూ లైన్‌తో సూచిస్తున్నది ప్రస్తుతం హెచ్‌ఎండీఏ విస్తరించి ఉన్న పరిధి
- రెడ్ లైన్‌లో సూచిస్తున్నది త్వరలో నిర్మాణం జరుపుకోనున్న రీజనల్ రింగ్ రోడ్డు
- రెడ్ లైన్ బయట ఉన్న ప్రదేశం హెచ్‌ఎండీఏ విస్తరించనున్న ప్రతిపాదిత పరిధి.



ప్రత్యేకం ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి కోసం 50 ఏళ్ల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హుడా)ని 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఏర్పాటు చేశారు. అనంతరం నగర విస్తరణకు అనుగుణంగా 2008లో హుడాను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ)గా మార్పు చేస్తూ అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాంతో హెచ్‌ఎండీఏ పరిధి 7,257 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. అందులో హైదరాబాద్ జిల్లాతోపాటు ఉమ్మడి జిల్లాలైన రంగారెడ్డి, మెదక్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. కాగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక జిల్లాల పునర్విభజనతో హెచ్‌ఎండీఏ పరిధి పెరగకపోయినా.. ఐదు జిల్లాలు ఏడు జిల్లాలుగా మారాయి. వీటిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలున్నాయి. ఇక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న షాద్‌నగర్.. రంగారెడ్డి జిల్లాలోకి రావడంతో మహబూబ్‌నగర్ జిల్లా హెచ్‌ఎండీఏలో లేకుండా పోయింది. దీంతో ప్రస్తుత హెచ్‌ఎండీఏ పరిధి.. ఏడు జిల్లాలు, 74 మండలాలు, సుమారు వెయ్యి గ్రామపంచాయతీలు, ఎనిమిది కార్పొరేషన్లు, 38కి పైగా మునిసిపాలిటీలతో కూడి ఉంది.

ఆర్‌ఆర్‌ఆర్ అవతల ఐదు కిలోమీటర్ల వరకు..

హెచ్‌ఎండీఏ పరిధిలో మెరుగైన అభివృద్ధి కోసం ఉమ్మడి రాష్ట్రంలో 2013లో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్-2031ని తీసుకొచ్చారు. ఆ సందర్భంలోనే రీజినల్ రింగ్ రోడ్డును ప్రతిపాదిస్తూ మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచారు. అప్పటి అంచనాలకు అనుగుణంగా ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్)ను హద్దుగా చేసుకొని హైదరాబాద్‌ను విస్తరించడంతోపాటు హెచ్‌ఎండీఏ పరిధిలో చేపట్టాల్సిన రీజినల్ రింగ్ రోడ్డును కొన్ని ప్రాంతాల్లో ఆ పరిధిని దాటేస్తూ నిర్ణయించారు. ఇప్పటికే ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగానికి అలైన్‌మెంట్ కూడా ఖరారయింది. త్వరలోనే దక్షిణ భాగానికీ ఖరారు చేసే అవకాశాలున్నాయి. దీంతో హెచ్‌ఎండీఏ పరిధిని సైతం ఆర్‌ఆర్‌ఆర్‌పాటు అవతల 5కిలోమీటర్ల వరకు పెంచాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. ఆర్‌ఆర్‌ఆర్‌కు ఇరువైపులా అభివృద్ధి వేగంగా జరిగే అవకాశాలుండడంతో.. ఆ రోడ్డుకు అవతల కూడా పరిధిని పెంచుతున్నారు. దీంతో ఈ పరిధి 12-13 వేల చదరపు కిలోమీటర్లకు పెరిగే అవకాశాలున్నాయి. దీని పరిధిలోని ఏడు జిల్లాలు 11కు పెరగనున్నాయి. కొత్తగా నాలుగు జిల్లాలు నల్లగొండ, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ చేరనున్నాయి. హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలు ఇప్పటికే పూర్తిగా ఉండగా.. తాజాగా రంగారెడ్డి జిల్లా పూర్తిగా రానుంది. ఇక యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి జిల్లాలో అత్యధిక మండలాలు రానున్నాయి. హెచ్‌ఎండీఏ పరిధిలో వస్తుతమున్న 74 మండలాలకు అదనంగా మరో 32 మండలాలు చేరి 106 మండలాలు కానున్నాయి. జీహెచ్‌ఎంసీ, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌తోపాటు ఏడు మునిసిపల్ కార్పొరేషన్లు, 34 మునిసిపాలిటీలతో కలిపి మొత్తం 43 అర్బన్ స్థానిక సంస్థలు ఉండనున్నాయి.

కోర్ అర్బన్, సెమీ అర్బన్ ఏరియాలుగా

హెచ్‌ఎండీఏ పరిధిని విస్తరించేందుకు సూత్రప్రాయంగా నిర్ణయించిన ప్రభుత్వం.. జీహెచ్‌ఎంసీ పరిధిని కూడా ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించనుంది. దాదాపు 2వేల చదరపు కిలోమీటర్ల వరకు జీహెచ్‌ఎంసీ పరిధి పెరగనుంది. ఈ పరిధిలో జీహెచ్‌ఎంసీతోపాటు 33 గ్రామ పంచాయతీలు, 27 మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు ఉండగా వాటన్నింటినీ కోర్ అర్బన్ ఏరియాగా నిర్ధారించి అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇక ఓఆర్‌ఆర్ నుంచి ఆర్‌ఆర్‌ఆర్ మధ్య ప్రాంతాన్ని సెమీ అర్బన్ ఏరియాగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాంతంలో ఆర్‌ఆర్‌ఆర్‌కు ఆవల 5కిలోమీటర్ల వరకు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించే బాధ్యతలను కూడా హెచ్‌ఎండీఏకు అప్పగించారు. ఈలోపు హెచ్‌ఎండీఏ పరిధిని విస్తరిస్తూ బోర్డు సమావేశం జరపడంతోపాటు క్యాబినెట్‌లో చర్చించి.. అవసరమైతే అసెంబ్లీలో బిల్లును కూడా పెట్టే అవకాశాలున్నాయి.

హెచ్‌ఎండీఏలో కొత్తగా చేరే మండలాలు..

- రంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే 22 మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలో ఉండగా.. కొత్తగా మరో ఐదు మండలాలు తలకొండపల్లి, ఆమనగల్లు, మాడుగుల, కడ్తాల్, కేశంపేట చేరనున్నాయి. దీంతో రంగారెడ్డి జిల్లాలోని మొత్తం 27 మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలోకే రానున్నాయి.
- సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే 8మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలో ఉండగా.. కొత్తగా మరో మూడు మండలాలు చౌటకూర్, కొండాపూర్, సదాశివపేట రానున్నాయి.
- సిద్దిపేట జిల్లాలో ఇప్పటికే మూడు మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలో ఉండగా.. కొత్తగా మరో మూడు మండలాలు గజ్వేల్, జగదేవ్‌పూర్, రాయపోల్ చేరనున్నాయి.
- మెదక్ జిల్లాలో ఇప్పటికే ఐదు మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలో ఉండగా.. కొత్తగా మాసాయిపేట మండలం చేరనుంది.
- యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇప్పటికే ఐదు మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలో ఉండగా.. కొత్తగా మరో ఐదు మండలాలు సంస్థాన్ నారాయణపురం, వలిగొండ, రాజపేట, యాదగిరిగుట్ట, తుర్కపల్లి చేరనున్నాయి.

కొత్తగా చేరే జిల్లాల్లోని మండలాలు..

- వికారాబాద్ జిల్లా హెచ్‌ఎండీఏ పరిధిలో కొత్తగా చేరనుండగా.. ఇందులో ఐదు మండలాలు మాత్రమే రానున్నాయి. మోమిన్‌పేట, నవాబ్‌పేట, పరిగి, పూడూరు, వికారాబాద్ మండలాలు కొత్తగా హెచ్‌ఎండీఏ పరిధిలోకి రానుండగా.. అందులోనూ కొన్ని గ్రామాలే ఉంటాయి.
- నల్లగొండ జిల్లా హెచ్‌ఎండీఏ పరిధిలో కొత్తగా చేరనుండగా.. ఇందులో కేవలం 6మండలాలు మాత్రమే రానున్నాయి. వీటిలోనూ గట్టుప్పల్ మండలం మినహా చండూరు, చింతపల్లి, మర్రిగూడ, మునుగోడు, నాంపల్లి మండలాల్లో కొన్ని గ్రామాలు రానున్నాయి.
- మహబూబ్‌నగర్ జిల్లా హెచ్‌ఎండీఏ పరిధిలో కొత్తగా చేరనుండగా.. ఇందులో కేవలం మూడు మండలాలు నవాబ్‌పేట, బాలానగర్, రాజాపూర్‌లలోని కొన్ని గ్రామాలు మాత్రమే రానున్నాయి.
- నాగర్‌కర్నూల్ జిల్లా హెచ్‌ఎండీఏ పరిధిలో కొత్తగా చేరనుండగా.. ఇందులో కేవలం వెల్దండ మండలంలోని మూడు గ్రామాలే రానున్నాయి.

ఢిల్లీలో రేవంత్‌ది అబద్ధాల ప్రచారం

» ముందు చిరుద్యోగులకు జీతాలివ్వండి: హరీశ్ రావు

» రేషన్ కార్డుల జారీలో నిబంధనలు సవరించాలని సీఎంకు లేఖ

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి అక్కడి ప్రజలను అబద్ధాలతో నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణలో ఇచ్చిన హామీలను అమలు చేశామని చెబుతున్నారని, ముందుగా చిరుద్యోగులకు జీతాలు చెల్లించాలని శనివారం ఒక ప్రకటనలో ఆయన డిమాండ్ చశారు. కాంగ్రెస్ పాలనలో చిరుద్యోగుల పరిస్థితి దారుణంగా మారిందని, జీతాల కోసం రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొందన్నారు. 4 నెలలుగా పంచాయతీ కార్మికులు, 3 నెలలుగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లేదని పేర్కొన్నారు. అలాగే మునిసిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు నెల రోజుల జీతం బకాయి పడ్డారని, ఇంట్లో అన్ని సమస్యలు పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పెట్టుబడుల కోసమంటూ పర్యటనలతో కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. కుర్చీని కాపాడుకోవడానికి ఢిల్లీ వెళ్లి చక్కర్లు కొట్టడం మాని చిరుద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతో లక్షలాది మంది లబ్ధిదారులు నష్టపోతున్నారని, నిబంధనలు సవరించాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగలేఖ రాశారు.

ప్రభుత్వ విధానాల వల్లే రైతు ఆత్మహత్యలు

» హామీల అమలుకు కొట్లాడుదాం: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): 'పంట ఉత్పత్తుల్లో అగ్రగామిగా ఉన్న తెలంగాణ ఈ రోజు రైతు ఆత్మహత్యల్లో ప్రథమ స్థానంలో ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలే ఇందుకు కారణం' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన రైతు జాదవ్ నాగోరావ్ ఐసీఐసీఐ బ్యాంకు శాఖకు వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం పట్ల శనివారం ఓ ప్రకటనలో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వం చేసిన హత్య అని ఆరోపించారు. రుణమాఫీ చేయకుండా తప్పించుకునేందుకు సర్కారు ప్రయత్నిస్తుండటమే రైతుల ఆత్మహత్యలకు కారణమన్నారు. అధికారంలోకి రాగానే 2 లక్షల రుణమాఫీ చేస్తానన్న సీఎం రేవంత్ మాట తప్పడంతోనే నాగోరావ్ బలయ్యారన్నారు. ఈ ప్రభుత్వంపై హత్యానేరం కింద కేసు నమోదు చేయాలని, రైతు కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీద్దామని, హామీలు అమలయ్యేవరకు కొట్లాడుదామని, రైతులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని కోరారు.

బీఆర్‌ఎస్‌కు 41కోట్లు ఎందుకిచ్చారు?

(మొదటిపేజీ తరువాయి)

ఏసీబీ అధికారులు పలు ప్రశ్నలు సంధించారు. క్రీడల్లో ఏమాత్రం అనుభవం లేని మీ కంపెనీ ఇందులోకి ఎందుకు దిగింది? ఎవరు మిమ్మల్ని ఆహ్వానించారు? మీకే విధమైన హామీలిచ్చారు? ఒప్పందానికి ముందే బీఆర్‌ఎస్‌కు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.41 కోట్ల మొత్తం ఎందుకిచ్చారు? రేసు ద్వారా మీ కంపెనీకి లాభం వచ్చిందా? నష్టం వచ్చిందా? ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ రెండో సెషన్ పూర్తి చేయకుండానే ఎందుకు వైదొలిగారు? తదితర ప్రశ్నలు అడిగారు. మాజీమంత్రి కేటీఆర్‌తో ఉన్న సాన్నిహిత్యానికి సంబంధించి కూడా ప్రశ్నించినట్లు తెలిసింది. 'ఫార్ములా-ఈ కారు రేసులో ప్రమోటర్‌గా ఉండబోతున్న విషయం మీకు ఎప్పుడు తెలిసింది? మిమ్మల్ని ప్రమోటర్‌గా ఆహ్వానించింది కేటీఆరేనా? ప్రమోటర్‌గా అవకాశం లభించనున్న సంగతి తెలిసే.. రేసు ప్రారంభం అవడానికి ముందు ఏస్ నెక్స్‌జెన్, ఏస్ రేస్ కంపెనీలను ప్రారంభించారా? అప్పట్లో మీకు, రాష్ట్ర పురపాలకశాఖకు, అప్పటి మంత్రి కేటీఆర్‌కు మధ్య జరిగిన సంభాషణలేవిటి?' అంటూ అనిల్ కుమార్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

మళ్లీ విచారణకు పిలుస్తాం!

రేసు మొదటి సెషన్‌కు సంబంధించి 'ఫార్ములా ఈ ఆపరేషన్స్' (ఎఫ్‌ఈఓ) కంపెనీకి చెల్లించాల్సిన రూ.90 కోట్ల ఫీజును ఏస్ అర్బన్ డెవలపర్స్ నుంచి రుణం రూపంలో ఎందుకు తీసుకున్నారనే కోణంలోనూ ఏసీబీ విచారణ కొనసాగినట్లు సమాచారం. ఏస్ అర్బన్ డెవలపర్స్ కంపెనీ ఏస్ నెక్స్‌జెన్, ఏస్ రేస్ కంపెనీల అనుబంధ సంస్థనే కావటం గమనార్హం. కాగా, విచారణకు సమయం తక్కువగా ఉండటంతో మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని, మళ్లీ నోటీసు ఇస్తామని ఏసీబీ అధికారులు అనిల్ కుమార్ బృందానికి తెలిపినట్లు సమాచారం. అధికారుల ప్రశ్నలకు అనిల్ కుమార్ సమాధానమిస్తూ.. అప్పట్లో ఏం జరిగిందనే సంగతిని వివరంగా వెల్లడించినట్లు తెలిసింది. ఎలక్టోరల్ బాండ్లను అన్ని రాజకీయపార్టీలకు ఇచ్చినట్లే బీఆర్‌ఎస్‌కు ఇచ్చామని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. తమ కంపెనీ చట్టపరంగా ఒప్పందం చేసుకుందని, నష్టం రావడంతో రెండో సెషన్ నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని, నాటి అధికారులకు, మంత్రికి చెప్పిన తర్వాతే తప్పుకొన్నామని అనిల్ వెల్లడించారు.

ఆలస్యంగా మొదలైన విచారణ


వాస్తవానికి ఏస్ నెక్స్‌జెన్ కంపెనీ ప్రతినిధులు ఉదయం పదిన్నరకు ఏసీబీ కార్యాలయంలో హాజరు కావాల్సి ఉండగా, తమ విమానం ఆలస్యం అయ్యిందని, తమకు కొంత సమయం ఇవ్వాలని వారు ఏసీబీని కోరారు. దీంతో మధ్యాహ్నం తర్వాత విచారణకు రావచ్చని ఏసీబీ అధికారులు సూచించడంతో మధ్యాహ్నం రెండున్నరకు ఏస్ నెక్స్‌జెన్ ఎండీ చలమలశెట్టి అనిల్‌కుమార్‌తో పాటు మరికొందరు ప్రతినిధులు ఏసీబీ కార్యాలయానికి వచ్చారు. మూడున్నర గంటల పాటు విచారణ కొనసాగింది.

ఇవీ ఆరోపణలు..

హైదరాబాద్‌లో నాలుగు సెషన్లలో ఫార్ములా-ఈ కారు రేసు నిర్వహించడం కోసం రాష్ట్ర పురపాలకశాఖ, ఎఫ్‌ఈఓ, ఏస్ నెక్స్‌జెన్ మధ్య 2022 అక్టోబరు 25న త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం ఏస్ నెక్స్‌జెన్ ప్రమోటర్‌గా ఉంటూ 9, 10, 11, 12 సెషన్లకు సంబంధించిన ఫీజును ఎఫ్‌ఈఓకు వాయిదాల రూపంలో చెల్లించాలి. బ్రిటన్‌కు చెందిన ఏఫ్‌ఈఓతో అప్పటి పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ తొలిదఫా చర్చలు జరిపిన తర్వాత.. హఠాత్తుగా ఏస్ నెక్స్‌జెన్, ఏస్ రేస్ కంపెనీలను 2022 జూలైలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ కంపెనీల రిజిస్ట్రేషన్‌కు 15 రోజుల ముందే ఏస్ నెక్స్‌జెన్, ఏస్ రేస్ కంపెనీల మాతృసంస్థ గ్రీన్‌కో నుంచి రూ.10 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు బీఆర్‌ఎస్‌కు అందాయి. దానికి రెండు నెలల ముందు కూడా గ్రీన్‌కో నుంచే బీఆర్‌ఎస్‌కు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.31 కోట్లు లభించాయి. 9వ సెషన్ పూర్తయిన తర్వాత పదో సెషన్ ప్రారంభానికి ముందే ఏస్ నెక్స్‌జెన్ ఒప్పందం నుంచి వైదొలిగింది. కేటీఆర్ ఆదేశాల మేరకు పురపాలకశాఖ అధికారులు హెచ్‌ఎండీఏ నుంచి రూ.45.71 కోట్ల మొత్తాన్ని ఎఫ్‌ఈఓకు పౌండ్ల రూపంలో చెల్లించారు. వీటన్నింటిపైనా ఏసీబీ దర్యాప్తు చేస్తోంది.

కాలికి, చేతికి వైరు చుట్టి కరెంట్ షాక్ పెట్టి..


అన్నను చంపిన తమ్ముడు.. వదినతో వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని ఘాతుకం


మృతుడు శంకర్

శివ్వంపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వదినతో వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని అన్ననే చంపేశాడో తమ్ముడు.. అన్న నిద్రలో ఉండగా అతని కాలు, చేతికి విద్యుత్ వైర్లు చుట్టి.. కరెంట్ షాక్ పెట్టి ప్రాణం తీశాడు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం నానుతండాలో జరిగిన ఈ ఘటనలో తేజావత్ శంకర్(28) తన తమ్ముడి చేతిలో హతమయ్యాడు. పోలీసుల వివరాల మేరకు. నాను తండాకు చెందిన శంకర్ (28), గోపాల్ (20) అన్నదమ్ములు. శంకర్ గతంలో రెండు వివాహాలు చేసుకుని విడాకులు తీసుకున్నాడు. ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్నప్పుడు ఏడాది క్రితం తల్లిదండ్రులు లేని మరో యువతిని ప్రేమించి, పెళ్లి చేసుకుని తండాకు తీసుకొచ్చాడు. అయితే, శంకర్ భార్యతో గోపాల్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. తన భార్యతో గోపాల్ సన్నిహితంగా ఉండడాన్ని చూసిన శంకర్ తన భార్య జోలికి రావొద్దని హెచ్చరించాడు. అయినా, గోపాల్ మారకపోవడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా పెట్టారు. దీంతో శంకర్ భార్య ఇల్లు వదిలి వెళ్లిపోయింది. అప్పటి నుంచి శంకర్‌పై గోపాల్ కక్ష పెంచుకున్నాడు. అయితే ఓ చోరీ కేసులో ఇటీవల జైలుకు వెళ్లి వచ్చిన గోపాల్ అవకాశం కోసం చూస్తున్నాడు. ఈ క్రమంలో శంకర్ మద్యం తాగి శుక్రవారం రాత్రి నిద్రపోయాడు. అతని వద్దే నిద్రించిన గోపాల్ అర్ధరాత్రి తర్వాత మేల్కొని.. శంకర్ కాలు, చేతికి విద్యుత్ వైర్లు చుట్టి ప్లగ్ బోర్డులో స్విచ్ ఆన్ చేశాడు. దీంతో శంకర్ విద్యుదాఘాతానికి గురై కేకలు వేశాడు. ఈ అలికిడికి నిద్ర లేచిన వారి తండ్రి చందర్.. తలుపులు తీయమని అరిచాడు. తలుపు తీసిన గోపాల్ తండ్రి చందర్‌ను నెట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు గోపాల్‌ను అదుపులోకి తీసుకున్నారు.

చిట్టీ వేసిన డబ్బులు తిరిగివ్వాలన్నందుకు మహిళ హత్య

» 6 నెలల క్రితం గొంతునులిమి చంపి పూడ్చివేత


విజయ(ఫైల్)

మోపాల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తనకు రావాల్సిన చిట్టీ డబ్బులు అడిగినందుకు ఓ మహిళను దారుణంగా హత్య చేశాడో వ్యాపారి. ఆరు నెలల తర్వాత విషయం బయటపడింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లాలో జరిగింది. మోపాల్‌కు చెందిన విజయ(45) వ్యవసాయ కూలీ. ఆమె భర్త విజయ్. వీరికి ఇద్దరు కుమారులు. విజయ్ దుబాయ్‌లో ఉండగా పంపిన డబ్బుల విషయంలో గొడవలు వచ్చి భార్యాభర్తలు విడిగా ఉంటున్నారు. మరోవైపు, మోపాల్‌కే చెందిన బుచ్చన్న అనే వ్యాపారి దగ్గర విజయ కొన్నేళ్ల పాటు చిట్టీ వేసింది. ఏడాది క్రితం చిట్టీ గడువు పూర్తయ్యాక.. తనకు రావాల్సిన డబ్బులు ఇచ్చేయాలని బుచ్చన్నను అడిగింది. కానీ, బుచ్చన్న ఏడాది పాటు రేపిస్తా.. మాపిస్తా.. అంటూ తప్పించుకు తిరిగాడు. 6 నెలల క్రితం బుచ్చన్నపై విజయ గ్రామపెద్దల ముందు పంచాయతీ పెట్టించింది. దీంతో విజయపై కోపాన్ని పెంచుకున్న బుచ్చన్న.. చిట్టీ డబ్బులు ఇస్తానని జూలైలో ఆమెను ఇంటికి రమ్మన్నాడు. తన వద్ద పని చేసే నగేశ్ సహాయంతో విజయకు కల్లు తాగించి.. ఆ తర్వాత గొంతు నులిమి చంపేశాడు. గ్రామ శివారులో మృతదేహాన్ని పూడ్చి పెట్టాడు. విజయ కుమారుడు మనోహర్.. ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


డిప్యూటీ సీఎం భట్టికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దిల్‌రాజు, నర్సింగ్‌రావు

ఉగాదికి గద్దర్ అవార్డుల ప్రదానం

- సినీ రంగంలో ప్రపంచ గమ్యస్థానంగా హైదరాబాద్
- గత పదేళ్లలో చిత్ర పరిశ్రమను నిర్లక్ష్యం చేశారు
- అవార్డుల కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఉగాది నుంచి ప్రతి ఏటా గద్దర్ తెలంగాణ చలనచిత్ర అవార్డులను ప్రదానం యాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని అవార్డుల కమిటీ సభ్యులు, అధికారులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. శనివారం సచివాలయంలో గద్దర్ అవార్డుల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. తెలుగు భాషలో నిర్మించిన ఉత్తమ చిత్రాలను గుర్తించి, ప్రశంసిస్తూ అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. జాతీయ సమైక్యత పెంపు, సాంస్కృతిక, విద్య, సామాజిక సంబంధిత చిత్రాలు, అత్యున్నత సాంకేతిక నైపుణ్యం, మానవతా విలువలతో కూడిన చిత్రాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ అవార్డులు ఇవ్వనున్నామని పేర్కొన్నారు. అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని జాతీయ స్థాయి కార్యక్రమాల తరహాలో నిర్వహించాలని సూచించారు. గద్దర్ ప్రతిష్ఠను పెంచేలా అవార్డుల లోగో ఉండాలన్నారు. సినిమా రంగంలో హైదరాబాద్‌ను ప్రపంచ గమ్యస్థానంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. గత పదేళ్లుగా రాష్ట్రాన్ని పాలించినవారు చిత్ర పరిశ్రమను నిర్లక్ష్యం చేశారని, అవార్డుల ప్రదానం జరగలేదన్నారు. ఫీచర్ ఫిల్మ్‌లు, బాలల చిత్రాలు, తెలుగు సినిమాలపై పుస్తకాలు వంటి వివిధ విభాగాల కింద అవార్డులు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. అవార్డుల్లో నగదు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రాలను అందజేస్తారు. ఈ సమావేశంలో టీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు, ఎండీ హరీశ్, కమిటీ చైర్మన్ బి.నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు తరహాలో ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ఇండ్ల నిర్మాణాలు

మధ్య తరగతి ప్రజల కోసం టౌన్‌షిప్‌లు: మంత్రి పొంగులేటి

హిమాచల్‌ప్రదేశ్ మంత్రి రాజేష్ ధర్మానీతో భేటీ

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్), రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) మధ్యలో మధ్య తరగతి ప్రజలకు కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు తరహాలో ఇండ్ల నిర్మాణాలను చేపట్టబోతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కనీసం వంద ఎకరాల్లో ఈ టౌన్‌షిప్‌లను నిర్మించి మధ్య తరగతి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఇందుకోసం రాష్ట్రంలో కొత్త గృహ నిర్మాణ విధానాన్ని తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శనివారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ, సాంకేతిక విద్యాశాఖల మంత్రి ఎస్.హెచ్. రాజేష్ ధర్మాని సమావేశమయ్యారు. తెలంగాణలో ప్రభుత్వం చేపడుతున్న గృహనిర్మాణ పథకాల గురించి మంత్రి పొంగులేటిని ఆయన అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి వివరించారు.


హిమాచల్‌మంత్రి రాజేష్‌కు వేంకటేశ్వరస్వామి ప్రతిమను ఇస్తున్న మంత్రి పొంగులేటి

పంచాయతీ కార్మికుల వేతనాలపై మాట్లాడే నైతిక హక్కు హరీశ్ లేదు: సీతక్క

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల వేతనాలపై మాట్లాడే నైతిక హక్కు మాజీ మంత్రి హరీశ్ రావు లేదని మంత్రి సీతక్క అన్నారు. పంచాయతీ కార్మికుల వేతనాలపై హరీశ్ రావు వ్యాఖ్యల్ని ఆమె ఖండించారు. హరీశ్ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడే నెలల తరబడి జీతాలు రాక పంచాయతీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని శనివారం ఒక ప్రకటనలో ఆమె తెలిపారు. 13 మార్చి 2023న పంచాయతీ కార్మికులు కలెక్టరేట్ల ముందు వంటా వార్పు చేపట్టి నిరసన తెలిపిన వార్త కథనాలను మరిచారా అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు జీతాలివ్వకుండా అవస్థలు పెట్టి ఇప్పుడు మొసలి కన్నీరు కార్చడం వల్ల ప్రయోజనం ఏమీ ఉండదన్నారు. పంచాయతీ కార్మికులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల వంటి వేల మంది చిరుద్యోగులను కనీసం బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తించలేదని ఆమె ఆరోపించారు. కుటుంబం యూనిట్‌గా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామని తెలిపారు. ఇందులో మహిళలకే తొలి ప్రధాన్యం కల్పిస్తామని ఆమె పేర్కొన్నారు.

ప్రతీది రాజకీయం చేస్తున్న బీఆర్ఎస్: సురేఖ

చేగుంట/దుబ్బాక, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ప్రతి పనిని బీఆర్ఎస్ రాజకీయం చేస్తున్నది. మాజీ మంత్రి కేటీఆర్ తెలివి ఉండి మాట్లాడుతున్నారా.. తెలివి లేక మాట్లాడుతున్నారా?.. ఆయన పదేళ్లు మంత్రిగా ఉన్నట్లు మాట్లాడటం లేదు. 100 శాతం రుణమాఫీ కళ్లకు కనిపించడం లేదా?" అని మంత్రి కొండా సురేఖ ప్రశ్నించారు. మెదక్, సిద్దిపేట జిల్లాల్లో శనివారం ఆమె పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం గ్రామంలో చేగుంట, నార్సింగి మండలాలకు చెందిన లబ్ధిదారులకు మంత్రి కల్యాణలక్ష్మి, షాదీ ముబాకర్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె లేకరులతో మాట్లాడుతూ.. కల్యాణ లక్ష్మి, షాదీముబాకర్ పథకాలు పేదింటి ఆడపిల్లలకు వరం అని, అందుకే ప్రభుత్వం మారినా వాటిని కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వాలు మారినా పథకాలు ప్రజలకు అవసరం అనుకుంటే వాటిని అమలు చేయడం పాలకుల బాధ్యత అన్నారు.

మంత్రి సురేఖ పర్యటనలో ప్రొటోకాల్ వివాదం

మంత్రి కొండా సురేఖ పర్యటన ప్రొటోకాల్ వివాదం, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ వాతావరణంలో కొనసాగింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వేదికపై ముందు వరుసలో కూర్చోవడంపై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అభ్యంతరం తెలిపారు. దీంతో మంత్రి సురేఖ కల్పించుకుని శ్రీనివాస్‌రెడ్డిని వెనుక కూర్చోమని సర్దిచెప్పగా, ఆయన వెనకాలకు వెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు హోరీహోరీ నినాదాలు మార్మోగాయి. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇందిరమ్మ ఇళ్ల నమూనా భూమి పూజ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఫొటోను గృహనిర్మాణ శాఖ అధికారులు విస్మరించారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న మంత్రి సురేఖ అధికారులపై మండిపడ్డారు.

'గృహజ్యోతి'కి రూ.125.84 కోట్లు విడుదల

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గృహజ్యోతి పథకం కోసం జనవరి నెలకిగాను రూ.125.84 కోట్లను విద్యుత్ సంస్థలకు విడుదల చేస్తూ ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా శనివారం జీవో జారీ చేశారు. 200 యూనిట్ల దాకా వినియోగించే పేద వర్గాలకు ఈ పథకం ద్వారా ఉచితంగా విద్యుత్‌ను అందిస్తున్న విషయం విదితమే.

అర్హులందరికీ.. ఇళ్లు, కార్డులు

21 నుంచి గ్రామసభల్లో దరఖాస్తులు.. ప్రజాపాలనలో వచ్చినవీ పరిగణనలోకి

- కులగణన ఆధారంగా.. తయారు చేసింది తుది జాబితా కాదు
- ఇళ్లు, కార్డుల జారీ నిరంతర ప్రక్రియ
- ప్రజలెవరూ ఆందోళన చెందవద్దు
- మంత్రులు ఉత్తమ్, తుమ్మల, పొంగులేటి

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): "అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు జారీ చేస్తాం. రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతర ప్రక్రియ. చివరి లబ్ధిదారులను చేరేవరకు ఈ పథకం ఉంటుంది. దీనిపై ఎలాంటి ఆందోళన అవసరం లేదు" అని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు. ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామసభల్లో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు. దాంతోపాటు.. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఈ మేరకు జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీచేశారు. ఈ రెండు అంశాలతోపాటు.. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, గ్రామసభల నిర్వహణ తదితర అంశాలపై శనివారం వారు సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న రేషన్ కార్డుల లబ్ధిదారుల ముసాయిదా జాబితా కులగణన(సామాజిక సర్వే) ఆధారంగా తయారు చేసిందని, ఇది తుది జాబితా కాదని స్పష్టం చేశారు. "ఈ నెల 26 నుంచి రాష్ట్ర ప్రభుత్వం నాలు సంక్షేమ పథకాలకు ప్రతిష్ఠాత్మకంగా శ్రీకారం చుట్టబోతోంది. వాటిపై 21 నుంచి జరిగే గ్రామసభల్లో ప్రజాభిప్రాయాన్ని సేకరించాలి. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలను కొన్ని విపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయి. అధికారులు ఆ ఉచ్చులో చిక్కుకోవద్దు. గ్రామసభల్లో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులను స్వీకరించాలి. ప్రజాపాలన సేవాకేంద్రాల ద్వారా కూడా దరఖాస్తులను తీసుకోవాలి" అని కలెక్టర్లను ఆదేశించారు. ఇప్పటికే ప్రజాపాలన సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియ పురోగతిలో ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇళ్ల స్థలాలు ఉన్న వారి జాబితాను, లేనివారి వివరాలను గ్రామసభల్లో ప్రదర్శించాలని సూచించారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి భూమికి రైతు భరోసా అందిస్తామన్నారు. "వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా రైతు భరోసా లబ్ధిదారులను గుర్తించాలి. ఉపాధి హామీ పథకంలో కనీసం ఇరవై రోజుల పాటు కూలి పనికి వెళ్లిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపజేయాలి. కుటుంబంలోని మహిళల బ్యాంకు ఖాతాలకే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొత్తాన్ని బదిలీ చేస్తాం. ఇటీవల సమీప మునిసిపాలిటీల్లో కలిపిన 156 గ్రామాలకు సంబంధించిన 2023-24లో జరిగిన ఉపాధి హామీ పనుల జాబితాను పరిగణనలోకి తీసుకోవాలి" అని స్పష్టం చేశారు. కాగా, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగిరెడ్డిని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. శనివారం ఆయన గంగిరెడ్డికి ఫోన్ చేసి, బోర్డును సాధించిన రైతులు, ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు.

ఫోర్త్‌సిటీలో ఏఐ డేటా సెంటర్

(మొదటిపేజీ తరువాయి)


సింగపూర్ వాణిజ్య మంత్రితో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్ బాబు

సంస్థ సీఈవో.. 100 మెగా వాట్ల సామర్థ్యంతో కూడిన ఏఐ ఆధారిత డేటా సెంటర్‌ను హైదరాబాద్‌లో రూ.3500 కోట్ల పెట్టుబడితో నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. ఈమేరకు.. సీఎం రేవంత్ సమక్షంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సంస్థ బ్రూనో లోపెజ్ ఎంవోయూపై సంతకాలు చేశారు. డేటా సెంటర్ల నిర్వహణలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ఎస్టీ టెలీమీడియాకు ఇప్పటికే చైనా, యుకే, జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, మలేసియా, ఫిలిప్పీన్స్‌లో డేటా సెంటర్లు ఉన్నాయి. భారత్‌లోనూ హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీలో 8 మెగావాట్ల డేటా సెంటర్‌తో పాటు 10 నగరాల్లో డేటా సెంటర్లను కలిగి ఉంది. ముచ్చర్లలో నిర్మించబోయే డేటా సెంటర్ దేశంలోనే అతిపెద్ద సెంటర్లలో ఒకటిగా ఉంటుందని.. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా దాని సామర్థ్యాన్ని పెంచుతామని కంపెనీ వెల్లడించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే హైదరాబాద్ డేటా సెంటర్లకు రాజధానిగా అవతరిస్తుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేయటం గౌరవంగా ఉందని బ్రూనో లోపెజ్ పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలతో పాటు తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రగతిశీల విధానాలు సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించే విధంగా ఉన్నాయని కొనియాడారు. ఇక.. ప్రపంచానికి హైదరాబాద్ డేటా సెంటర్ల హబ్‌గా మారుతుందని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ ఆధారిత రంగాల్లో వస్తున్న వినూత్న మార్పుల్లో హైదరాబాద్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

పరస్పర సహకారం..

సింగపూర్‌లో పర్యటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం శనివారం ఆ దేశ వాణిజ్య, పర్యావరణ మంత్రి గ్రేస్ ఫు హైయిన్‌తో భేటీ అయింది. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాల గురించి వివరించగా.. ప్రభుత్వానికి సహకారంపై ఆమె సానుకూలంగా స్పందించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్య సాధనలో పాలుపంచుకోవాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్, నీటి వనరుల నిర్వహణ, తెలంగాణ ఎంచుకున్న సుస్థిర వృద్ధి ప్రణాళికలపై ఆమె ఆసక్తి ప్రదర్శించారు. పలు ప్రాజెక్టుల్లో పరస్పరం కలిసి పని చేసేందుకు అంగీకరించారు.

పారిశ్రామికవేత్తలతో..

తెలంగాణలో భారీ వ్యాపార అవకాశాలున్న సెమీ కండక్టర్ల రంగంలో పెట్టుబడులు పెట్టాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సింగపూర్ పారిశ్రామికవేత్తలను కోరారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న ఆధునిక మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అనుకూల విధానాల గురించి తెలిపేందుకు శనివారం ఆయన సెమీకండక్టర్ పరిశ్రమ అసోసియేషన్ (ఎస్ఎస్ఐఏ)తో ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఎస్ఎస్ఐఏ చైర్మన్ బ్రియాన్ టాన్, వైస్ చైర్మన్ టాన్ యూ కాంగ్, సెక్రటరీ సి.ఎస్.చుహ తదితర ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో సెమీకండక్టర్ల రంగంలో పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శించారు. ఈ ఏడాది చివర్లో సింగపూర్ నుంచి తమ ప్రతినిధుల బృందం హైదరాబాద్‌ను సందర్శించి, పరిశీలన జరుపుతుందని వారు తెలిపారు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి

సొంత రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని, రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగపూర్‌లో స్థిరపడ్డ ప్రవాస తెలంగాణ వాసులను కోరారు. సింగపూర్ పర్యటనలో ఉన్న ఆయన.. మంత్రి శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారులతో కలిసి తెలంగాణ సాంస్కృతిక సంఘం ఏర్పాటుచేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో శనివారం పాల్గొన్నారు. సింగపూర్ అభివృద్ధిలో తెలంగాణవాసుల భాగస్వామ్యం ఉండటం సంతోషంగా ఉందని పేర్కొన్న సీఎం.. పారిశ్రామిక అభివృద్ధిలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు.

కొత్తగా మరిన్ని డిపోలు, బస్‌స్టేషన్లు!

ప్రస్తుతం ఉన్న వాటి విస్తరణకు చర్యలు

ఆర్టీసీ బోర్డు సమావేశంలో నిర్ణయాలు

కొత్త బస్సులు, సదుపాయాలపై దృష్టి: పొన్నం



హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు కొత్త బస్ డిపోలు, బస్ స్టేషన్లను నిర్మించడంతోపాటు ప్రస్తుతం ఉన్న బస్ స్టేషన్ల విస్తరణకు చర్యలు చేపట్టాలని ఆర్టీసీ బోర్డు నిర్ణయించింది. బస్ భవన్‌లో శనివారం ఆర్టీసీ బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త డిపోల ఏర్పాటుతోపాటు ప్రస్తుతం ఉన్న 97 డిపోలు, బస్ స్టేషన్ల అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగిందని, అందుకు అనుగుణంగా బస్‌స్టేషన్లను విస్తరిస్తామని చెప్పారు. కొత్త బస్సులను కొనుగోలు చేస్తామని, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెడతామని తెలిపారు. కాగా, పెద్దపల్లిలో రూ.11.70 కోట్లు, ములుగు జిల్లా ఏటూరునాగారంలో రూ.6.28 కోట్లతో కొత్త బస్‌డిపోలు ఏర్పాటు చేయాలని బోర్డు సమావేశంలో నిర్ణయించారు. ములుగులో రూ.5.11 కోట్లు, హుజూర్‌నగర్‌లో రూ.3.75 కోట్లు, కోదాడ వద్ద రూ.17.95 కోట్లు, మధిరలో రూ.10కోట్లు, ములుగు జిల్లా మంగపేటలో రూ.51లక్షలతో కొత్త బస్‌స్టేషన్లు నిర్మించేందుకు బోర్డు అనుమతించింది. అలాగే, పెద్దపల్లి జిల్లా మంథని బస్‌స్టేషన్‌ను రూ.95 లక్షలతో విస్తరించాలని నిర్ణయించింది. 'సరస్వతి పుష్కరాల' దృష్ట్యా కాళేశ్వరంలో ఆధునిక బస్‌స్టేషన్ నిర్మాణానికి రూ.3.95 కోట్లు కేటాయిస్తూ బోర్డు అనుమతులిచ్చింది.

అబద్ధాల మీదే బీఆర్ఎస్ పుట్టుక

- తప్పుడు ప్రచారంతోనే పదేళ్ల పాలన
- రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు: భట్టి

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): "ఇచ్చిన ప్రతి గ్యారెంటీని అమలు చేస్తున్నాం. కానీ అర గ్యారెంటీ అమలు చేశామని విపక్ష నేతలు విమర్శలు చేస్తున్నారు. అబద్ధాల మీదే బీఆర్ఎస్ పుట్టింది. వాళ్లు అధికారంలో ఉన్నంతకాలం అబద్ధపు ప్రచారం చేసుకుని బతికారు. వాళ్లు పరిష్కరించలేని సమస్యలను కూడా మేం పరిష్కరిస్తున్నాం" అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ఉత్తర డిస్కమ్(ఎన్పీడీసీఎల్) పరిధిలో ఎంపికైన 92 మంది జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లకు నియామక పత్రాలను, ట్రాన్స్‌కోలో 20 మందికి కారుణ్య నియామక పత్రాలను ఉప ముఖ్యమంత్రి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏడు లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, ప్రస్తుతం తాము ఆ అప్పులనుంచి రాష్ట్రాన్ని బయటకు తీసుకువస్తున్నామని చెప్పారు. లక్షలాది మంది ఉద్యోగులకు 1వ తేదీనే వేతనాలు ఇచ్చే పరిస్థితిని తెచ్చామన్నారు. ఏడాదికాలంలోనే 56 వేల మందికి ఉద్యోగాలిచ్చామని చెప్పారు. "రుణమాఫీ జరిగిందో లేదో.. రూ. 500కు గ్యాస్ సిలిండర్ వస్తోందో లేదో గ్రామాల్లో తిరిగి పరిశీలించుకోవాలి" అని సూచించారు. వ్యవసాయ యోగ్యమైన భూములకే రైతు భరోసా అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈనెల 26వ తేదీ నుంచి రైతు భరోసాతో పాటు భూములు లేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు సహాయం అందించనున్నామని తెలిపారు. కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తామని ఆయన చెప్పారు.

సంక్షేమంతోపాటు మౌలిక వసతులపైనా దృష్టి

తమ ప్రభుత్వం సంక్షేమంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు కూడా నిధులు కేటాయిస్తోందని భట్టి తెలిపారు. దుబారా ఖర్చులు చేయకుండా సంపదను పెంచి ప్రతి పైసా పేదలకే పంచుతామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, జీడీపీ విద్యుత్ శాఖతో ముడిపడి ఉందని, నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. విద్యుత్‌శాఖలో 1912 టోల్‌ఫ్రీ నెంబర్ ఇచ్చామని, ఏ సమస్య వచ్చినా ఫోన్ చేస్తే వెంటనే పరిష్కరిస్తారని ఆయన పేర్కొన్నారు.

ఏ రాష్ట్రంలో లేని విధంగా రుణమాఫీ: తుమ్మల

శ్రీశైలం, సాగర్‌లో నిల్వలు తగ్గుతున్నందున్న పక్క రాష్ట్రాన్ని సంప్రదించి మన వాటా దక్కించుకుని రబీకి నీరందేలా చూసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. డిమాండ్‌కు తగ్గట్లుగా విద్యుత్‌ను అందించాలని, ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా నీళ్లందించామనే కీర్తి భట్టికి రావాలని ఆయన చెప్పారు. బడ్జెట్‌లో 35% నిధులను వ్యవసాయ శాఖకు తమ ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా రూ.30 వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేశామని ఆయన చెప్పారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దయనీయం

హైదరాబాద్‌లో వీధి లైట్ల మరమ్మతుకూ పైసలివ్వట్లే.. రాష్ట్రాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్ అప్పుల్లో ముంచాయి

- మెట్రో, ఆర్ఆర్ఆర్‌కు కేంద్ర సర్కారు నిధులిస్తోంది
- కేటీఆర్ సుప్రీం కోర్టు జడ్జి అయిపోయినట్లుంది: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పగా మారిస్తే, కాంగ్రెస్ సర్కారు దివాళా తీయిస్తోందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. విశ్వనగరంగా ప్రచా రం చేస్తున్న హైదరాబాద్‌లో వీధిలైట్ల మరమ్మతులకు కూడా డబ్బులు ఇవ్వలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. చివరకు మద్యం ఆదాయాన్ని కూడా ప్రభుత్వం మళ్లించిందంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థమవుతోందన్నారు. శనివారం, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. సంక్షేమ పథకాలకు బీజేపీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ఉచితాలకు తాము వ్యతిరేకమని ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఏ ప్రభుత్వమైనా ఆదాయం, ఖర్చులను బేరీజు వేసుకుని సంక్షేమ పథకాలను అమలు చేయాలని పేర్కొన్నారు. కేంద్రంలో ఆర్థిక పరిస్థితి బాగుందని.. అందుకే దేశవ్యాప్తంగా 83 కోట్ల మంది పేదలకు ఉచితంగా బియ్యం ఇస్తున్నామని చెప్పారు. ఒక పార్టీ నుంచి గెలిచిన సభ్యుడు ఆ పార్టీకి రాజీనామా చేస్తేనే మరో పార్టీలోకి చేర్చుకోవాలన్న షరతు విధిస్తేనే ఫిరాయింపులకు చెక్‌పడుతుందన్నారు. తెలంగాణ అభివృద్ధిలో భాగంగా మెట్రో రైల్ రెండో దశ, రీజినల్ రింగ్‌రోడ్డు, రీజినల్ రింగ్ రైల్ వంటి ప్రాజెక్టులను సాధించేందుకు చొరవ చూపాలని సీఎం రేవంత్ చేసిన విజ్ఞప్తిపై కిషన్‌రెడ్డి స్పందించారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కేంద్రమే నిధులు మంజూరు చేసిందని చెప్పారు. మెట్రో రెండో దశకు కేంద్ర క్యాబినెట్ ఆమోదంపై తాను బాధ్యత తీసుకుంటానని తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నతాధికారులతో చర్చిస్తానని చెప్పారు. రీజినల్ రింగ్ రైల్ సర్వేకు కేంద్రం నిధులు ఇచ్చిందని, అయితే, రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ చేయలేదని ఆయన అన్నారు.

త్వరలో 6లక్షల మంది కార్మికులకు కోటి బీమా

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సుప్రీం కోర్టు జడ్జి అయినట్లు ఉన్నారని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు ఖాయమంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యపై ఆయన స్పందించారు. పునర్విభజన చట్టం ప్రకారమే, ఏపీకి కేంద్రం నిధులు కేటాయిస్తోందని చెప్పారు. రాజ్యాంగ పుస్తకాన్ని జేబులో పెట్టుకుని తిరగడం తప్ప అందులో ఎన్ని పేజీలున్నాయో కూడా రాహుల్ గాంధీకి తెలియదని విమర్శించారు. చిరంజీవిని పార్టీలో చేర్చుకునేందుకు బీజేపీ అగ్రనాయకత్వం ఆలోచిస్తోందంటూ జరుగుతున్న ప్రచారంపై కిషన్‌రెడ్డి స్పందించారు. చిరంజీవి విశాల దృక్పథం కలిగిన వ్యక్తి అని, ఆయనతో పాటు మిగతా సినీ ప్రముఖులు కూడా వస్తామంటే పిలుస్తామని చెప్పారు. తన శాఖ పరిధిలో 6 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారికి త్వరలోనే రూ.కోటి బీమా సౌకర్యాన్ని కల్పిస్తామని వెల్లడించారు.

అధ్యక్ష పదవికి ఈటల అర్హులే..


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కావాలంటే పార్టీ సంస్థాగత నియమావళి ప్రకారం, రెండు పర్యాయాలు క్రియాశీల సభ్యత్వం (ఆరేళ్లు) ఉండాలని కిషన్‌రెడ్డి అన్నారు. అయితే, ఎంపీ ఈటల రాజేందర్ కూడా రేసులో ఉన్నందున ఆయన అర్హులవుతారా..? అన్న ప్రశ్నకు కిషన్‌రెడ్డి సమాధానమిచ్చారు. బీజేపీలో చేరిన తర్వాత ఈటల నాలుగు ఎన్నికల్లో(హుజూరాబాద్ ఉప ఎన్నిక.. గజ్వేల్, హుజూరాబాద్ అసెంబ్లీ ఎన్నిక, మల్కాజిగిరి ఎంపీ ఎన్నిక) పోటీ చేశారని, అందువల్ల ఆయనకు ఈ నిబంధన వర్తించదని తెలిపారు. సంఘ్ నేపథ్యం ఉన్నా, లేకున్నా అధ్యక్షులు కావొచ్చని చెప్పారు. వారం తర్వాత రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని కిషన్‌రెడ్డి వివరించారు.

రాష్ట్రంలో ఉప ఎన్నికలు తథ్యం: ఎన్వీఎస్ఎస్

న్యూఢిల్లీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం తథ్యమని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు రాజీనామా చేయడంలేదని, వారితో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్తే గెలవడం అసాధ్యమని ఆ పార్టీ భావిస్తోందని చెప్పారు. శనివారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలపై దర్యాప్తు సరిగా జరగడం లేదని విమర్శించారు.

రుణం చెల్లించాలని వేధింపులు.. బ్యాంకులోనే రైతు ఆత్మహత్య

ఆదిలాబాద్ ఐసీఐసీఐ బ్యాంకులో ఘటన


దేవ్‌రావ్ (ఫైల్)

ఆదిలాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రుణం తీర్చే అంశంలో బ్యాంకు సిబ్బంది వేధింపులు తాళలేక తీవ్ర మనోవేదనకు గురైన ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. తనకు అప్పు ఇచ్చిన బ్యాంకులోనే క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదిలాబాద్‌లో శనివారం జరిగిన ఈ ఘటనలో జాదవ్ దేవ్‌రావ్(50) అనే రైతు బలవన్మరణం పొందాడు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... ఆదిలాబాద్ జిల్లా బేల మండలం రేణిగూడకు చెందిన జాదవ్ దేవ్‌రావ్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే దేవ్‌రావ్.. ఆదిలాబాద్ టీచర్స్ కాలనీలోని ఐసీఐసీఐ బ్యాంకులో తన ఐదు ఎకరాల భూమిని తాకట్టు పెట్టి నాలుగేళ్ల క్రితం రూ.3.50లక్షల రుణం తీసుకున్నాడు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తున్నాడు. ఇటీవల పంట దిగుబడులు సరిగా లేక ఓ వాయిదా చెల్లింపులో జాప్యం జరిగి రూ.25 వేల మేర బకాయి పడ్డాడు. దీంతో రేణిగూడకు వెళ్లిన బ్యాంకు సిబ్బంది.. బకాయిలు చెల్లించాలని దేవ్‌రావ్‌ను వేధించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఆదిలాబాద్‌లోని ఐసీఐసీఐ బ్యాంకుకు శనివారం వచ్చిన దేవ్‌రావ్.. బ్రాంచీ మేనేజర్‌ను కలిశాడు. ఆ తర్వాత ఆవేశంగా బయటకు వెళ్లిపోయి క్రిమిసంహారక మందు డబ్బాతో కాసేపటికి బ్యాంకుకు తిరిగొచ్చాడు. అనంతరం బ్యాంకులోనే ఆ మందు తాగి అస్వస్థతకు గురై అక్కడే కూర్చున్నాడు. బ్యాంకు సెక్యూరిటీ సిబ్బంది దేవ్‌రావ్‌ను గమనించినా.. ఆస్పత్రికి తరలించే లోపే అక్కడే కుప్పకూలిపోయి ప్రాణం విడిచాడు. ఇదంతా బ్యాంకు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. రైతు ఆత్మహత్యపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి వివరాలు సేకరించారు. అలాగే, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, మాజీ మంత్రి జోగు రామన్న కూడా బ్యాంకు వద్దకు చేరుకుని జరిగిన ఘటనపై ఆరా తీశారు. ఇక, దేవ్‌రావ్ ఆత్మహత్య సంగతి తెలిసి బ్యాంకు వద్దకు వచ్చిన అతని కుటుంబసభ్యులు, గ్రామ ప్రజలు ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో ఎమ్మెల్యే పాయల శంకర్, మాజీ మంత్రి జోగు రామన్న, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్‌రెడ్డి.. బ్యాంకు అధికారులతో నాలుగైదు గంటల పాటు చర్చలు జరిపారు. అయితే, దేవ్‌రావ్ తీసుకున్న రూ.3.50 లక్షల రుణమాఫీకి, దేవ్‌రావ్ కుమారుడికి ఆరు నెలల శిక్షణ ఇచ్చి బ్యాంకులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇచ్చేందుకు బ్యాంకు అధికారులు అంగీకరించారు. దీనికి దేవ్‌రావ్ కుటుంబం కూడా అంగీకరించడంతో ఆందోళన సద్దుమణిగింది.

నేడు రాష్ట్రానికి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

» పోలీసు అకాడమీలో షూటింగ్ రేంజ్‌కు శంకుస్థాపన

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాల్లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆదివారం రానున్నారు. ఆయన ఆదివారం హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీ(ఎన్‌పీఏ)లో రూ.27 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ ఇండోర్ షూటింగ్ రేంజ్‌కు శంకుస్థాపన చేయనున్నారు. 50 మీటర్ల పొడవు... 10 వరుసల్లో ఉండే ఈ రేంజ్‌లో ఏకకాలంలో పదిమంది ఐపీఎస్ ప్రొబేషనరీ అధికారులకు తుపాకుల వినియోగంపై శిక్షణ ఇవ్వవచ్చు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ రేంజ్ ఉంటుంది. కేంద్ర హోం మంత్రి అంతకు ముందు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్డీఆర్ఎఫ్) 20వ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొని... రూ.220 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయనున్నారు.

ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం

» 1010, 1064 రకం ఎగుమతికి ఒప్పందం

హాలియా, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పండించిన 1010, 1064 రకం బియ్యాన్ని లక్ష టన్నులు ఫిలిప్పీన్స్‌కు ఎగుమతి చేయడానికి రాష్ట్ర సర్కారు ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా ఆ దేశ క్వాలిటీ అధికారులు తెలంగాణలో పెద్ద పరిశ్రమ అయిన నల్లగొండ జిల్లా హాలియా సమీపంలోని వజ్రతేజ రైస్ క్లస్టర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు శనివారం వచ్చారు. ధాన్యానికి టెస్ట్ మిల్లింగ్ నిర్వహించి, ఎగుమతికి ఉండాల్సిన ప్రమాణాలను పరిశీలించారు. బియ్యాన్ని వండి రుచి చూశారు. ఎగుమతికి కావాల్సిన నాణ్యత ఉందని, అదేవిధంగా పంపించాలని పౌరసరఫరాల శాఖ అధికారులకు సూచించారు. అయితే మిల్లర్లు సీఎంఆర్ కింద అప్పగించే బియ్యంలో 25శాతం నూకలు ఉండాలనే నిబంధన ఉంది. ఫిలిప్పీన్స్‌కు పంపించే బియ్యంలో 5శాతం మాత్రమే నూకలు ఉండేలా ఒప్పందం చేసుకున్నారు. దీంతో నూకలకు పరిహారం చెల్లించాలని మిల్లర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ సందర్భంగా హాలియాకు వచ్చిన రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంపా నాగేందర్ మాట్లాడుతూ మొదటి దశలో 40వేల టన్నులు, ఆ తర్వాత 60వేల టన్నుల బియ్యాన్ని ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు.

పోలీసులకు చిక్కిన దోపిడీ దొంగలు?

» రహస్య ప్రదేశంలో విచారణ!

హైదరాబాద్ సిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నడిబొడ్డున కాల్పులు జరిపి తప్పించుకున్న దోపిడీ దొంగలను పోలీసులు పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాల్పుల అనంతరం దొంగలు అఫ్జల్‌గంజ్‌లో ఆటో ఎక్కి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వైపు పారిపోయినట్లు గుర్తించిన పోలీసులు.. ఆ మార్గంలోని సీసీటీవీ కెమెరా ఫుటేజీ, సాంకేతిక ఆధారాలు సేకరించారు. దొంగలు ఆ రోజు రాత్రి 8 గంటలకు రైల్వే స్టేషన్ పరిసరాల్లో తిరిగినట్లు ఆధారాలు లభించాయి. ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా వారు ఎక్కడ దిగారు? ఆటోలో ఏం మాట్లాడుకున్నారు? ఎటు వెళ్లారు? అనే పలు కీలక విషయాలు తెలిసినట్లు సమాచారం. దోపిడీ దొంగలు బిహార్‌కు చెందిన అమిత్‌కుమార్, అనీశ్ గ్యాంగ్‌గా ప్రాథమికంగా గుర్తించిన పోలీసులు.. ఈ ముఠా బీదర్‌తో పాటు ఛత్తీస్‌గఢ్‌లో కూడా బ్యాంకులో రూ.70లక్షలు దోచుకుని పరారైనట్లు గుర్తించారు. ముఠాలో ఎంతమంది ఉన్నారు? వారి కార్యకలాపాలు తదితర అంశాలపై రహస్య ప్రదేశంలో విచారణ జరుపుతున్నట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించడంలేదు. కర్ణాటకలోని బీదర్‌లో సెక్యూరిటీ గార్డులపై కాల్పులు జరిపి, ఏటీఎంలో జమ చేయాల్సిన రూ.93లక్షలతో పరారైన దోపిడీ దొంగలు హైదరాబాద్‌కు చేరుకోవడం.. ట్రావెల్స్ ఉద్యోగి జహంగీర్‌పైనా కాల్పులు జరపడం తెలిసిందే.

ఆ మహిళ రుణమాఫీకి అర్హురాలు కాదు

» ఓర్వలేకే కేటీఆర్ విమర్శ: పట్నం మహేందర్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కుమ్మరిగూడకు చెందిన మహిళ చెన్నమ్మ.. రుణమాఫీకి అర్హురాలు కాదని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి వెల్లడించారు. భూమి ఆమె కొడుకుల పేరిట ఉందని, వారికి రుణమాఫీ అమలైందని తెలిపారు. షాబాద్‌లో శుక్రవారం జరిగిన బీఆర్ఎస్ సభలో తనకు రుణమాఫీ అమలు కాలేదంటూ కేటీఆర్ సమక్షంలో చెన్నమ్మ చేసిన వ్యాఖ్యలకు ఈ మేరకు వివరణ ఇచ్చారు. గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పథకాలు అమలవుతున్న తీరు చూసి కేటీఆర్ ఓర్చుకోలేక పోతున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలను తప్పుదారి పట్టించేందుకు కేటీఆర్ ప్రయత్నిస్తున్నారని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు.

పంచాయతీ ఉద్యోగుల జీతాలకు రూ.139.78 కోట్లు విడుదల

హైదరాబాద్, జనవరి 18 : గ్రామ పంచాయతీల్లో పని చేసే ఉద్యోగుల వేతనాల చెల్లింపునకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూ.139,78,49,000 నిధులను విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను శనివారం జారీ చేసింది. గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే ప్రతి నెలా గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనవరి 9న అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో చర్యలు తీసుకున్న అధికారులు.. అర్హులైన 52,482 మంది ఉద్యోగుల వివరాలను ఈ-పంచాయత్ పోర్టల్‌లో నమోదు చేశారు. ఈ మేరకు నిధులు రూ.139.78 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం.. 52,482 మంది ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించింది.

మరణంలోనూ.. 8 మందికి జీవితం

» బ్రెయిన్‌డెడ్ అయిన యువకుడి అవయవాల దానం

మోటకొండూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు బ్రెయిన్ డెడ్ కావడంతో అతడి అవయవాలను మరో ఎనిమిది మందికి దానం చేసి కుటుంబసభ్యులు ఆదర్శంగా నిలిచారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగింది. కుటుంబసభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మోటకొండూరుకు చెందిన మల్గా నవీన్(36) అతని కుమారుడు తనీశ్‌తో కలిసి ఈనెల 12న గ్రామంలోని వ్యవసాయ పొలానికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో మోటకొండూరు శివారులో విద్యుత్ స్తంభాలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయమై రక్తస్రావం అయింది. వెంటనే చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ 15న మృతి చెందాడు. నవీన్ అవయవాలను దానం చేయాలని వైద్యులు కోరగా కుటుంబసభ్యులు ఒప్పుకున్నారు. కాగా, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌కు తాళంవేసి గ్రామస్థులు, కుటుంబసభ్యులు ఆందోళన చేశారు. న్యాయం చేస్తామని పోలీసులు, విద్యుత్ అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

జగన్ జల్సా భవన్‌లు!

ప్యాలెస్‌లపై ఆరా తీసిన అమిత్‌షా.. విలాసాల భవంతులపై ఆశ్చర్యం

» బెంగళూరులో 32 ఎకరాల్లో... హైదరాబాద్‌లో వంద గదులతో భవనాలు

» ఎన్జీటీ జరిమానా కూడా వేసింది

» షాకు వివరించిన చంద్రబాబు, లోకేశ్

» ఎన్టీఆర్‌కు 'భారత రత్న'పై చర్చ

» ఆయన అర్హుడని అమిత్ షా అభిప్రాయం


అమిత్‌షాతో భేటీ అయిన బాబు, పవన్

అమరావతి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ పర్యటనకు వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ఘన స్వాగతం లభించింది. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కొండపావులూరులో ఆదివారం జాతీయ విపత్తు సంస్థలను ప్రారంభించడానికి విజయవాడకు అమిత్‌షా చేరుకున్నారు. ఆయన కోసం శనివారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు తన నివాసంలో ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. చంద్రబాబు ఇంటి ఆవరణలో కృష్ణా నది పక్కన నిర్మించిన తాత్కాలిక హాల్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తదితరులతో కలిసి అమిత్‌షా విందు ఆరగించారు. కృష్ణా తరంగాల మీదుగా... ఇంద్రకీలాద్రి పైనున్న కనకదుర్గమ్మ గుడి అలంకరణ కనిపించేలా అమిత్‌షాను కూర్చోబెట్టారు. ఎదురుగా గుడి చూస్తూ... 'నది పక్కన మీ ఇల్లు చాలా బాగుంది' అని అమిత్‌షా అన్నారు. అదే సమయంలో అనూహ్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్యాలె‌స్‌ల గురించి అమిత్‌షా ఆరా తీసినట్లు తెలిసింది. జగన్‌కు ఎన్ని ప్యాలెస్‌లు ఉన్నాయని అమిత్‌షా అడగ్గా... బెంగళూరులో ఆరు ఎకరాల్లో ఒక పెద్ద ప్యాలెస్ ఉన్నట్లుందని సీఎం చంద్రబాబు చెప్పారు. 'ఆరు కాదు.... మొత్తం 32 ఎకరాలు. అందులో పెద్ద ప్యాలెస్ కట్టుకొన్నారు. హైదరాబాద్‌లో కూడా ఆయన భవనంలో వంద గదులు ఉన్నాయి" అని మంత్రి లోకేశ్ వివరించారు. ముప్పై రెండు ఎకరాలా అని అమిత్ షా ఆశ్చర్యపోయారు. 'ఇవి చాలవని విశాఖపట్నంలో రూ. ఐదు వందల కోట్ల ప్రభుత్వ ధనం ఖర్చు పెట్టి తాను ఉండటం కోసం భారీ భవనాలు నిర్మించారు. నిబంధనలకు విరుద్ధంగా కట్టారని హరిత ట్రైబ్యునల్ ఆ నిర్మాణాలపై రూ. రెండు వందల కోట్లు జరిమానా విధించింది" అని చంద్రబాబు చెప్పారు. ఆ డబ్బులు జగన్ కట్టారా? అని అమిత్ షా అడిగారు. ఇంకా చెల్లించలేదని చంద్రబాబు బదులిచ్చారు. "హరిత ట్రైబ్యునల్ చాలా శక్తివంతమైంది. మేం గతంలో అండమాన్‌లో పర్యాటకుల కోసం ఒక భవనం కడితే ఇలాగే భారీ జరిమానా వేశారు. దానికోసం అనేకసార్లు మాట్లాడి కొంత తగ్గించగలిగాం. జరిమానా కట్టడం తప్ప వేరే మార్గం లేదు" అని అమిత్ షా తన అనుభవం వివరించారు. జగన్ ఏం చేస్తున్నారు... తిరుగుతున్నారు.. అని అమిత్‌షా అడిగారు. ప్రకటనలు ఇవ్వడం తప్ప ఇంతవరకూ పెద్దగా తిరుగుతోంది లేదని, సుదీర్ఘ యాత్రలు చేయబోతున్నానని లీకులు మాత్రం ఇస్తున్నారని లోకేశ్ వ్యాఖ్యానించారు.

ఎన్టీఆర్ భారతరత్న ఇవ్వదగ్గ వ్యక్తి : అమిత్‌షా

టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను సీఎం చంద్రబాబు కోరారు. ఆయన తప్పనిసరిగా ఇవ్వాల్సిన వ్యక్తి అని అమిత్ షా వ్యాఖ్యానించారు. తాను దానిపై ఒక లేఖను కూడా ఇచ్చానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి ఆయనకు చెప్పారు. తెలుగు ప్రధాని పీవీ నర్సింహారావును గుర్తు చేసుకొన్న ఆయన... పీవీ ఎన్నిసార్లు ముఖ్యమంత్రిగా చేశారు... ఎంత కాలం ఉన్నారని అడిగారు. "ఆయన కేవలం పదిహేను నెలలు మాత్రమే ముఖ్యమంత్రిగా ఉన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం అప్పట్లో పదేపదే ముఖ్యమంత్రులను మార్చేది" అని చంద్రబాబు తెలిపారు.

'విపత్తు' అధికారి అతి!

అమిత్‌షా పర్యటనకు వచ్చి హైడ్రామా

టీటీడీ అధికారులతో సమీక్ష అంటూ లేఖ

కేంద్ర హోంశాఖకు ఏపీ అభ్యంతరం

తమకే సంబంధంలేదన్న అధికారులు

అమరావతి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురి మరణం... తిరుమలలో అగ్నిప్రమాదంపై విపత్తు నిర్వహణ విభాగం అదనపు డైరెక్టర్ సంజీవ్ కుమార్ జిందాల్ ఈనెల 20వ తేదీన తిరుమలలో సమీక్ష నిర్వహిస్తారు. అందుకు తగిన ఏర్పాట్లు చేయండి"... అంటూ కేంద్ర విపత్తు నిర్వహణ డైరెక్టర్ ఆశిష్ గవాయ్ రాసిన లేఖ రాష్ట్ర యంత్రాంగంలో పెను దుమారం రేపింది. ఎందుకీ సమీక్ష... ఎవరీ అధికారి... అని ఆరా తీయడంతో ఇదంతా సదరు అధికారి 'ఓవర్ యాక్షన్' అని స్పష్టమైంది. దీనిపై కేంద్ర హోంశాఖకు తన అభ్యంతరం వ్యక్తం చేయడం... ఆ అధికారి 'సమీక్ష' రద్దు కావడం జరిగిపోయింది. అయితే, విజయవాడ సమీపంలోని కొండపావులూరులో నిర్మించిన ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎం భవన సముదాయాలను ప్రారంభించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం రాష్ట్రానికి చేరుకున్నారు. విపత్తు నిర్వహణ విభాగానికి సంబంధించిన ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సంజీవ్ కుమార్ కూడా విజయవాడకు వచ్చారు. పనిలోపనిగా తిరుమల వేంకటేశ్వరస్వామినీ దర్శించుకోవాలని ఆయన భావించినట్లుంది. ఈ పర్యటనపై అధికారిక ముద్ర వేసుకునేందుకే... 'క్రౌడ్ మేనేజ్‌మెంట్'పై సమీక్ష పేరుతో డైరెక్టర్ స్థాయి అధికారితో లేఖ పంపినట్లు తెలుస్తోంది. అయితే... రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాలతో ఆయన ప్రయత్నం బెడిసి కొట్టింది.

రైతులు ఇప్పుడు గుర్తొస్తున్నారా?

» రైతు దీక్షలంటూ విన్యాసాలు చేస్తున్నారు

» బీఆర్ఎస్ నేతలపై మంత్రి తుమ్మల ఫైర్



హైదరాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకురాని రైతులు బీఆర్ఎస్ పార్టీకి ఇప్పుడు గుర్తుకు వస్తున్నారా అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రశ్నించారు. వారి హయాంలో పంట నష్టపోయిన రైతులను ఏనాడైనా ఆదుకున్నారా అని నిలదీశారు. రైతు బంధు పేరుతో పంటల బీమా, వ్యవసాయ యాంత్రీకరణ పథకాలకు తిలోదకాలు ఇచ్చింది ఎవరని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు దీక్షల పేరుతో బీఆర్ఎస్ చేస్తున్న కొత్త విన్యాసాలు, వారి ప్రకటనలను చూసి తెలంగాణ రైతాంగం నవ్వుకుంటున్నారన్నారు. ఇటీవల రైతులు, రైతు సంక్షేమానికి సంబంధించిన అంశాలపై మాట్లాడుతన్న సందర్భంగా బీఆర్ఎస్ హయాంలో అమలుచేసిన పథకాలు, వాటి వివరాలు, ప్రస్తుత తమ ప్రభుత్వం అందిస్తున్న రైతు పథకాలు, వివరాలను మంత్రి తుమ్మల శనివారం మీడియాకు విడుదల చేశారు. "రైతు సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం పదే ళ్లలో ఏ ఒక్క ఏడాది కూడా సరైన కేటాయింపులు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలోనే రైతు సంక్షేమం కోసం ప్రత్యక్షంగా రూ.29,897 కోట్లు ఖర్చు చేసింది. మరో రూ.32వేల కోట్లను మద్దతు ధరతో పంటల సేకరణకు, ఉచిత విద్యుత్‌కు ఖర్చుచేశాం. బీఆర్ఎస్ ప్రభుత్వం రుణ మాఫీని ఏకకాలంలో చేయకపోవడం వలన రైతులపై రూ.8,515కోట్ల భారం పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల వరకు ఉన్న రుణాలను ఏక కాలంలో మాఫీ చేసింది. 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616.89 కోట్ల రుణాలను మాఫీ చేశాం. మరో 3,13,896 మంది రైతులకూ మరో రూ.2,747.67 కోట్ల రుణాలను మాఫీ చేశాం. రైతుబంధును పదేళ్లలో కేవలం రెండు సందర్భాలలో తప్ప ఎప్పుడూ 4 నెలలోపు చెల్లించలేదు. ఈ ఏడాది రైతుభరోసా ద్వారా ఎకరానికి రూ.6వేల చొప్పున జనవరి 26నుంచి ఇవ్వనున్నాం. గత ప్రభు త్వం ఏ పంటకూ బోనస్ ఇవ్వలేదు. మా ప్రభుత్వం సన్నధాన్యానికి క్వింటాకు రూ.500 చొప్పున బోనస్‌ను ప్రకటించింది" అని తుమ్మల వివరించారు.

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతుల సంఖ్య 18

నిర్ధారిస్తూ లేఖ విడుదల చేసిన మావోయిస్టులు .. 12 మంది చనిపోయినట్లు పోలీసుల ప్రకటన


లొంగిపోయిన 22 మంది మిలీషియా సభ్యులు

వరంగల్ ప్రతినిధి/చర్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని దక్షిణ బస్తర్ మారేడుబాక అడవుల్లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల సంఖ్య 12 కాదా? మొత్తం 18 మంది చనిపోయారా? వీరిలో తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి చొక్కారావు అలియాస్ దామోదర్ ఉన్నారా? ఈ ప్రశ్నలకు మావోయిస్టు పార్టీ ఔననే పేర్కొంటూ దక్షిణ బస్తర్ కార్యదర్శి గంగా పేరుతో శనివారం మీడియాకు ఓ లేఖ పంపింది. అంతేకాదు.. ఈ ఎన్‌కౌంటర్‌లో పోలీసుల వైపు కూడా మరణాలు నమోదయ్యాయని, దామోదర్ వీరోచితంగా పోరాడి, అమరుడయ్యారని ఆ లేఖలో వెల్లడించింది. అయితే.. అటు ఛత్తీస్‌గఢ్, ఇటు తెలంగాణ పోలీసులు మాత్రం ఈ విషయాన్ని ధ్రువీకరించడం లేదు. చనిపోయిన మావోయిస్టుల్లో పెద్ద నాయకులెవరూ లేరని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. శనివారం మధ్యాహ్నం దక్షిణ బస్తర్ కమిటీ కార్యదర్శి గంగా పేరుతో మీడియాకు విడుదలైన ప్రెస్‌నోట్‌లో.. "12 మంది చనిపోయినట్లు పోలీసులు పేర్కొన్నారు. అయితే.. మొత్తం 18 మంది చనిపోయారు. ఆరు మృతదేహాలను మా వెంట తీసుకెళ్లాం. మృతుల్లో మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చొక్కారావు అలియాస్ దామోదర్, హంగి, దేవే, జోగా, నర్సింహారావు ఉన్నారు. దామోదర్‌పై రూ.50 లక్షల రివార్డు ఉంది" అని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ కూడా ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. అయితే.. నక్సల్స్ లేఖను ధ్రువీకరించకుండా.. "18 మంది చనిపోయారని మావోయిస్టులు చెబుతున్నారు. వారిలో దామోదర్ ఉన్నట్లు వారు(నక్సల్స్) అంగీకరిస్తున్నారు" అని పేర్కొన్నారు. కానీ, ఆ వివరాలను ధ్రువీకరించలేదు. తెలంగాణ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ) అధికారులు కూడా ఆ లేఖను ధ్రువీకరించలేదు. "మాకు అందిన సమాచారం ప్రకారం ఆ ఎన్‌కౌంటర్‌లో పెద్ద నాయకులెవరూ లేరు. నర్సింహారావు అనే తెలుగు మావోయిస్టు మృతిచెందినట్లు నిర్ధారణ అయ్యింది" అని స్పష్టం చేశారు.

ఎవరీ దామోదర్?

ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన బడే బతుకమ్మ-ఎల్లయ్య దంపతులకు చిన్న కుమారుడు బడే చొక్కారావు అలియాస్ దామోదర్ స్కూలులో చదువుతున్నప్పుడే.. అతని పెదనాన్న కుమారులు బడే నాగేశ్వర్‌రావు, పూర్ణచందర్ నక్సలిజం వైపు మళ్లారు. వారి ప్రభావం దామోదర్‌పై పడి.. గోవిందరావుపేటలో ఇంటర్ చదువుతున్నప్పుడు అప్పటి పీపుల్స్‌వార్ అనుబంధ సంస్థ రాడికల్ స్టూడెంట్ యూనియన్(ఆర్ఎస్‌యూ)లో వరంగల్ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 1993లో అజ్ఞాత దళంలో చేరారు. అంచెలంచెలుగా ఎదిగి.. తెలంగాణ యాక్షన్ టీమ్ కమాండర్‌గా పనిచేశారు. 2021లో కొవిడ్ సమయంలో యాప నారాయణ అలియాస్ హరిభూషణ మరణంతో రెండేళ్ల పాటు మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి స్థానం ఖాళీగా ఉంది. కేంద్ర కమిటీ ఆదేశాలతో దామోదర్ 2023 జనవరిలో ఆ బాధ్యతలను స్వీకరించారు. దామోదర్ మరణించాడనే ప్రచారంతో ఆయన కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

22 మంది మిలీషియా సభ్యుల లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా ఎర్రపల్లికి చెందిన 22 మంది మిలీషియా సభ్యులు శనివారం భద్రాద్రి-కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజ్ ఎదుట లొంగిపోయారు. వీరిని అన్నిరకాలుగా ఆదుకుంటామని ఎస్పీ ఈ సందర్భంగా ప్రకటించారు. చర్ల పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాజువర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన అజ్ఞాత దళ సభ్యుల కుటుంబీకులతో జరిగిన ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా మిలీషియా సభ్యులు లొంగిపోయారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఏడాది కాలంలో తెలంగాణలో మావోయిస్టుల సంఖ్య తగ్గిందన్నారు. గతంలో 36 మంది నక్సల్స్ ఉండగా.. ఇప్పుడు వారి సంఖ్య నాలుగుకు చేరిందని పేర్కొన్నారు. భద్రాద్రి-కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్, సభ్యులు మధు, వెంకటేశ్, చంద్రన్న కూడా పోలీసుల ఎదుట లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. నక్సల్స్ కుటుంబ సభ్యులు, లొంగిపోయిన మిలీషియా సభ్యులతో కలిసి ఎస్పీ సహపంక్తి భోజనం చేశారు.

మంచు కుటుంబ వివాదంలో కొత్త మలుపు

» ఇల్లు ఖాళీ చేయించాలని జిల్లా మెజిస్ట్రేట్‌కు మోహన్‌బాబు ఫిర్యాదు

» మనోజ్‌కు నోటీసులు జారీ.. అదనపు కలెక్టర్ ఎదుట హాజరైన నటుడు

» నేను తప్పు చేయలేదు.. మావి ఆస్తి గొడవలు కాదు.. విద్యార్థుల కోసం పోరాటం

» న్యాయం దక్కేంతవరకు వెనక్కుతగ్గను: మంచు మనోజ్


రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ వద్దకు వెళుతున్న మనోజ్

రంగారెడ్డి అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు మంచు మోహన్‌బాబు కుటుంబ వివాదం రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. కేసులు, పోలీసు విచారణలు, కోర్టుల్లో వాయిదాల తర్వాత కొంత శాంతించినట్లు కనిపించినా మరో వివాదం తెరమీదకు వచ్చింది. హైదరాబాద్ శివారు జల్‌పల్లిలోని తన ఇంట్లో ఉంటున్న చిన్న కుమారుడు మనోజ్‌ను ఖాళీ చేయించాలని కొన్ని రోజుల క్రితం జిల్లా మెజిస్ట్రేట్‌ను మోహన్‌బాబు ఆశ్రయించారు. దీంతో తాజాగా మోహన్‌బాబు నివాసంలో ఉంటున్న మనోజ్‌కు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నోటీసులు పంపించారు. వాటికి వివరణ ఇచ్చేందుకు మనోజ్ శనివారం రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఎదుట హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. "నాన్నగారిని నేను ఎప్పుడూ వ్యతిరేకించను. కేవలం నా అన్న.. నాన్నను ముందుకునెట్టి వెనుకనుంచి ఆడుతున్న నాటకం ఇది" అని ఆరోపించారు. నివాసం ఖాళీ చేయమని కలెక్టర్ ఇచ్చిన నోటీసులపై లిఖితపూర్వకంగా స్పందిస్తానని, దాన్ని మీడియాకు కూడా విడుదల చేస్తానని తెలిపారు. తమవి ఆస్తి గొడవలు కాదని, తమ విద్యాసంస్థలో విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించినందుకు ఆస్తి గొడవలుగా ప్రచారం చేస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు జరుగుతున్న నష్టంపై తాను మెసేజ్ రూపంలో తెలిపినా పట్టించుకోలేదన్నారు. కుటుంబ సభ్యులందరూ కూర్చొని మాట్లాడుకుందాం అని ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ రావడం లేదని పేర్కొన్నారు. జల్‌పల్లిలోని నివాసంలో తన కూతురు ఉందని చెప్పినా పంపకపోవడంతోనే గొడవలు జరిగాయన్నారు. ఈ పోరాటం అంతా విద్యార్థులు, తన కుటుంబం, బంధువుల కోసమని.. ఎన్ని కేసులు పెట్టినా ఆపేది లేదని, న్యాయం జరిగేవరకు కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.